

RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 3 | సంచిక : 153 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | శుక్రవారం 10 అక్టోబర్ 2025 | వెల : 4/-




## భారత్‌కు తాలిబాన్ మంత్రి

- ప్రయాణ నిషేధం మినహాయింపు..
- ఆమిర్ ఖాన్ అధికారికంగా భారత్‌లో జరుపుతున్న తొలి పర్యటన
- ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు, పలు ప్రాంతీయ అంశాలపై చర్చించేందుకు వారం రోజుల పాటు ఆయన భారత్‌లో పర్యటన
- ఇరు దేశాల దౌత్య సంబంధాలు, ప్రాంతీయ సమస్యలపై చర్చలు

## లోకల్ బాడీ ఎన్నికలు

# నిలిపివేత

- లోకల్ బాడీ ఎన్నికలను నిలిపివేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ
- ఎన్నికల నోటిఫికేషన్ విడుదలపై స్టే విధిస్తూ హైకోర్టు ఉత్తర్వులు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం జీవో 9 పై కూడా హైకోర్టు స్టే
- రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని పిటిషనర్‌కు మరొకవైపు నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు ఆదేశాలు
- హైకోర్టు ఆర్డర్‌ను పరిశీలించిన తర్వాత రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకోనుంది




హైదరాబాద్

హైకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి ఎదురు దెబ్బ తగిలింది. తెలంగాణ లోకల్ బాడీ ఎన్నికలను నిలిపివేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలపై స్టే విధిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం జీవో 9 పై కూడా హైకోర్టు స్టే విధించింది. దీనిపై రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని పిటిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. మరొకవైపు నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనిలో భాగంగా విచారణను ఆరు వారాలు వాయిదా వేసింది. హైకోర్టు నిర్ణయంతో రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక - మిగతా3లో




## స్థానిక ఎన్నికలకు

# నోటిఫికేషన్

- మొదటి దశలో 292 జడ్పీటీసీ, 2, 963 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు
- మూడు రోజుల పాటు నామినేషన్ల స్వీకరణ
- 12న వాటిని పరిశీలిన.. 15 వరకు ఉపసంహరణకు అవకాశం
- ఈ నెల 23న పోలింగ్.. నవంబర్ 11న ఓట్ల లెక్కింపు

హైదరాబాద్

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. మొదటి విడతకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు అధికారులు ప్రత్యేక ప్రకటన చేశారు. మొదటి దశలో 292 జడ్పీటీసీ, 2, 963 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. దీనికి ఇవాళ్టి నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. మూడు రోజుల - మిగతా3లో



## భారత అభివృద్ధిపై యూకే ప్రధాని ప్రశంసలు

- ట్రంప్ డెడ్ ఎకానమీ వ్యాఖ్యలకు కౌంటర్
- భారత్ ఇటీవలే జపాన్‌ను అధిగమించి నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది
- 2028 నాటికి భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా పయనిస్తోంది
- ఇక్కడికొచ్చి ఈ పరిస్థితులు చూస్తుంటే మీరు లక్ష్యాన్ని చేరుకునే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది.




## ఆసక్తికరం... బీహారీయం

- గత ఎన్నికల కంటే భిన్నంగా బీహార్ అసెంబ్లీ ఎన్నికలు
- ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తర్వాత జరుగుతున్న మొదటి ఎన్నిక ఇది
- బీహార్‌లో సీట్ల పొత్తుపై అటు ఎన్డీఏ కూటమి, ఇటు ఇండి కూటమి కసరత్తు వేగవంతం
- చెరి సగం సీట్లలో పోటీ చేయాలన్న ఆలోచనలో భారతీయ జనతా పార్టీ, జేడీయూ పార్టీలు
- అయితే 40 సీట్లు ఇవ్వకుంటే ప్రశాంత్ కిశోర్‌తో పొత్తుకు చిరాగ్‌పాశ్వాన్ రెడీ అవుతున్నట్టు వార్తలు

## కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను రాజకీయంగా వాడుకుంటోంది

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- రిజర్వేషన్లలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన విధానం దురదృష్టకరం
- రేవంత్ సర్కార్ చేతకాని తనం కారణంగానే.. ఈ తీర్పు వెలువడింది
- బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్న విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు
- స్టే రావడానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వం: రామ్‌చందర్ రావు



ఢిల్లీ

బీసీ రిజర్వేషన్లలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 9పై హైకోర్టు స్టే విధించడంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. రిజర్వేషన్లలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన విధానం దురదృష్టకరమని పేర్కొన్నారు. రేవంత్ సర్కార్ చేతకాని తనం కారణంగానే.. ఈ తీర్పు వెలువడిందని విమర్శించారు. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్న విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని - మిగతా3లో

## బస్సెక్కిన కేటీఆర్, హరీష్ ప్రభుత్వానికి అల్టిమేటం

- ఉప్పల్ మియపూర్ వర్క్ షాప్స్ అమ్మకానికి పెట్టారు
- బస్ స్టాండ్‌లు కూదవబెట్టి 1500 కోట్లు తెచ్చారు
- మాజీ మంత్రి హరీష్ రావు
- నాయకులను, కార్యకర్తల్ని ఎందుకు అరెస్టులు చేస్తున్నారు
- ప్రజాస్వామ్య పునరుద్ధరణ అంటే ఇదేనా?



హైదరాబాద్

అడ్డగోలుగా పెంచిన ఆర్టీసీ టికెట్ ధరల పెంపుకు నిరసనగా బి ఆర్ ఎస్ పార్టీ 'చలో బస్ భవన్' కు పిలుపునిస్తే మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులను ఎక్కడిక్కడ హౌస్ అరెస్టులు చేయడం అత్యంత దుర్మార్గమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. ఇది అప్రజాస్వామికం, కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశత్వానికి ఇది నిదర్శనం. నాయకులను, కార్యకర్తల్ని ఎందుకు అరెస్టులు చేస్తున్నారు. ప్రజాస్వామ్య పునరుద్ధరణ అంటే ఇదేనా? వెంటనే అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ - మిగతా3లో



## కొన్ని పార్టీలు ఎస్ఐఆర్‌కు సహకరించడం లేదు

- తప్పుడు కథనాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయి
- అంతకుముందు ప్రతిపాదిత జాబితాలో పేరు ఉండి, తుది జాబితాలో తొలగించిన 3.36లక్షల ఓటర్ల వివరాలను అందజేయాలి
- ఈ అంశం గందరగోళంగా ఉందని, వీరికి అప్పీలు చేసుకునే అవకాశం కల్పించాలని స్పష్టం

## ఏం జరిగిన ముందుకు వెళ్దాం

- పార్టీ నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి
- తొలివిడత అభ్యర్థుల జాబితా సిద్ధం కావాలి
- "ఇన్‌ఛార్జి మంత్రులు.. ముఖ్య నేతలతో చర్చించి అభ్యర్థులను ఖరారు చేయాలి
- నామినేషన్ల ప్రక్రియకు పూర్తిస్థాయిలో సమయం కేటాయించాలి
- నామినేషన్ల దరఖాస్తు నమూనా పత్రం క్షేత్రస్థాయికి పంపాలి
- రిజర్వేషన్ల దామాషా ప్రకారం అభ్యర్థులను ఖరారు చేయాలి



హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై అన్ని పరిస్థితులను ఎదుర్కొని ముందుకు వెళ్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పార్టీ నేతలతో నిర్వహించిన భేటీలో ఆయన మాట్లాడారు. "ఇన్‌ఛార్జి మంత్రులు.. ముఖ్య నేతలతో చర్చించి అభ్యర్థులను ఖరారు చేయాలి. నామినేషన్ల ప్రక్రియకు పూర్తిస్థాయిలో సమయం కేటాయించాలి. నామినేషన్ల దరఖాస్తు నమూనా పత్రం క్షేత్రస్థాయికి పంపాలి. రిజర్వేషన్ల దామాషా ప్రకారం అభ్యర్థులను ఖరారు చేయాలి. వారికి బీ ఫారం ఇవ్వాలి.. నో డ్యూ పత్రాలు ఇప్పించాలి. న్యాయపరమైన అంశాల నివృత్తికి గాంధీ భవన్‌లో సమన్వయ కమిటీ ఉండాలి. టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలి. ఎన్నికల ప్రక్రియపై అవగాహన ఉన్నవారు కమిటీలో ఉండేలా చూడాలి. ఎంపీపీలు, జడ్పీ ఛైర్మన్ పదవుల ఎంపికను పీసీసీ నిర్ణయిస్తుంది. పీసీసీ నిర్ణయించే వరకు రాజకీయ ప్రకటనలు చేయవద్దు. - మిగతా3లో

# ఆసక్తికరం... బీహారీయం




**పాట్నా :** ఈ సంవత్సరం జరిగే బీహార్ అసెంబ్లీ ఎన్నికలు గత ఎన్నికల కంటే భిన్నంగా ఉండబోతున్నాయి. కొత్త పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. చిరాగ్ పాస్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) తిరిగి ఎన్డీఏ శిబిరంలోకి చేరడం, ప్రశాంత్ కిషోర్ నేతృత్వంలోని జాన్ సురాజ్ ఎన్నికల అరంగేట్రం చేయడం, అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని మజ్లీస్ ప్రభావం మొత్తం ఎన్నికల ఫలితాన్ని ప్రభావితం చేసే అవకాశంతో మరో అనిశ్చితి కనిపిస్తుంది. ఇక, ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) తర్వాత జరుగుతున్న మొదటి ఎన్నిక ఇది..! బీహార్‌లో సీట్ల పొత్తుపై అటు ఎన్డీఏ కూటమి , ఇటు ఇండి కూటమి కసరత్తును వేగవంతం చేశాయి. చెరి సగం సీట్లలో పోటీ చేయాలన్న ఆలోచనలో భారతీయ జనతా పార్టీ, జేడీయూ పార్టీలు ఉన్నాయి. కాంగ్రెస్‌కు ఆర్జేడీ 55 సీట్లను ఆఫర్ చేసింది.బీహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల అయ్యింది. సీట్ల పొత్తుపై ఎన్డీఏ, ఇండి కూటమి నేతలు చర్చలు ప్రారంభించారు. చెరి సగం సీట్లలో పోటీ చేయాలన్న ఆలోచనతో జేడీయూ, బీజేపీ ఉన్నట్టు తెలుస్తోంది. 205 సీట్లలో రెండు పార్టీలు పోటీ చేయాలని నిర్ణయించాయి. మిత్రపక్షాలకు 38 సీట్లు ఇచ్చేందుకు సిద్ధమయ్యాయి. చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని ఒఏఖ తమకు 40 సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. అయితే బీజేపీ నేతలు మాత్రం 25 సీట్లు ఆఫర్ చేశారు. అయితే 40 సీట్లు ఇవ్వకుంటే ప్రశాంత్ కిశోర్‌తో పొత్తుకు చిరాగ్‌పాశ్వాన్ రెడీ అవుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. చిరాగ్ పాశ్వాన్‌కు నచ్చచెప్పడానికి కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆయనతో సమావేశమయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో ఐదు సీట్లలో పోటీ చేస్తే తాము అన్ని సీట్లలో గెలిచామని, దీని ఆధారంగా తమకు సీట్లు కేటాయించాలని చిరాగ పాశ్వాన్ పట్టుబడుతున్నారు.మాకు ఎలాంటి అసంతృప్తి లేదు. లోక్‌సభ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏతో కలిసి పోటీ చేస్తామని పార్టీ అధ్యక్షులు చిరాగ్ పాశ్వాన్ ఇప్పటికే ప్రకటించారు. సీట్ల పొత్తుపై సీనియర్ నేతలు చర్చలు జరుపుతున్నారు. చర్చల్లో చిరాగ్ పాశ్వాన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. 100 శాతం స్ట్రయిక్ రేటు ఉందని, యువ నాయకత్వం ఉంది. మహిళలకు ప్రాతినిధ్యం ఉంది. గౌరవప్రదమైన సంఖ్యలో సీట్లు కేటాయించాలని ఒఏఖ ఎంపీ శాంభవి చౌదరి అన్నారు. ఎన్డీఏ కూటమిలో జేడీయూ, బీజేపీ, హిందుస్థానీ అవామ్ మోర్చా, రాష్ట్రీయ లోక్‌సమతా పార్టీలు ఉన్నాయి. హెచ్‌ఏఎంకు ఏడు, ఆర్‌ఎల్‌ఎంకు ఆరు సీట్లు ఇచ్చేందుకు బీజేపీ రెడీగా ఉంది. ఇండి కూటమిలో కూడా సీట్ల పొత్తుపై చర్చలు కొనసాగుతున్నాయి. 150 సీట్లు కావాలని ఆర్జేడీ నేతలు పట్టుబడుతున్నారు. కాంగ్రెస్‌కు 55 సీట్లు ఇస్తామని ఆఫర్ చేస్తున్నారు. మిగతా సీట్లను మిత్రపక్షాలకు ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. బుధవారం కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశమవుతుంది. ఈ సమావేశం తరువాత పార్టీ అభ్యర్ధులను ప్రకటించే అవకాశం ఉంది.ఎన్నికల వ్యూహకర్త, రాజకీయ నాయకుడిగా మారిన ప్రశాంత్ కిషోర్ తాను కొత్తగా స్థాపించిన జాన్ సురాజ్ రాబోయే బీహార్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. పార్టీ అభ్యర్థుల జాబితాను అక్టోబర్ 9న ప్రకటిస్తామని కిషోర్ సోమవారం తెలిపారు. రాబోయే బీహార్ ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని ప్రశాంత్ కిషోర్ ప్రకటించారు. అయితే, తాను పోటీ చేసే నియోజకవర్గం పేరును ఆయన వెల్లడించలేదు. ఎన్డీయే లేదా ఇండియా బ్లాక్‌కు ఓటు వేయని 28 శాతం ఓటర్ల జన్ సురాజ్ పార్టీకి వస్తాయని కిషోర్ ఆశాభావం వ్యక్తం చేశారు.2020 నాటి విజయాన్ని పునరావృతం చేయాలనే లక్ష్యంతో, రాబోయే బీహార్ ఎన్నికలకు సీమాంచల్ నుండి తన పార్టీ ప్రచారాన్ని ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ప్రారంభించారు. కిషన్‌గంజ్, కతిహార్, అరారియా, పూర్ణియా అనే నాలుగు జిల్లాలను కలిగి ఉన్న సీమాంచల్ ప్రాంతంలో అడుగుపెడుతోంది. 2020 బీహార్ ఎన్నికల్లో, ంఎఓఎఓ నాలుగు సీమాంచల్ జిల్లాల్లోని 24 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టి, వాటిలో ఐదు స్థానాల్లో విజయం సాధించింది. అయితే, 2022లో, మజ్లీస్ కి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు ఖీఏఆకి ఫిరాయించారు.నవంబరు 6, 11 తేదీల్లో రెండు విడతలుగా బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి. నవంబర్ 14వ తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుంది. షెడ్యూలును ప్రకటించడంతో ఎన్నికల కోడ్ సోమవారం నుంచే అమల్లోకి వచ్చింది. బీహార్ ప్రస్తుత అసెంబ్లీ గడువు నవంబరు 22వ తేదీతో ముగియనుంది. కులగణన, నిరుద్యోగం, వలసలు ప్రధానాంశాలుగా ఎన్నికలు జరగబోతున్నాయి.243 మంది సభ్యులున్న బీహార్ అసెంబ్లీలో 121 స్థానాలకు నవంబర్ 6న ఎన్నికలు జరుగుతాయి. మిగిలిన 122 నియోజకవర్గాలకు నవంబర్ 11న ఎన్నికలు జరుగుతాయి. ప్రస్తుత అసెంబ్లీలో అధికార ఎన్డీఏకు 138 మంది సభ్యులు ఉండగా, ప్రతిపక్ష కూటమికి 103 మంది సభ్యులు ఉన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ పదే పదే ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివ్యూ తర్వాత జరుగుతున్న మొదటి ఎన్నిక ఇది.

## బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు..
## 51 మంది అభ్యర్థులతో ప్రశాంత్ కిషోర్ పార్టీ తొలి జాబితా




**పాట్నా:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ప్రశాంత్ కిషోర్ నేతృత్వంలోని జన్ సురాజ్ పార్టీ 51 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల చేసింది. పాఠ్యపుస్తకాలు రాసిన గణిత శాస్త్రజ్ఞుడు, రిటైర్డ్ పోలీసు అధికారి, వైద్యుడు, మాజీ అధికారులు ఈ జాబితాలో ఉన్నారు. అవినీతిపై గళమెత్తిన ప్రశాంత్ కిషోర్, క్లీన్ ఇమేజ్ ఉన్న అభ్యర్థుల ఎంపికపై దృష్టిసారించారు. తొలి జాబితా అభ్యర్థుల్లో 17 శాతం బీసీలు, 16 శాతం ముస్లిం అభ్యర్థులున్నారు. కాగా, ప్రముఖ గణిత శాస్త్రజ్ఞుడు కేసీ సిన్హా, కుమ్రార్ స్థానం నుంచి జన్ సురాజ్ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. గతంలో పాట్నా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌గా పనిచేసిన ఆయన రాసిన పాఠ్యపుస్తకాలు బీహార్‌తోపాటు పలు రాష్ట్రాల్లో పాపులర్ అయ్యాయి. పాట్నా హైకోర్టులో సీనియర్ న్యాయవాది వైబీ గిరి, బీహార్ అదనపు అడ్వకేట్ జనరల్‌గాను, పాట్నా హైకోర్టులో కేంద్ర ప్రభుత్వ కేసులకు అదనపు సొలిసిటర్ జనరల్‌గా కూడా పనిచేశారు. మాంఝీ స్థానం నుంచి ఆయన పోటీ చేస్తున్నారు. పాట్నా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ పూర్వ విద్యార్థి, గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య సౌకర్యాలకు కృషి చేసిన డాక్టర్ అమిత్ కుమార్ దాస్, ముజఫర్‌పూర్ స్థానం నుంచి ఎన్నికల బరిలో నిలిచారు. మరోవైపు రాజకీయ వ్యూహకర్త నుంచి రాజకీయ నేతగా మారిన ప్రశాంత్ కిషోర్ పేరు తొలి జాబితాలో లేదు. అయితే తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు ఇప్పటికే స్పష్టం చేశారు. ఆర్జేడీ బలమైన స్థానం, తేజస్వీ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న రాఘోపూర్ నుంచి ఆయన పోటీ చేయవచ్చని తెలుస్తున్నది.

## భారత అభివృద్ధిపై యూకే ప్రధాని ప్రశంసలు



**ముంబై :** 'భారత్‌ది డెడ్ ఎకానమీ..' అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవలే కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందన్న అక్కసుతోనే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ డెడ్ ఎకానమీ వ్యాఖ్యలకు యూకే ప్రధాని కీర్ స్టార్మర్ కౌంటర్ ఇచ్చారు. ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న యూకే ప్రధాని.. దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుగుదలను ప్రశంసించారు. భారత్ ఇటీవలే జపాన్‌ను అధిగమించి నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని గుర్తు చేశారు. 2028 నాటికి భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా పయనిస్తోందంటూ ప్రశంసలు కురిపించారు. యూకే ప్రధాని భారత పర్యటనకు వచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. '2028 నాటికి భారత్ మూడో అతిపెద్ద ఆర్థికశక్తిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు గానూ ప్రధాని మోదీ నాయకత్వానికి అభినందనలు. ఇక్కడికొచ్చి ఈ పరిస్థితులు చూస్తుంటే మీరు లక్ష్యాన్ని చేరుకునే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. వికసిత్ భారత్ స్ఫూర్తితో 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరిస్తుంది. ఈ ప్రయాణంలో మేమూ భాగం కావాలనుకుంటున్నాం' అంటూ యూకే ప్రధాని తెలిపారు.

### భారత్, బ్రిటన్ కొత్త ఒప్పందం

బ్రిటిష్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ భారత్‌లో సందర్శిస్తున్నారు. అమెరికా సుంకాల కారణంగా ఆర్థిక వ్యవస్థ గురించి ఆందోళనలు కొనసాగుతున్న సమయంలో ఈ పర్యటన చాలా ముఖ్యమైనది. ఈ పర్యటన రెండు దేశాల మధ్య బలమైన వాణిజ్య ఒప్పందానికి దారితీస్తుందని భావిస్తున్నారు.ముంబైలో జరిగిన ఒక కార్యక్రమంలో వ్యాపార నాయకులను ఉద్దేశించి స్టార్మర్ మాట్లాడుతూ, భారతదేశం, యుకె మధ్య వాణిజ్య భాగస్వామ్యం చాలా కీలకమని పేర్కొన్నారు. ఈ ఒప్పందం రెండు దేశాల మధ్య 25.5 బిలియన్ పౌండ్ల విలువైన వాణిజ్యాన్ని ఉత్పత్తి చేస్తుందని కూడా ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు బ్రిటన్‌కు ఇదే అతిపెద్ద వాణిజ్య మిషన్ అని ఆయన పేర్కొన్నారు.

### భారతదేశం -బ్రిటన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

జులైలో భారతదేశంతో ఒక ప్రధాన వాణిజ్య ఒప్పందం కుదిరిందని, వస్త్రాలు, విస్కీ, కార్లపై సుంకాలను గణనీయంగా తగ్గించిందని బ్రిటిష్ ప్రధానమంత్రి గుర్తించారు. కీర్ స్టార్మర్ పర్యటన కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది. భారతదేశం- ఐఐ మధ్య ఈ ఒప్పందం పూర్తి వాణిజ్య విలువ అంతటా సున్నా సుంకాలను అమలు చేస్తుంది, భారతీయ వ్యాపారాలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుస్తుంది, వారు తమ ఉత్పత్తులను బ్రిటిష్ మార్కెట్‌లో మరింత సులభంగా ,లాభదాయకంగా విక్రయించడానికి వీలు కల్పిస్తుంది. రెండు దేశాల మధ్య ఈ వాణిజ్య ఒప్పందం వస్త్ర, పాదరక్షలు, క్రీడా వస్తువులు, ఇంజనీరింగ్ రంగాల్లో ఉపాధిని పెంచుతుందని భావిస్తున్నారు. దీని వలన వేల మందికి కొత్త ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ చర్య రెండు దేశాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేస్తుంది.ప్రధాన మంత్రి మోదీ కీర్ స్టార్మర్‌కు హృదయపూర్వక స్వాగతం పలికారు. బలమైన, మరింత సంపన్నమైన భవిష్యత్తు కోసం పనిచేయడానికి రెండు దేశాల నిబద్ధతకు ఈ పర్యటన నిదర్శనమని ప్రధాని తన సోషల్ మీడియాలో పేర్కొన్నారు. బ్రిటిష్ ప్రధాని ముంబైలోని అంధేరిలోని యష్ రాజ్ ఫిల్మ్స్ స్టూడియోను కూడా సందర్శించారు. ఆ తర్వాత ఆయన ఇంగ్లీష్ ప్రీమియర్ లీగ్ నిర్వహించిన దక్షిణ ముంబైలోని కూపరేజ్ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో జరిగిన ఫుట్‌బాల్ ప్రదర్శనకు హాజరయ్యారు.

## కొన్ని పార్టీలు ఎస్ఐఆర్‌కు సహకరించడం లేదు



ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై సుప్రీం కోర్టులో గురువారం కూడా విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం కీలక వ్యాఖ్యలు చేసింది. కొన్ని రాజకీయ పార్టీలు, సంస్థలు ఈసీ ప్రయత్నాలకు సహకరించకుండా.. తప్పుడు కథనాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని తెలిపింది. బిహార్‌లో ఎస్ఐఆర్‌పై దాఖలైన పలు పిటిషన్లపై గురువారం వాదనలు కొనసాగాయి. అంతకుముందు ప్రతిపాదిత జాబితాలో పేరు ఉండి, తుది జాబితాలో తొలగించిన 3.36లక్షల ఓటర్ల వివరాలను అందజేయాలని సుప్రీం పేర్కొంది. వీటిని పరిశీలించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీల ధర్మాసనం.. ఈ అంశం గందరగోళంగా ఉందని, వీరికి అప్పీలు చేసుకునే అవకాశం కల్పించాలని స్పష్టం చేసింది. ఇందుకోసం పారా లీగల్ వాలంటీర్లను అందుబాటులో ఉంచాలని బిహార్ లీగల్ సర్వీసెస్ ఛైర్‌పర్సన్‌ను ఆదేశించింది. బిహార్ ఎస్ఐఆర్‌కు సంబంధించి పలువురు పిటిషనర్లు వాదనలు వినిపించారు. దాదాపు 10శాతం ఓటర్లు తమ హక్కును కోల్పోయారని సామాజిక వేత్త యోగేంద్ర యాదవ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. భారీ సంఖ్యలో కొత్త ఓటర్లు చేరగా.. వారి నుంచి నిర్దేశిత ధ్రువీకరణ పత్రాల్లో ఒక్కటి కూడా తీసుకోలేదని ఆరోపించారు. వీటికితోడు లక్షలాది మహిళా ఓటర్ల పేర్లు గల్లంతయ్యాయని, లక్షల కుటుంబాల్లో అధిక సంఖ్యలో ఓటర్లు ఉండటం కూడా పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. వాదనలు విన్న సుప్రీం ధర్మాసనం.. ఎన్నికల సంఘాన్ని ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. ఎస్ఐఆర్‌ను దేశవ్యాప్తంగా నిర్వహించాలని నిర్ణయించుకున్నారని, బిహార్ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుంటారని, ఇప్పటికైనా మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తారని ఆశాభావం వ్యక్తం చేసింది. అధికారులకు వాళ్లు ఏం చేస్తున్నారో అనే విషయం తెలుసునని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణను అక్టోబర్ 16కు వాయిదా వేసింది.

## కోల్డ్ రిలీఫ్ ఎండీ అరెస్ట్

**చెన్నై :** దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్డ్‌రిఫ్ దగ్గు సిరఫ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. మధ్యప్రదేశ్‌లో మూత్రపిండాల వైఫల్యం కారణంగా 20 మంది మరణించిన కేసులో ప్రధాన చర్యలు తీసుకున్నారు. మధ్య ప్రదేశ్ ప్రత్యేక దర్యాప్తు బృందం విషపూరిత దగ్గు సిరప్ "కోల్డ్‌రిఫ్" తయారు చేసిన శ్రీసాన్ ఫార్మా కంపెనీ యజమాని రంగనాథన్ గోవిందన్‌ను అరెస్టు చేసింది. బుధవారం రాత్రి అతన్ని పట్టుకున్నారు. అయితే అతనిపై పోలీసులు 20,000 రూపాయల రివార్డును ప్రకటించిన సంగతి తెలిసిందే.. నిజాని రంగనాథన్ గోవిందన్ చెన్నైలోని తన ఇంటికి, తమిళనాడులోని కాంచీపురంలోని తన ఫ్యాక్టరీకి తాళం వేసి తన భార్యతో కలిసి పరారీలో ఉన్నాడు. నివేదికల ప్రకారం కోల్డ్‌రిఫ్ అనే విషపూరిత దగ్గు సిరప్ తాగి 20 మంది పిల్లలు మరణించిన తరువాత చింద్వారాలోని పరాసియా పోలీస్ స్టేషన్‌లో అక్టోబర్ 5న ఫార్మాస్యూటికల్ కంపెనీ శ్రీసాన్ ఫార్మా డైరెక్టర్లు, పిల్లల వైద్యుడు డాక్టర్ ప్రవీణ్ సోని, ఇతర బాధ్యతాయుతమైన వ్యక్తులపై ఃఔ సెక్షన్లు 105, 276లతో పాటు డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం 1940లోని సెక్షన్ 27జీ కింద కేసు నమోదు చేయబడింది. పోలీసులు శిశువైద్యుడు డాక్టర్ ప్రవీణ్ సోనిని అరెస్టు చేశారు. అయితే ఇంకా మిగిలిన మందిని అరెస్టు చేయాల్సి ఉంది. ఔషధ కంపెనీ యజమానులను అరెస్టు చేయడానికి చింద్వారా ఎస్పీ అజయ్ పాండే 12 మంది సభ్యుల ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు.పోలీసు వర్గాల సమాచారం ప్రకారం సిట్ బృందం రంగనాథన్‌ను చెన్నై నుంచి భోపాల్‌కు తీసుకువెళ్తోంది. అక్కడ దగ్గు సిరప్ తయారీ, ముడి పదార్థాల సరఫరా, పంపిణీ నెట్‌వర్క్ , లైసెన్సింగ్‌కు సంబంధించిన అవకతవకలపై ఆయనను ప్రశ్నించనున్నారు. సిరప్‌లో ప్రాణాంతక రసాయనం ఎలా కలిసింది. కంపెనీ నాణ్యత తనిఖీ విధానాలు ఎందుకు అంత తప్పుగా ఉన్నాయో తెలుసుకోవడానికి దర్యాప్తు సంస్థలు పనిచేస్తున్నాయి.

### పిల్లల మరణంతో కలకలం

మధ్యప్రదేశ్‌లో కోల్డ్‌రిఫ్ అనే దగ్గు సిరప్ తాగి ఇరవై మంది పిల్లలు మరణించారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా ఆగ్రహాన్ని, భయాందోళనలను రేకెత్తించింది. ఆరోగ్య శాఖ వెంటనే ఆ మందు అమ్మకాలను నిషేధించింది, కంపెనీపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించింది. ఈ సంఘటన రాష్ట్రంలో ఔషధాల భద్రతా ప్రమాణాల గురించి తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తింది.రంగనాథన్ అరెస్టు నుంచి తప్పించుకుంటూ అనేక వారాలుగా పరారీలో ఉన్నాడు. పోలీసులు అతనిపై బహుమతి ప్రకటించారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని అనేక ప్రాంతాలలో తమ శోధనను ముమ్మరం చేశారు. ఈ విషయంలో ఏర్పడిన ప్రత్యేక దర్యాప్తు బృందం ఎలక్ట్రానిక్ నిఘా , స్థానిక వనరులను ఉపయోగించి నిందితుడిని గుర్తించి చెన్నైలోని ఒక అపార్ట్‌మెంట్‌లో అరెస్టు చేసింది.

## భారత్‌కు తాలిబాన్ మంత్రి



**న్యూఢిల్లీ:** ఆఫ్ఘనిస్థాన్ విదేశాంగ శాఖ మంత్రి ఆమిర్ ఖాన్ ముత్తఖీ గురువారం భారత్ చేరుకున్నారు. ఆమిర్ ఖాన్ అధికారికంగా భారత్‌లో జరుపుతున్న తొలి పర్యటన ఇది. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు, పలు ప్రాంతీయ అంశాలపై చర్చించేందుకు వారం రోజుల పాటు ఆయన భారత్‌లో పర్యటించనున్నారు. దేశ రాజధాని ఢిల్లీకి చేరుకున్న ముత్తఖీని భారత విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఘనంగా స్వాగతించింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఇరు దేశాల దౌత్య సంబంధాలు, ప్రాంతీయ సమస్యలపై చర్చలు జరగనున్నాయని తెలిపింది. ఈ పర్యటనలో ఆఫ్ఘనిస్థాన్ విదేశాంగ శాఖ మంత్రి ఆమిర్ ఖాన్ ముత్తఖీ భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌ను కలుసుకోనున్నారు. ఈ పర్యటన ఇంతకుముందే జరగాల్సి ఉన్నప్పటికీ, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్ఎస్‌సీ) విధించిన ప్రయాణ నిషేధం నుంచి ఆమిర్ ఖాన్ ముత్తఖీకి మినహాయింపు లభించకపోవడంతో వాయిదా పడింది. ఇటీవలే యూఎన్ఎస్‌సీ కమిటీ ముత్తఖీ ప్రయాణానికి ప్రత్యేక మినహాయింపు మంజూరు చేసింది. దీంతో అతని పర్యటనకు మార్గం సుగమమైందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మీడియాకు తెలిపారు. ఇరు దేశాల భేటీలలో భారత్ అందిస్తున్న మానవతా సాయం, ఆఫ్ఘనిస్థాన్‌లో చేపడుతున్న మౌలిక సదుపాయాల ప్రాజెక్టులపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఆమధ్య ఆఫ్ఘనిస్థాన్‌లో భూకంపం సంభవించినప్పుడు భారత్ వెంటనే స్పందించి సహాయ సామగ్రిని పంపించిందని జైస్వాల్ తెలిపారు. ఇటీవలి కాలంలో రెండు దేశాల మధ్య దౌత్యపరమైన చర్చలు పెరుగుతున్న నేపథ్యంలో ముత్తఖీ పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది. గత జనవరిలో భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఆఫ్ఘనిస్థాన్ విదేశాంగ శాఖ మంత్రి ఆమిర్ ఖాన్ ముత్తఖీతో సమావేశమయ్యారు.

# స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్

-మొదటిపేజీ తరువాయి

పాటు నామినేషన్లు స్వీకరిస్తారు. 12న వాటిని పరిశీలిస్తారు. 15 వరకు ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. ఈ నెల 23న పోలింగ్ జరగనుంది. నవంబర్ 11న ఓట్ల లెక్కింపు ఉంటుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్‌పై హైకోర్టులో విచారణ జరుగుతుండగానే ఎన్నికల సంఘం తొలి విడత నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎన్నికలపై స్టే ఇచ్చేందుకు కోర్టు అంగీకరించకపోవడంతో అధికారులు కూడా ధైర్యంగా ముందడుగు వేశారు. అందుకే ముందుగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. తర్వాత గ్రామపంచాయితీ ఎన్నికలు నిర్వహించనున్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు రెండు దశల్లో, సర్పంచ్ ఎన్నికలు మూడు దశల్లో పూర్తి చేయాలని ప్లాన్ చేశారు. ఆ ప్లాన్‌లో భాగంగానే ఇవాళ( గురువారం) అన్ని జిల్లాల్లో నోటిఫికేషన్లు జారీ చేశారు. అన్ని జిల్లాల కలెక్టర్‌లు వివరాలను వెల్లడించారు. రెండో విడత నోటిఫికేషన్ 13వే తేదీన విడుదల చేస్తారు. ఇప్పుడు నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్టు అక్టోబర్ 11 ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నామినేషన్లు తీసుకుంటారు. నామినేషన్ వేసేటప్పుడు ప్రతి అభ్యర్థి తమ పూర్తి వివరాలు ఇవ్వాలని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్హతలు, ఆస్తులు, అప్పులు, క్రైమ్ హిస్టరీ అన్నింటినీ పొందుపరచాలని పేర్కొన్నారు. వివరాలు సరిగా లేకుండే నామినేషన్ తిరస్కరణకు గురవుతుందని హెచ్చరించారు. వచ్చిన నామినేషన్లను 12న పరిశీలిస్తారు. అదే రోజు ఇచ్చిన వివరాల ప్రకారం ఎవరెవరు పోటీకి అర్హులో కూడా వెల్లడిస్తారు. వారిలో పోటీ నుంచి తప్పుకోవాలంటే గడవు




15వ తేదీ వరకు ఉంటుంది. అనంతరం తుది జాబితా బహిర్గతం చేస్తారు. పోటీలో ఉన్న వాళ్లకు ఈ నెల 23న పోలింగ్ ఉంటుంది. రెండో విడత పోలింగ్ కూడా అక్కడికి ఐదు రోజుల తర్వాత ఉండే అవకాశం ఉంది. ఈ ఫలితాలను నవంబ్ 11న విడుదల చేస్తారు. అభ్యర్థులు ఫారం-4లో ఉన్న మోడల్‌లోనే నామినేషన్లు దాఖు చేయాలి. జిల్లాలో ఓటు హక్కు కలిగిన వాళ్లు మాత్రమే పోటీ చేసేందుకు అర్హులుగా పేర్కొన్నారు. పోటీ చేసే వ్యక్తితోపాటు మద్దతుగా నామినేషన్లు సంతకం చేసే వాళ్లికి కూడా స్థానికంగా ఓటు హక్కు ఉండాలి. అధికారులు పేర్కొన్న ఆఫీస్‌కు వెళ్లి నామినేషన్లు ఇవ్వాలి. గుర్తింపు పొందిన పార్టీ నుంచి పోటీ చేస్తుంటే ఆ వివరాలను ఫారమ్-2లో చెప్పాలి. బీఫామ్‌ను కూడా ఉపసంహరణ గడువు లోపు అధికారులు సమర్పించాలి. ఒక వేళ పొరపాటున ఈ వివరాలు సమర్పించకుంటే వాళ్లను స్వతంత్ర అభ్యర్థులుగా ప్రకటించి ఫ్రీ సింబర్ ఇస్తారు. గుర్తింపు పొందిన పార్టీ నుంచి పోటీ చేస్తే పార్టీ గుర్తును కేటాయిస్తారు. స్వతంత్ర అభ్యర్థులు రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించిన గుర్తుల్లో మూడింటిని ఎంపిక చేసుకోవచ్చు.

**ఇప్పుడేం చేయాలి**

జర్వేషన్ల జీవో ఇవ్వడానికి ప్రాతిపదిక అసెంబ్లీలో ఆమోదించిన బిల్లు. ఆ బిల్లులను గవర్నర్ అధికారింగా ఆమోదించలేదు. అలాంటప్పుడు జీవో ఎలా ఇవ్వగలన్న ప్రశ్న వస్తోంది. గతంలో ఇలాంటి జీవోలు వచ్చినప్పుడు న్యాయపరిశీలనలో నిలబడలేదు. ఆ జీవో బేస్ గా చేసుకుని నిర్వహించిన ఎన్నికలు కూడా చెల్లలేదు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఇదే విషయాన్ని బహిరంగంగానే చెప్పారు. తొం దరపడి డబ్బులు ఖర్చు పెట్టుకోవద్దని..ఈ జీవో ఆధారంగా జరిగే ఎన్నికలు చెల్లవని ఆయన తేల్చేశారు. అయన స్వయంగా బీసీ వర్గానికి చెందిన నేత. బీసీ రిజర్వేషన్లకు ఆయన వ్యతిరేకమయ్యే అవకాశం లేదు. రాజకీయంగా ఉన్న అనివార్యతలపైనే ఆయన మాట్లాడారు. అయితే ఆయన బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడారని విమర్శలకు గురయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చడానికి చట్టపరంగా లేని అవకాశాలని కల్పించుకునే ప్రయత్నం చేస్తోంది. తాత్కలికంగా వారి ప్రయత్నాలు ముందుకు సాగవచ్చు కానీ అంతిమంగా ఔట్ పుట్ మాత్రం నిరాశ పరుస్తుందని గతంలో జరిగిన పరిణామాలు నిరూపిస్తున్నాయని రాజకీయవర్గాలు అంటున్నాయి. సెంటిమెంట్ రాజకీయాల కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెద్ద రిస్క్ తీసుకుంటోందని అంటున్నారు. చట్టపరంగా జరగవని తేలినప్పుడు... పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్లడం మంచిదన్న వాదన ఉంది. అయితే తెలంగాణ ప్రభుత్వ పెద్దలు మాత్రం ఏటికి ఎదురీదే ప్రయత్నాలే చేస్తున్నారు.

# బస్సెక్కిన కేటీఆర్, హరీష్.. ప్రభుత్వానికి అల్టిమేటం

-మొదటిపేజీ తరువాయి

చేస్తున్నాం. 20 నెలల్లో 5 సార్లు బస్ ఛార్జీలు పెంచారు. భార్యకు ఫ్రీ అని భర్తకు టికెట్ డబుల్ చేశారు. విద్యార్థులకు డబుల్ చేశారు. ఇప్పటికే జీవో 53, 54 లతో కొత్త వాహనాలపై లైఫ్ ట్యాక్స్ పెంచి ప్రజలపై భారం వేసిండు. పేద, మధ్య తరగతి ప్రజలను దొంగ దెబ్బ కొట్టిండు రేవంత్ రెడ్డని అన్నారు. వాహన లైఫ్ టైం టాక్సులు, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచడం ద్వారా ప్రజల రక్తం పీల్చుతున్నడు రేవంత్ రెడ్డి. మెట్రో రైలును ఆగం చేసిండు. కాంగ్రెస్ పాలనలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు కూడా లేదా? ఇది ఇందిరమ్మ రాజ్యమా? ఎమర్జెన్సీ పాలనా? ఇది ప్రజా పాలనా లేక ప్రజా పీడనా? రేవంత్ రెడ్డి ఏం చేసినా ఎవ్వరూ అడగొద్దు అన్నట్లు ఉంది. ప్రజాస్వామ్య పాలన అని రాక్షస పాలన సాగిస్తున్నడు. మాటల్లో రాజ్యాంగ రక్షణ, చేతల్లో రాజ్యాంగ భక్షణ? టికెట్ ధరల పెంపు పై బస్సులో ప్రయాణించి ఆర్టిసి ఎండిని కలిసి వినతిపత్రం ఇచ్చే అవకాశం ప్రజా ప్రతినిధులకు లేదా? తెలంగాణలో హక్కులను కాలరాస్తున్న రేవంత్ రెడ్డి దుష్ట పాలన రాహుల్ గాంధీకి కనిపించడం లేదా అని అన్నారు. ప్రశ్నిస్తే కేసులు, గొంతెత్తితే దాడులు, ప్రజా ప్రతినిధుల హౌజ్ అరెస్టులు, మీడియా పై కఠిన ఆంక్షలు. ఇదేమి రాజ్యం రేవంత్ రెడ్డి..? ఏడవ గ్యారంటీగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని డబ్బా కొట్టి ఇప్పుడు, ఉన్న ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశావు. ఎమర్జెన్సీ పాలనను తలపిస్తున్నావు. మీ అణచివేతలకు, మీ నిర్బంధాలకు, మీ దాడులకు బిఆర్ఎస్ పార్టీ అదరదు బెదరదు. ప్రజాక్షేత్రంలో మిమ్మల్ని అడుగడుగునా నిలదీస్తూనే ఉంటం, ప్రజల తరపున పోరాటం చేస్తూనే ఉంటం. అడ్డగోలుగా పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తున్నాం. కమిషన్లు దంచుడు కాదు, పేదల కోసం పని చెయ్యి. నిరసన రాజ్యాంగం ఇచ్చిన హక్కు. ఆర్ టి సి ధరలు పెంచితే మెట్రో ఎక్కుతారు అని రేవంత్ ఆలోచన. ఆర్ టి సి అమ్మాలని,ప్రైవేట్ పరం చేసే కుట్ర కాంగ్రెస్ చేస్తుంది. ఎలక్ట్రానిక్ బస్ ల పేరుతో పెద్ద కుట్ర జరుగుతోంది. ఉప్పల్ మియపూర్ వర్క్ షాప్స్ అమ్మకానికి పెట్టారు. బస్ స్టాండ్ లు కూదవబెట్టి 1500 కోట్లు తెచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడమేనా కాంగ్రెస్ పని. కార్గో ను అమ్మి ప్రైవేట్ చేయాలని చూస్తోంది. పేదల నడ్డి విరుస్తున్నారు. రాహుల్



గాంధీ రాజ్యాంగం గూర్చి మాట్లాడుతారు..ఓ సారి రివ్యూ చెయ్యు.. రేవంత్ రెడ్డి రాజ్యాంగ భక్షణ జరుగుతుంది. ఆర్టీసీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి. ఆర్టీసీ ధరలు తగ్గించేవరకు బిఆర్ఎస్ ప్రజా ఉద్యమం చేస్తుందని అన్నారు.

**మహిళలకు ఉచిత బస్ ప్రయాణం పేరుతో కుటుంబంపై పెను భారం**

తెలంగాణలో ఆర్టీసీ ఛార్జీల పెంపును బీఆర్ఎస్ తీవ్రంగా తప్పుపట్టింది. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం పేరుతో కుటుంబంపై పెను భారం మోపుతున్నారని, ఆర్టీసీని ప్రైవేటు పరం చేసే కుట్ర జరుగుతోందని నేతలు ఆరోపించారు. ఛార్జీల పెంపును నిరసిస్తూ బీఆర్ఎస్ నేతలు బస్ భవన్ ముట్టడికి యత్నించారు. అయితే కీలక నేతలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అయినప్పటికీ కేటీఆర్, హరీష్, సహా కొద్ది మంది నేతలు ఆర్టీసీ బస్‌లలో ప్రయాణించి బస్‌భవన్‌కు చేరుకున్నారు. అక్కడ ఎండీని కలిసి వినతి పత్రం అందజేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఓ మార్గం నుంచి , మాజీ మంత్రి హరీష్‌రావు మెహదీపట్నం నుంచి , పద్మారావుగౌడ్ ఇంకో పక్క నుంచి బస్‌లు ఎక్కి బస్ భవన్‌కు చేరుకున్నారు. ఆయా ప్రాంతాల నుంచి టికెట్ తీసుకున్న నేతలు ప్రభుత్వం తీసుకున్న ఛార్జీల పెంపు నిర్ణయంతో ఒక్కో కుటుంబంపై నెలకు వెయ్యి రూపాయల వరకు భారం పడుతుందని అన్నారు. మహిళలకు ఉచితం అంటూనే మిగతా వారి నుంచి భారీగా వసూలు చేస్తున్నారని అన్నారు. ఇది సరికాదని ఆర్టీసీ నష్టాల్లో ఉంటే కచ్చితంగా దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని అభిప్రాయపడ్డారు. దీనికి ప్రజలపై భారం వేయడం ఎంత వరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. ప్రభుత్వం దిగి వచ్చే వరకు ప్రజలతో కలిసి పోరాటం చేస్తామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి బస్ భవన వద్దకు బీఆర్ఎస్ నేతలు చేరుకోవడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది. ఆర్టీసీ కార్యాలయంలోకి వెళ్లేందుకు నేతలు యత్నించారు. అప్పటికే పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని నియంత్రించారు. నేతలతో అధికారులు చర్చించి కేవం నలుగురిని మాత్రమే ఎండీతో సమావేశమయ్యేందుకు అంగీకరించారు. దీనికి బీఆర్ఎస్‌నేతలు కూడా ఓకే చెప్పారు. పోలీసుల సూచన మేరకు కేటీఆర్, హరీష్‌రావు, పద్మారావు గౌడ్ ఎండీని కలిశారు. ఆర్టీసీ ఛార్జీల పెంపు, ప్రైవేటీకరణ ఆరోపణలు, ఆర్టీసీ కార్మికులకు రావాల్సిన బకాయిలు ఇతర సమస్యలపై చర్చించారు. బస్‌భవన్‌లో ఆర్టీసీ ఎండీకి వినతి పత్రం ఇచ్చిన తర్వాత బీఆర్ఎస్ నేతలు మీడియాతో మాట్లారు. ఛార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీని కోసం ఎంత దూరమైన వెళ్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలోనే ఐదారుసార్లు బస్ ఛార్జీలు పెంచారని మండిపడ్డారు. ఓవైపు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా ప్రజలపై భారాన్ని మోపుతున్నారని అన్నారు. అంతేకాకుండా ఆర్టీసీ స్థలాలను అమ్మకానికి పెడుతున్నారని మండిపడ్డారు. కొన్నింటిని తాకట్టు పెట్టి ప్రభుత్వాన్ని నడుపుతున్నారని అన్నారు. అన్ని విధాలుగా ఆర్టీసి పూర్తిగా నాశనం చేసి ప్రైవేటుపరం చేయాలని ప్లాన్ చేస్తున్నారని అన్నారు. ఆర్టీసీ ఆస్తులు తాకట్టు పెడుతున్న ప్రభుత్వం కార్మికులకి కూడా మంచి చేయడం లేదన్నారు బీఆర్ఎస్ నేతలు. వారికి రావాల్సిన బకాయిలను ఇంత వరకు ఇవ్వలేదన్నారు. మహాలక్ష్మి పథకంలో ఆర్టీసీకి ఇవ్వాల్సిన బకాయిలు కూడా చెల్లించడం లేదని మండిపడ్డారు. అటు ప్రజలు, ఇటు కార్మికులను కలుపుకొని వెళ్లి ఉద్యమిస్తామని వార్నింగ్ ఇచ్చారు.

# రిజర్వేషన్ల హామీ నెరవేర్చడానికే తంటాలు ?

**హైదరాబాద్ :** తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలు ఎన్నికల సంఘం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం నోటిఫికేషన్ గురువారం జారీ అయింది. ఉదయం పదిన్నర గంటల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. మధ్యాహ్నం హైకోర్టులో రిజర్వేషన్ల జీవోపై విచారణ ముగిసింది. సాధారణంగా ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తరవాత కోర్టులు జోక్యం చేసుకోవు. అందుకే ప్రక్రియ ఎన్నికల వరకూ జరుగుతుందని నమ్ముతున్నారు. కానీ న్యాయపరిశీలనలో రిజర్వేషన్ల జీవో నిలబడలేకపోతే మొదటికే మోసం వస్తుంది. ఎన్నికల ప్రక్రియ కూడా చెల్లకుండా పోతుంది. ఎందుకంటే ఆ రిజర్వేషన్ల జీవో ఆధారంగానే ఎన్నికల జీవో ఇచ్చారు. ఆ జీవో చెల్లనప్పుడు ఎన్నికల ప్రక్రియ కూడా చెల్లదు. అందుకే రాజకీయ పార్టీలు ఇప్పటికీ స్థానిక ఎన్నికల ప్రక్రియను నమ్మలేకపోతున్నాయి. నామినేషన్ల గడువు ప్రారంభమైన వెంటనే .. తమ పార్టీ నేతలతో నామినేషన్లు వేయించాలని అధికార కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఇది ఓ రకంగా రాజకీయంగా ఒత్తిడి పెంచే వ్యూహమే. రిజర్వేషన్ల జీవోపై స్టే ఇస్తే.. ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకునే అధికారం కోర్టులకు లేదని వాదించే ఓ ఆప్షన్ అధికార కాంగ్రెస్ పార్టీ వద్ద ఉంటుంది. కానీ కాంగ్రెస్ నేతలకూ ఈ ఎన్నికల చెల్లుబాటుపై సందేహాలు ఉన్నాయి. నామినేషన్లు వేసి ఖర్చులు పెట్టుకున్న తర్వాత అవి చెల్లకుండా పోతే నష్టపోతారు. ఇతర పార్టీలు ఈ ఎన్నికలను సీరియస్ గా తీసుకుంటున్న పరిస్థితులు కనిపించడం లేదు. రిజర్వేషన్ల జీవో ఇవ్వడానికి ప్రాతిపదిక అసెంబ్లీలో ఆమోదించిన బిల్లు.



ఆ బిల్లులను గవర్నర్ అధికారింగా ఆమోదించలేదు. అలాంటప్పుడు జీవో ఎలా ఇవ్వగలన్న ప్రశ్న వస్తోంది. గతంలో ఇలాంటి జీవోలు వచ్చినప్పుడు న్యాయపరిశీలనలో నిలబడలేదు. ఆ జీవో బేస్ గా చేసుకుని నిర్వహించిన ఎన్నికలు కూడా చెల్లలేదు. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఇదే విషయాన్ని బహిరంగంగానే చెప్పారు. తొందరపడి డబ్బులు ఖర్చు పెట్టుకోవద్దని..ఈ జీవో ఆధారంగా జరిగే ఎన్నికలు చెల్లవని ఆయన తేల్చేశారు. అయన స్వయంగా బీసీ వర్గానికి చెందిన నేత. బీసీ రిజర్వేషన్లకు ఆయన వ్యతిరేకమయ్యే అవకాశం లేదు. రాజకీయంగా ఉన్న అనివార్యతలపైనే ఆయన మాట్లాడారు. అయితే ఆయన బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడారని విమర్శలకు గురయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చడానికి చట్టపరంగా లేని అవకాశాలని కల్పించుకునే ప్రయత్నం చేస్తోంది. తాత్కలికంగా వారి ప్రయత్నాలు ముందుకు సాగవచ్చు కానీ అంతిమంగా ఔట్ పుట్ మాత్రం నిరాశ పరుస్తుందని గతంలో జరిగిన పరిణామాలు నిరూపిస్తున్నాయని రాజకీయవర్గాలు అంటున్నాయి. సెంటిమెంట్ రాజకీయాల కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెద్ద రిస్క్ తీసుకుంటోందని అంటున్నారు. చట్టపరంగా జరగవని తేలినప్పుడు... పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు వెళ్లడం మంచిదన్న వాదన ఉంది. అయితే తెలంగాణ ప్రభుత్వ పెద్దలు మాత్రం ఏటికి ఎదురీదే ప్రయత్నాలే చేస్తున్నారు.

## లోకల్ బాడీ ఎన్నికలు నిలిపివేత

-మొదటిపేజీ తరువాయి

సంస్థల ఎన్నికల నిర్వహణపై పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. హైకోర్టు ఆర్డర్‌ను పరిశీలించిన తర్వాత రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకోనుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశానికి సంబంధించి గురువారం(అక్టోబర్ 9వ తేదీ) హైకోర్టులో విచారణలో భాగంగా ఏజీ సుదర్శన్‌రెడ్డి తన వాదనలు వినిపిస్తూ.. ' 57.6 శాతం బీసీ జనాభా ఉందని సర్వేలో తేలింది. బీసీల సంఖ్యపై ఎలాంటి అభ్యంతరం లేనప్పుడు పిటిషనర్లకు రిపోర్ట్ ఎందుకు?, బిల్లుపై ఒక్క పార్టీ కూడా అభ్యంతరం తెలపలేదు. గవర్నర్ గడువులోగా ఆమోదించకపోతే చట్టంగా భావించాల్సి ఉంటుంది. తమిళనాడు కేసులో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రత్యేకంగా నోటిఫై చేయాల్సిన అవసరం లేదు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైందని హైకోర్టు దృష్టికి తీసుకెళ్లిన ఏజీ సుదర్శన్ రెడ్డి. నోటిఫికేషన్ విడుదలయ్యాక కోర్టులు జోక్యం చేసుకోలేవు. కేంద్ర ప్రభుత్వం కూడా తెలంగాణాను అనుసరిస్తూ కులం వివరాలను జనగణనలోకి తీసుకోనుంది. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు వేరు.. లోకల్ బాడీ ఎన్నికల రిజర్వేషన్లు వేరు. ఇందిరా సహాని కేసు విద్య, ఉద్యోగాలకు సంబంధించినది. మేం రాజకీయ రిజర్వేషన్ల కోసమే జీవో తెచ్చాం' అని వివరించారు. ప్రభుత్వం తరఫున మరో న్యాయవాది రవివర్మ వాదనలు వినిపిస్తూ.. 50 శాతం రిజర్వేషన్లు మించకూడదని రాజ్యాంగంలో ఎక్కడా లేదన్నారు. ' తెలంగాణలో ఏ రిజర్వేషన్లు లేని జనాభా 15 శాతం మాత్రమే. ఆ 15 శాతం మందికి 33 శాతం సీట్లు ఇస్తున్నాం' అని హైకోర్టుకు తెలిపారు. అయితే ప్రభుత్వం తరఫున వాదనలు ముగిసిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలపై స్టే విధించింది హైకోర్టు.

## ఏం జరిగిన ముందుకు వెళ్దాం

-మొదటిపేజీ తరువాయి

హైకోర్టులో బీసీ రిజర్వేషన్ల కేసుపై పీసీసీ చీఫ్ పర్యవేక్షించాలి. ఉన్నత న్యాయస్థానం తీర్పు తర్వాత తదుపరి కార్యాచరణపై రాత్రి మరో భేటీ నిర్వహిస్తాం. తొలివిడత కోసం రాత్రికి అభ్యర్థుల జాబితా సిద్ధం కావాలి" అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను రాజకీయంగా వాడుకుంటోంది

-మొదటిపేజీ తరువాయి

ఆయన ఆరోపించారు. అందుకే ముందగానే ప్లాన్ 'బీ'ని సిద్ధం చేసుకుని ఇవాళ హైకోర్టులో తూతూమంత్రంగా వాదనలు వినిపించిందని కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ బీసీలను రాజకీయంగా వాడుకుంటోందని మండిపడ్డారు. బీసీలకు న్యాయం చేయాలన్న ఆలోచన కాంగ్రెస్ పార్టీకి ఏనాడూ లేదని ఆరోపించారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే.. సుప్రీంకోర్టు రిజర్వేషన్లపై 50% క్యాప్‌ను నిర్దేశించిందని గుర్తు చేశారు. ఈ విషయం తెలిసినా.. రాజ్యాంగపరమైన నిబంధనలపై కనీస అవగాహన లేకుండా రేవంత్ సర్కారు వ్యవహరించిందని పేర్కొన్నారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

**స్టే రావడానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వం: రామ్‌చందర్ రావు**

బీసీ రిజర్వేషన్లపై స్టే రావడానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామ్‌చందర్ రావు ఆరోపించారు. 42 శాతం రిజర్వేషన్‌లకు బీజేపీ మద్దతు పలుకుతోందని స్పష్టం చేశారు. బీసీల అంశాని కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం వాడుకుంటోందని విమర్శించారు. గవర్నర్‌కి పంపిన తర్వాత బిల్లు కోసం 3 నెలల సమయం ఉంది.. ఎందుకు తొందర పడుతునారని సూచించారు. బిల్లు ఆమోదానికి 3 నెలల సమయం ఉండగా ఎందుకు బిల్లు తెచ్చారో కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పాల్సిన అవసరం ఉందని రామ్‌చందర్ రావు నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీల పట్ల చిత్తశుద్ధి లేదు కాబట్టే.. ఇలాంటి పరిస్థితి వచ్చిందని విమర్శించారు. బీసీ రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటుందని మాట్లాడుతారు తప్ప.. కనీసం రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్ నేతలు మైండ్ అప్లై చేశారా.. అని ఎద్దేవా చేశారు. కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ఇచ్చిన బాధ్యత మీది. ఆర్డినెన్సు తెచ్చింది మీరు.. బిల్లు తెచ్చింది మీరు.. కానీ బీజేపీనీ అంటునారని రామ్‌చందర్ మండిపడ్డారు.

## పక్కాగా టీటీడీపీ ప్లాన్

**హైదరాబాద్ :** ఉమ్మడి ఏపీలో తెలుగుదేశం పార్టీకి ఘనమైన చరిత్ర ఉంది. పార్టీ ఏర్పాటు చేసిన తొమ్మిది నెలల కాలంలోనే అధికారంలోకి వచ్చింది. ఎన్నో సంక్షోభాలను దాటుకొని ప్రధాన పార్టీగా నాలుగు దశాబ్దాల పాటు తన



ఉనికి చాటుకుంటూ వస్తోంది. కానీ తెలంగాణలో ప్రస్తుతం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటోంది. కనీసం ఆ పార్టీ విభాగానికి తెలంగాణ నుంచి అధ్యక్షుడు లేకపోవడం గమనార్హం. చివరిగా కాసాని జ్ఞానేశ్వర్ 2023 ఎన్నికల వరకు తెలంగాణ టిడిపి అధ్యక్షుడిగా ఉండేవారు. కానీ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి పోటీ చేయడానికి నిరాకరించడంతో ఆయన తన అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. అది మొదలు ఎంతవరకు అధ్యక్ష పదవి భర్తీ చేయలేదు. ఇది నిజంగా తెలుగుదేశం పార్టీకి పెద్ద లోటు తెలంగాణలో.. తాజాగా జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికలు జరుగుతున్న సంగతి తెలిసిందే. సెటిలర్స్ ఎక్కువగా ఉన్న ఈ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ తప్పకుండా పోటీ చేయాలని తెలంగాణ నేతలు కోరారు. కానీ పార్టీ అధినేత చంద్రబాబు నో చెప్పారు.తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి చాలా చరిత్ర ఉంది. బలమైన ఓటు బ్యాంకు దాని సొంతం. కానీ కెసిఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటు తర్వాత తెలుగుదేశం పార్టీకి తెలంగాణలో దెబ్బ తగులుతూ వస్తోంది. 2014 వరకు గణనీయమైన పాత్ర పోషించిన తెలుగుదేశం పార్టీ ఊపిరిని తీయడం ప్రారంభించారు కెసిఆర్. తెలుగుదేశం పార్టీని దెబ్బ కొట్టి.. తన టిఆర్ఎస్ను బలోపేతం చేసి.. రెండుసార్లు అధికారంలోకి వచ్చారు. కానీ ఇప్పుడు కెసిఆర్ ఓడిపోయారు. అయినా సరే తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసేందుకు టిడిపి నాయకత్వం ఇష్టపడడం లేదు. దానికి కారణాలు కూడా తెలియడం లేదు.తాజాగా జూబ్లీహిల్స్ (ఉప ఎన్నికలు నేపథ్యంలో తెలంగాణ టిడిపి నేతలు చంద్రబాబును కలిశారు. పోటీ చేద్దామన్న ప్రతిపాదన పెట్టారు. అయితే బిజెపితో పొత్తు ఉన్న నేపథ్యంలో.. ఆ పార్టీ అభ్యర్థి పోటీ చేస్తున్న తరుణంలో.. తెలుగుదేశం పార్టీ తరపున పోటీ వద్దని చంద్రబాబు వారిని వారించారు. అయితే ఈ విషయంలో తెలంగాణ టిడిపి నేతలు సైలెంట్ అయ్యారు. అలా అయితే తెలంగాణ టిడిపి అధ్యక్ష పదవిని భర్తీ చేయాలని వారు అధినేతను కోరారు. కానీ చంద్రబాబు మాత్రం ముందుగా పార్టీ బలోపేతం చేయండి.. తరువాత చూద్దాం.. బలమైన నేతను అధ్యక్షుడిగా నియమిద్దాం అంటూ వారిని సముదాయించారు. అసలు చంద్రబాబు మధ్యలో ఏముందో తెలియక తెలంగాణ టిడిపి నేతలు అయోమయానికి గురయ్యారు. ఏం చేయాలో తెలియక సమావేశం నుంచి నిష్క్రమించారు.1983 నుంచి 2014 వరకు తెలంగాణలో ప్రధాన పార్టీగా తెలుగుదేశం ఉండేది. అయితే రాష్ట్ర విభజన తో ఏపీకి మాత్రమే పరిమితం అయింది. అయితే 2014 ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం నామమాత్రంగానే తెలంగాణలో పోటీ చేసింది. కెసిఆర్ తో ఉన్న అవగాహనతో అటు తరువాత పూర్తిగా వైసిపి తన రాజకీయ కార్యకలాపాలను ముగించింది. పోనీ వైసీపీ మాదిరిగా తెలంగాణ రాజకీయాలకు టిడిపి దూరంగా జరగలేదు. అలాగని క్రియాశీలకం కావడం లేదు. ఈ పరిస్థితిని చూసి తెలంగాణ టిడిపి నేతలు ఆందోళనకు గురవుతున్నారు. లక్ష 70 వేలకు పైగా సభ్యత్వాలు చేశారు. అయినా సరే నాయకత్వం నుంచి సరైన దిశా నిర్దేశం రాకపోవడంతో ఆందోళనలో ఉన్నారు తెలుగుదేశం పార్టీ శ్రేణులు. అయితే చంద్రబాబు మదిలో ఏముందో తెలియక వారు సతమతమవుతున్నారు.

# సంపాదకీయం

## సంక్షోభాల ఊబిలో అగ్రరాజ్యం

ట్రంప్ వివిధ దేశాలపై విధిస్తున్న దిగుమతి సుంకాలు (టారిఫ్‌లు) ఆ దేశ ఆర్థిక సంక్షోభాన్ని, దాని డొల్లతనాన్ని మరోసారి వెల్లడి చేసింది. సామ్రాజ్యవాదం ఒక పరాన్నభుక్కు. ఇతరులపై ఆధారపడి జీవించట మే దాని విధానం. అమెరికా సామ్రాజ్యవాదం ఇతర దేశాల సహజ వనరులను దౌర్జన్యంగా తరలించుకుపోయి బతుకుతున్నది. వెనుకబడిన దేశాలను బెదిరించడం, దాడులు చేయడం, దేశాల మధ్య యుద్ధాలు ప్రేరేపించి ఆయుధాలు అమ్ముకోవటం అమెరికా విధానం. కొల్లగొట్టిన విదేశీ వనరులను రక్షణ వ్యవస్థకు, ఆయుధ తయారీకి అత్యధికం ఖర్చు చేయడం వల్ల అది తరచూ ఆర్థిక సంక్షోభాలను ఎదుర్కొంటున్నది. నేడు అమెరికా ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం అందులో భాగమే. ఈ సంక్షోభ ఫలితంగా ఏర్పడిన నిత్యావసర సరుకుల ధరల పెరుగుదల, నిరుద్యోగం ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఆ వ్యతిరేకత నుండి బయటపడేందుకు విదేశాలనుండి దిగుమతి అవుతున్న సరుకులపై ట్రంప్ విధిస్తున్న దిగుమతి సుంకాలు. %ూశ్రీంశీ =ఝం% - నోబెల్‌పై వీడని ట్రంప్ వ్యామోహం %ూఎజవతీఅంవఎవత్% మరిన్ని కనుగొనండి సినిమా టిక్కెట్లు ఆన్‌లైన్ కొనుగోలు ఆన్‌లైన్ ప్రకటనల ప్యాకేజీలు జ్యోతిష్య సేవలు ఆన్‌లైన్ బీమా పాలసీలు ఆన్‌లైన్ పర్యాటక ప్యాకేజీలు బుక్ చేయండి జిల్లా వార్తల సేవలు ఆఫ్ బీట్ సేవలు వెబ్‌సైట్ డిజైన్ ధరలు ఎడిటోరియల్ సేవలు ఈ-పేపర్ చందా దిగుమతులపై విధించే సుంకాల వల్ల దేశానికి చాలా డబ్బులు వస్తాయని, దేశం మరింత ధనిక దేశంగా మారుతుందని ట్రంప్ దేశ ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశాడు. ఆచరణలో ట్రంప్ అనుకున్నట్లు జరగకపోగా, అందుకు భిన్నమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. సుంకాల పెంపుతో అమెరికా పీకల్లోతు ఆర్థిక కష్టాల్లోకి కూరుకు పోయింది. దేశంలోకి దిగుమతులు తగ్గిపోయి వస్తువుల కొరత ఏర్పడి వాటి ధరలు పెరిగాయి. ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయింది. కుటుంబ ఖర్చులు పెరిగాయి. ట్రంప్ వెడల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడింది. 2007లో దేశంలో ఆర్థిక మాంద్యాన్ని అంచనా వేసిన మొదటి ఎకనమిస్ట్ మార్క్ జండీ నేటి అమెరికా గురించి మాట్లాడుతూ.. ట్రంప్ టారిఫ్ ఒక చెత్త నిర్ణయమని తిట్టిపోశాడు. వచ్చే ఏడాది ద్రవ్యోల్బణం 3 నుండి 4 శాతానికి చేరుకుంటుందని హెచ్చరిక చేశాడు. టారిఫ్‌ల పెంపుతో అమెరికా కంపెనీలు తీవ్రంగా నష్టపోతాయని చెప్పారు. ట్రంప్ విధిస్తున్న సుంకాల వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థకు రాబోయే 12 నెలల్లో ఆర్థిక మాంద్యం ఏర్పడే అవకాశం 43 శాతం ఉందని 'ఇస్ బ్యాంకు' ఇటీవల నిర్వహించిన సర్వే హెచ్చరించింది. కొత్త సుంకాలు అమల్లోకి వస్తే, మాంద్యం ప్రమాదం 50% కన్నా ఎక్కువ ఉండవచ్చని జెపి మోర్గాన్ బ్రూస్ సాస్మాన్ సూచిస్తున్నాడు. అమెరికా ప్రభుత్వానికి తాత్కాలిక నిధులు సమకూర్చే బిల్లును రిపబ్లికన్లు సెనేట్‌లో ప్రవేశపెట్టగా, దానికి డెమొక్రాట్లు మద్దతు ఇవ్వకపోవటంతో ప్రతిష్టంభన ఏర్పడింది. ప్రభుత్వ ఖర్చుల గడువు 30 ఆగస్టు, -25 అర్ధరాత్రి ఉదయం 00.01 నిమిషంతో ముగియడం వల్ల సంక్షోభం తలెత్తింది. ఏడు వారాల పాటు ఫెడరల్ ఫండింగ్‌ను పొడిపించే బిల్లును సెనేట్ ఆమోదించపోతే, గత ఏడేళ్లలో అమెరికాలో ఇదే తొలి షట్ డౌన్ అవుతుంది. షట్ డౌన్ అంటే, అమెరికా కాంగ్రెస్ ఫెడరల్ ప్రభుత్వ ఏజన్సీలకు నిధులు కేటాయించేందుకు ఒక చట్టాన్ని ఆమోదించడంలో విఫలమైనప్పుడు, ఆ నిధులు నిలిచిపోతాయి. ఫలితంగా అత్యవసరం గాని ప్రభుత్వ కార్యక్రమాలు నిలిచిపోయి, తాత్కాలిక ఉద్యోగులు సెలవులపై వెళ్లాల్సి వస్తుంది. షట్ డౌన్ ఏర్పడితే దాదాపు 75 వేల మంది ఉద్యోగులపై ప్రభావం పడుతుంది. ట్రంప్ నిర్ణయాల ఫలితంగా గత సెప్టెంబర్ 30 నుండి ఏకంగా లక్ష మంది ఫెడరల్ ఉద్యోగులు తమ విధులకు దూరమయ్యారు. 2025 సంవత్సరం చివరి నాటికి ఈ సంఖ్య 3 లక్షలకు చేరుకుంటుందని అంచనాగా ఉంది. ట్రంప్ ప్రభుత్వం డిఫర్డ్ రెసిగ్నేషన్ ప్రోగ్రామ్ (డిఆర్‌పి)పేరుతో ఒక ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టింది. దీని ప్రకారం ఉద్యోగులు స్వచ్ఛందంగా రాజీనామా చేస్తే సెప్టెంబర్ నెల 30 వరకు ఎలాంటి పని చేయకుండానే పూర్తి జీతం పొందే అవకాశం కల్పిస్తూ రాజీనామాలను ప్రోత్సహిస్తున్నది. దీనికి తోడు కొత్త నియామకాలపై నిషేధం, అనవసరమైన ఉద్యోగుల తొలగింపు చర్యలు ప్రభుత్వం చేపట్టడంతో చాలా మంది ఉద్యోగులు ఒత్తిడికి లోనై ట్రంప్ పథకానికి అనుగుణంగా రాజీనామాల బాట పడుతున్నారు. గత జులైలో ఉద్యోగ గణాంకాలు తగ్గిపోవటం పట్ల సదరు డేటాను ఇచ్చిన బ్యూరో ఆఫ్ లేబర్ స్టాటిస్టిక్స్ (బి ఎల్ఎస్) డైరెక్టర్‌ను ట్రంప్ ప్రభుత్వం తొలగించింది. ట్రంప్ విధానాలను సవాలు చేస్తూ ఉద్యోగ సంఘాలు సుప్రీం కోర్టును ఆశ్రయించగా 8.1 తేడాతో ప్రభుత్వ చర్యను సుప్రీం కోర్టు ఆమోదించి ఉద్యోగుల తొలగింపును సమర్థించింది. షట్ డౌన్ ఏర్పడితే చాలా మంది ఫెడరల్ ఉద్యోగులను తొలగిస్తామని ట్రంప్ బహిరంగంగానే హెచ్చరించాడు. ఆయన విధానాల ఫలితంగా అమెరికా ఉద్యోగ మార్కెట్ బలహీన పడింది. తయారీ వంటి కొన్ని రంగాలు కార్మికులను తొలగించటం ప్రారంభించాయి. 2024లో అమెరికా జిడిపి అభివృద్ధి రేటు 2.6% ఉండగా, 2025లో 1.6% తగ్గిందని ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్ కో- ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (డిఇసిడి) అంచనాగా ఉంది. 4-సెప్టెంబర్, 25న అమెరికా కార్మిక శాఖ ప్రచురించిన డేటా ప్రకారం 2024 సెప్టెంబర్ ఆ దేశ ద్రవ్యోల్బణం 2.4% ఉండగా, 2025 ఆగస్టు నాటికి 2.9%కి చేరింది. జిడిపి తగ్గి, ద్రవ్యోల్బణం పెరగటం వల్ల ధరలు బాగా పెరిగి వినియోగదారులకు ఖర్చు పెరిగి ఆర్థిక సమస్యల్లో చిక్కుకున్నారు. నేడు అమెరికా అప్పు 37 లక్షల కోట్ల డాలర్లు. ఎకనామిక్స్ టైమ్స్ నివేదిక ప్రకారం 2020లో 23.2 ట్రిలియన్ (ట్రిలియన్ అంటే లక్ష కోట్లు) డాలర్లుగా ఉంటే, గత ఐదు సంవత్సరాల్లో 17 ట్రిలియన్ల అప్పు పెరిగింది. ఈ సంవత్సరంలోనే 40 బిలియన్ డాలర్ల అప్పు చేసింది. ప్రతి సంవత్సరం ఒక లక్ష కోట్ల డాలర్లు అంటే 86 లక్షల కోట్ల రూపాయలు అప్పులకు వడ్డీలు చెల్లిస్తోంది. ఈ వడ్డీ ఇంకా పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణుల అంచనాగా ఉంది. అమెరికా పన్నుల ద్వారా సేకరించే డబ్బులో దాదాపు 25% వడ్డీలకే చెల్లిస్తోంది. 1900 సంవత్సరంలో ఈ వ్యయం జిడిపి 3.14% ఉంటే, 1950 నాటికి 13.83%, 2000 సంవత్సరం నాటికి 17.55%కి, 2025లో 23.87 కి చేరింది. దీన్ని గమనిస్తే అమెరికా అప్పులు ఏ స్థాయిలో ఉంది అర్థమవుతుంది. అమెరికాలో ఆర్థిక అసమానతలు తీవ్రమవుతున్నాయి. అమెరికా పాలకులు అప్పుల ద్వారా పాలన సాగిస్తున్నారు. నిరుద్యోగం పెరుగుతూ ఉంది. దేశ స్థూల ఉత్పత్తి (జిడిపి) తగ్గి, ద్రవ్యోల్బణం పెరుగుతూ ఉంది. ట్రంప్ విధానాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు పెరగటంతో సామాన్య కుటుంబాలపై అదనంగా ఆర్థిక భారం పడి ఇబ్బందులు పడుతున్నాయి. గత 12 సంవత్సరాల్లో కుటుంబాలు భవిష్యత్తు గురించి అత్యంత నిరాశావాదంలో ఉన్నాయి. ట్రంప్ దిగుమతి సుంకాలు పెంచటం వల్ల సమస్యలు పెరిగాయే తప్ప తగ్గలేదు. ఈ పరిస్థితుల నుండి ప్రజలు బయటపడాలంటే, సంపద వికేంద్రీకరణ జరగాలి. పాలకులు సామ్రాజ్యవాద విధానాలను విడిచిపెట్టాలి. ఆయుధ ఉత్పత్తికి బడ్జెట్ కేటాయింపులు తగ్గించాలి. ఇందుకు అమెరికా ప్రజల ముందు ఉన్న ఏకైక మార్గం పాలకుల విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమం వైపు పయనించటమే.

# ఒత్తిళ్లే మానసిక వైకల్యానికి మూలం



ప్రతీ ఏడాది అక్టోబర్ 10న 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం' జరుపు కుంటున్నాం. నేటి ఔతాహిక యువ తరంలో శారీరక సమస్యలతో పాటు మానసిక సమస్యలు ఉన్న వారి సంఖ్య పెరుగుతోంది. కొందరు వాటిని బయటకు చెప్పుకోలేక సత మవుతూ ఉంటారు. సమాజం వాటిని మరొక కోణం లోనే చూస్తున్న. ఈ నేపథ్యంలో మానసిక అనారోగ్య సమస్యను సాధారణ అనారోగ్యంగా భావించాలని తెలి పేందుకే ఈ రోజు నిర్వహిస్తున్నారు. 1992లో వరల్డ్ ఫెడరేషన్ ఫర్ మెంటల్ హెల్త్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మనిషి పుట్టాక ఎలాంటి వైకల్యం లేకుండా ఉంటే అతడి జీవితం హ్యాపీగా సాగుతుంది. ఐతే చిన్న వైకల్యం ఉన్నా అది జీవితాంతం అతడిని పీడిస్తుంది. ఐతే కొందరు పుట్టుకతో ఆరోగ్యకరంగా బాగానే ఉన్నప్పటికీ హఠాత్తుగా మానిసిక రోగులుగా మారి పోతుంటారు. నిజానికి మనలో 40 శాతం పిచ్చి వాళ్లేననేది నిపుణుల అంచనా అది మెడికల్ అనాలిసిస్ మాత్రమే. ఇంకా ఫ్రాంకుగా, నిఖార్సుగా చెప్పాలంటే పూర్తి నార్మల్ గా వుండేవాళ్లు బహుశా ఏ రెండు శాతమో వుంటారు. మనచుట్టూ ఎంత అబ్ నార్మాలిటీ?! ఎన్ని వింత పోకడలు? తిండి పిచ్చి, డబ్బు పిచ్చి, నగల పిచ్చి, పుస్తకాల పిచ్చి పేరుపిచ్చి, సినిమాల పిచ్చి.. గొప్పలు చెప్పడం, అప్పులు చేయడం ఆడంబరాలు పోవడం, షాపింగు, అతి వాగుడు, మితిమీరిన కోపం... వైద్య పరి భాషలో డిప్రెషన్, యాంగ్జయిటీ, యాంగ్జయిటీ న్యూరోసిస్, బైపోలార్ డిజార్డర్, సోషల్ యాంగ్జయిటీ డిజార్డర్, పానిక్ డిజార్డర్, అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్, పోస్ట్ ట్రమాటిక్ స్ట్రెస్ డిజార్డర్, ఫోబియా, మానియా స్కిజోఫ్రీనియా, డిల్యూషనల్ డిజార్డర్, స్లీప్ డిజార్డర్ ఇసోమ్నియా), ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్, సుపీరియారిటీ కాంప్లెక్స్ ఇల్యూషన్, అడిక్షన్ లాంటి మానసిక వైకల్యాలు అనేకం ఉన్నాయి. స్థూలంగా చెప్పాలంటే మానసిక ఉద్రేకాలను నిగ్రహించు కోలేకపోవడమే రుగ్మతను తెచ్చి పెడ్తుంది. ఏ లక్షణమైనా సరే అవధులు దాటినప్పుడు అది పిచ్చి చేష్ట అవుతుంది. హద్దుల్లో మనం వుండి, బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తున్నంత వరకు ఎవరూ మనని తప్పుపట్టారు. మానసిక వైకల్యం వచ్చిన వారిలో సగానికి పైగా 14 ఏళ్ల లోపు వయసు నుంచి ఈ సమస్య ప్రారంభ మవుతుంది. మొత్తం 20 శాతం మంది బాల బాలికల్లో ఈ అవలక్షణం ఉన్నట్లు తేలింది. భయంకర సంఘటనలు, సామాజిక పరిస్థితుల కారణంగా మానసిక వైకల్యం చెందడం సర్వ సాధారణమైన కారణంగా చెపుతారు. మానసిక సమస్యతో బాధపడే వారిని గుండె సంబంధిత సమస్యలు, మధుమేహం, గ్యాస్ట్రిక్ సమస్యలు కూడా వెంటాడుతాయి. మానసికంగా బలహీనంగా ఉన్నవారు పూర్తిగా ఆ సమస్యలో కూరుకుపోవడానికి కారణం సదరు వ్యక్తి కుటుంబ సభ్యులు కూడా కారణమవుతున్నారు. సమాజంలో మానసిక అనారోగ్యంతో బాధ పడుతున్న వారికి కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి. 1). సంఘానికి వ్యతిరేకంగా ప్రవర్తించడం.... కొంతమంది వ్యక్తులు ప్రత్యేకించి కొన్నిసార్లు విపరీతమైన కోపాన్ని ప్రదర్శిస్తిస్తూ అరుస్తూ పిచ్చిగా ప్రవర్తిస్తుంటారు. వీరి ప్రవర్తన ఇతరులకు హాని కలిగించేదిగా ఉంటుంది. 2).అమ్నోసియా... ఇది కూడా సర్వసాధారణంగా కనబడేదే. వీరిలో కనిపించే లక్షణం మర్చిపోవడం. బ్రెయిన్ డ్యామేజ్ కారణంగా చెప్పినవి, జరిగినవి మర్చి పోతుంటారు. 3).ఆస్పర్జెర్స్ సింద్రోమ్.... వీరిని కూపస్త మండూకాలని చెప్పవచ్చు. సమాజంలో ఎవ్వరితోనూ వీరికి సంబంధాలు ఉండవు. ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడుతుంటారు. ఎవరి తోనూ మాట్లాడేందుకు ఇష్టపడరు. ప్రత్యేకమైన వ్యక్తులుగా అగుపిస్తుంటారు. 4).మహా ఒత్తిడి... ఈ ఒత్తిడి అనేది చాలా పెద్దపదం. దీని కారణంగా చాలామంది ప్రాణాలు తీసుకున్న సంఘటనలున్నాయి. ఈ ఒత్తిడి సమస్య కారణంగా వారిపై వారికి నమ్మకం సన్నగిల్లుతుంది. సంతోష కరమైన పండుగలు ఇతరత్రా ఏవి వచ్చినా వాటిని జరుపు కునేందుకు ఆసక్తి చూపరు. ప్రతిదాన్ని విమర్శిస్తూ తిట్టుకుంటూ ఉంటారు. నలుగురితో కలిసి తిరగడం వీరికి అస్సలు ఇష్టం ఉండదు. ఇలాంటి వారి మానసిక స్థితిని మామూలు స్థితికి తీసుకు రాకపోతే ఆత్మ హత్యలకు పాల్పడేందుకు అవకాశం ఉంటుంది. 5).ఓసీడీ... ఒబెసివ్ కంపల్సివ్ డిజార్డర్... అంటే వీరు ఒకరకంగా మతిమరుపు టైపే. పెట్టిన చోట వస్తువు ఉందో లేదో అని పదేపదే చెక్ చేసుకుంటూ ఉంటారు. అలాగే ప్రతి చిన్నదానికి చేతులు కడుక్కోవడం, ఇంట్లో ఉన్న వస్తువులను లెక్కబెట్టడం, అకస్మాత్తుగా స్నానం చేయడం, తలుపులు వేసి ఉన్నాయో లేదో అని పలుమార్లు చెక్ చేసుకోవడం వంటివి చేస్తుంటారు. అలాగే వదిలేస్తే ఇవి కూడా ఆ వ్యక్తిలో ఆత్మహత్యల వైపు తీసుకెళతాయి. కాబట్టి మానసిక వైకల్యం ఉన్న వారి విషయంలో కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకో వలసిన అవసరం ఉంటుంది. వృద్ధాప్యం మరో బాల్యం లాంటిది. పండుటాకులకూ పసిబిడ్డలకూ పెద్దగా తేడా ఉండదు. వృద్ధులతో వ్యవహరించేటప్పుడు కాస్త సున్నితంగా ఉండటం చాలా అవసరం. సగటు ఆయుర్దాయుం పెరగడంతో వృద్ధుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతోంది. వృద్ధుల సంఖ్యతోపాటే మలి వయసులో మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడే వారి సంఖ్యా పెరుగుతోంది. మానసిక చికిత్సా విభాగానికి వచ్చే ప్రతి వంద మందిలో 25 మంది వృద్ధులుంటున్నారు. వీరిలో అత్యధికులు డిప్రెషన్, నిద్రలేమి ఆందోళన, డిమెన్షియా వంటి ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. మానసిక రుగ్మతలు ఉన్నవారికి మెరుగైన చికిత్స అందుబాటులో ఉంది. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ఆసుపత్రికి తీసుకువస్తే వ్యాధిని పూర్తిగా నియంత్రించ వచ్చు. అలాంటి వ్యాధి సోకితే జబ్బు తీవ్రత కంటే ఎక్కువగా మనం తల్లడిల్లిపోతాం. మనతో బాటు మనవాళ్ళూ ఆందోళన చెందుతారు. నాడీ సంబంధిత ప్రసరణ వ్యవస్థ (న్యూరో ట్రాన్స్ మిట్టర్స్)...మానసిక రుగ్మతలు మెదడులోని న్యూరో ట్రాన్స్ మిట్టర్స్ అని పిలువ బడే ప్రత్యేక రసాయనాలలో కలిగే అసాధారణమైన సమతుల్యానికి సంబంధం కలిగి ఉంటాయి. మెదడులో ఉండే నాడీ కణాలు ఒకదానితో మరొకటి సంబంధాన్ని నెరపుతూ ఉండడానికి సహకరించు కుంటాయి. ఒకవేళ ఈ రసాయనాలలో సమతౌల్యం లోపించినా లేక అవి సరిగా పనిచేస్తూ ఉండకపోయినా, మెదడులో సంకేతాలు ఒకచోట నుండి మరొకచోటకు సరిగా పంపబడుతూ ఉండవు, మానసిక అనారోగ్య లక్షణాలకు దారి తీస్తాయి. జన్యు శాస్త్రం... కుటుంబాలలో వస్తూ వుండే మానసిక రుగ్మతలు తమ కుటుంబంలో మరో ఏ సభ్యుడికైనా అటువంటివి ఉన్నట్లయితే, మిగతా వారు కూడా అటువంటి మానసిక రుగ్మతల బారిన పడే అవకాశాలను ఎక్కువగా కలిగి ఉంటారని సూచిస్తున్నాయి. మానసిక రుగ్మత, వైకల్యం అనేది అనేక జన్యువుల పరస్పరక్రియ, ప్రభావం (ఇంటరాక్షన్) వల్ల మరియు ఇతర అంశాల వల్ల - అంటే ఒత్తిడి, దుర్వినియోగం, లేకపోతే ఒక శరాఘాతం (ట్రోమా) కలిగించే సంఘటన వంటివాటి వల్ల సంభవిస్తుంది. ఒక వ్యక్తి వారసత్వంగా ఈ రుగ్మతకు గురయ్యే అవకాశాన్ని కలిగి వున్నప్పుడు ఆ వ్యక్తిలో ఇవి అనారోగ్యాన్ని మరింత ప్రభావితం చేయడమో లేక అనారోగ్యాన్ని ఉసిగొల్పడమో చేస్తాయి. అంటు రోగాలు...మెదడు దెబ్బ తినడానికి మరియు మానసిక రుగ్మత వృద్ధి చెందడానికి లేక క్షీణించిపోతూ ఉండే పరిస్థితిని తెలియజేసే రోగ లక్షణాలతో సంబంధం కలిగి వుంటాయి.

# అపర ధన్వంతరి దీవి గోపాలాచార్యులు

వేదముల వలెనే ఆయుర్వేదం బ్రహ్మచే స్వయంగా తెలుసుకొనబడి, బ్రహ్మ నుండి దక్షప్రజాపతి, ఆయన నుండి అశ్వినీ దేవతలు, వారి నుండి ఇంద్రుడు ఆయుర్వేదమును నేర్చుకున్నారన్నది పురాణ వాక్యం. అనేక వ్యాధులను నయం చేయాలన్న సదుద్దేశంతో భరద్వాజ, ఆత్రేయ, కశ్యప, కాశ్యప, నిమి మొదలగు ఋషులు ఇంద్రుని వేడుకోగా, కాయ, బాల, గ్రహ, ఊర్ధ్వాంగ (శాలక్య), శల్య, దంష్ట్ర, జరా, వృష అను 8 విభాగాలతో కూడిన ఆయుర్వేదమును ఆ ఋషులకు ఇంద్రుడు ఉపదేశించగా , ఆ ఋషులు భూలోకమున శిష్యులకు ఉపదేశించారని, అగ్నివేశుడు మొదటిగా అగ్నివేశ తంత్రము అనే గ్రంథమును రచించగా, ఆయుర్వేద అవతరణ జరిగినట్లు కథనాలు. "ఆయువిం దతివేత్తివా ఆయుర్వేదః" అన్నది నానుడి. అంటే ఆయువును గూర్చిన విజ్ఞానం. ఇది భారత దేశంలో అతి పురాతనకాలం నుండి వాడుకలో ఉన్న వైద్యం. ఆధునిక వైద్యం కారణంగా, ఇది కొంచం వెనకబడినా ప్రస్తుతకాలంలో తిరిగి ప్రాచుర్యాన్ని సంతరించుకుంటున్నది. శస్త్రచికిత్స చేసే కొన్ని వైద్యరీతుల్లో ఆయుర్వేదం ఒకటి. శాఖోపశాఖలుగా విస్తరించిన ఈ వైద్య ప్రక్రియలు ఆధునిక వైద్యానికి లొంగని కొన్ని రకాలైన దీర్ఘకాలిక వ్యాధుల్ని, మొండి వ్యాధుల్ని సైతం నయం చేస్తాయని చెబుతారు. భారత దేశంలో సహస్రాబ్దుల నుండి ఆచరణలో ఉన్న ఆయుర్వేదంను నిషేధించాలని బ్రిటిష్ ప్రభుత్వం భావించి అది అశాస్త్రీయం అని నిరూపించటానికి కి ఒక సంఘం ఏర్పరచి, దానితో అశ్వగంధ బలాతిబల మొదలైన మహా మూలికలను నిష్ప్రయోజనం అని నిరూపింప జేసి ఆయుర్వేదాన్ని భూస్థాపితం చేసే తీవ్ర ప్రయత్నం చేసింది. ప్రమాదం పసిగట్టి భారత వైద్య ప్రతినిధిగా ఎదిరించి నిలిచి "ఆయుర్వేద కాంగ్రెస్ " స్థాపించి ఆసేతు హిమనగం, బర్మా, కాబూల్ లలో పర్యటించి, మహా పండితులను ఏకం చేసి ఉద్యమానికి బాసటగా మద్రాస్ లో ఆయుర్వేద కళాశాల స్థాపించి, అనేక ఆయుర్వేద గ్రంథాలకు సులభ వ్యాఖ్యలు రాసి ప్రచురించి ఆయుర్వేదం మహోన్నత వైద్య విధానం అని ప్రపంచానికి చాటిన మహోన్నత వ్యక్తీ పండిత దీవి గోపాలాచార్యులు. ఆయన ఆనాడు అంతగా కృషి చేయక పోతే, నేడు ఆయుర్వేదం మచ్చుకైనా కనిపించేది కాదు. దీవి గోపాలాచార్యులు (అక్టోబరు 10, 1872 - సెప్టెంబరు 29, 1920) వైద్య శాస్త్రవేత్త, హిందూ సంప్రదాయ వైద్య పరిశోధకులు, ఆయుర్వేద పండితులు, అఖిల భారత ఆయుర్వేద విద్యాపీఠానికి పూర్వాధ్యక్షులు. ఆయుర్వేద వైద్య చికిత్సకు దేశస్థాయిలో కీర్తి ప్రతిష్టలు తెచ్చిన అపర ధన్వంతరిగా పేరు సంపాదించారు. ఆధునిక కాలంలో ఆయుర్వేద వైద్య చికిత్సకు పునరుజ్జివం కల్పించారు. దక్షిణా



పథంలో ఆయుర్వేద వైద్యానికి పునఃప్రాణ ప్రతిష్ఠ చేసి, యావద్భారత ఖ్యాతి గాంచిన ఏకైక ఆంధ్రుడు.ఆయన స్వగ్రామం. కృష్ణా జిల్లా, నాగాయలంక మండలం (దివిసీమ) లోని భావదేవరపల్లి గ్రామం . అయితే బందరులో 1872, అక్టోబరు 10 న జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసానం తరం 1886 లో తిరుపతి వెళ్ళి మహంతు పాఠశాలలో కొంతకాలం చదివారు. సంస్కృత భాషాధ్యయనం పూర్తి చేసిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా పర్యటనలు చేశారు. సామాజిక సేవకు ప్రాచీన హిందూ సంప్రదాయ వైద్య విధానమే ఉత్తమమని నిర్ధారణకు వచ్చారు.కర్ణాటక రాష్ట్రం చేరి, మైసూరులోని సంస్కృత కళాశాలలో చేరి, ఆయుర్వేద వైద్య విద్యార్థిగా విద్యాభ్యాసం చేశారు. ప్రాచీన హిందూ వైద్య శాస్త్రాలలో ప్రధాన విభాగంగా రూపొందింన ఆయుర్వేద వైద్య చికిత్సా శాస్త్రమును ఔపోసన పట్టారు. 1893 లో వైద్య విద్యాభ్యాసాన్ని పూర్తి చేసుకొని రెండేళ్ళపాటు విస్తృతంగా దేశ పర్యటనలు చేశారు. నగరాలలోని, కుగ్రామాల లోని భిషగ్వర్యులను శుశ్రూషతో సేవించి, వైద్య పరిశోధనలు చేశారు.ఆయా ప్రాంతములలోని ప్రకృతి వనరులను, మూలికలను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ఆ సమయంలో (1894-95) కలరా, ప్లేగు వ్యాధులు దేశమంతా వ్యాపించి ఉన్నాయి. సరైన చికిత్స, ప్రామాణిక మందులు లేక వందలాది మంది మృత్యువాత పడటం చూసిన ఈయన మనసు తల్లడిల్లి పోయింది. బెంగళూరు లోని థియోసాఫికల్ సొసైటీ వారి ఆసుపత్రిలో వైద్యులుగా చేరి చాలాకాలం వైద్య సేవలు అందిస్తూ, ప్రత్యక్ష శాస్త్రానుభవాన్ని సంపాదించారు. 1898-99 లో బెంగళూరు నగరాన్ని కూడా గొప్ప భయంకర ప్లేగు వ్యాధి చుట్టు ముట్టింది. ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. మైసూరు మహారాజు ఈయనను రాష్ట్ర ఆస్థాన చికిత్సకులుగా నియమించారు. ప్లేగు, కలరా వ్యాధుల నిరోధానికి ప్రాచీన హిందూ సంప్రదాయ వైద్యాన్ని ఉపయోగించుకొని "శతధౌత ఘృతం" "హైమాది పంక్రమ్ (పానకం)" అనే రసాయ నాలను సృష్టించి ఔషధ రూపంలో వ్యాధిగ్రస్తులకు అందించారు. ఆ విధంగా ప్రజలకు ఎంతో మేలు ఒన కూర్చారు. తర్వాత చెన్నపట్టణం చేరి, శ్రీకన్యకా పరమేశ్వరి ఆయుర్వేద కాలేజి అండ్ హాస్పిటల్ లో ప్రొఫెసర్ గా, వైద్యులుగా పనిచేశారు. ఇంగ్లీషు రాకున్నా ఎనిమిది భారతీయ భాషలు మీద సాధికారత సంపాదించు కున్నారు. వైద్యులుగా పనిచేస్తున్న సమయం లోనే మద్రాసులోనే ఆయుర్వేదా శ్రమమును నెలకొల్పి, మరణించే వరకు అక్కడే ఉన్నారు. మద్రాసు ఆయుర్వేద కాలేజీకి కొంతకాలం ప్రిన్సి పాల్ గా వ్యవహరించారు. ఆయుర్వేదాంగ శల్యతంత్రము అనే గ్రంథం రచించారు. దేశీయ ఆయుర్వేద వైద్యానికి ప్రాచుర్యం తీసుకు రావాలనే మహదాశయంతో "ఆయుర్వేదా శ్రమ గ్రంథమాల"ను ఏర్పాటు చేసి వివిధ భారతీయ భాషలలోని ప్రాచీన గ్రంథాలను సేకరించి, ఎంతో అరుదైన వాటిని అనువదింప జేశారు. ఈ గ్రంథమాల నుంచి దాదాపు 22 అతి ముఖ్యమైన వైద్య శాస్త్ర గ్రంథాలు వెలువడినాయి. వాటిలో మాధవ నిదానం, అర్క ప్రణాళిక, ఆయుర్వేద వైద్య పరిభాష, రస ప్రదీపిక, భేషకల్పం మొదలైన శీర్షికలతో ప్రాచీన హిందు వైద్య గ్రంథాలకు తెలుగులో చక్కని వ్యాఖ్యానాలు జోడించి, వివరించారు. ఆయన వైద్య సేవలు గుర్తింపుగా, నాసిక్ (ప్లేగు వ్యాధితో అట్టుడికి పోయిన పట్టణం) లో "ఆయుర్వేద మార్తాండ", కలకత్తాలో "భిషజ్ఞణి" బిరుదులు అందుకున్నారు (1907), అయిదవ జార్జి బ్రిటీష్ పాలక ప్రభుత్వం తరపున "వైద్యరత్న" బిరుదును అందించి (1913) ప్రతిష్మాత్మక గౌరవ మన్ననలు అందించారు. ఆయుర్వేద వైద్య జగత్తుకు ప్రచారం కల్పించటానికి అహరహం కష్టించారు. ఆయన జీవితమే భారతదేశ ఆయుర్వేద చరిత్రగా భాసిల్లింది. 1901లో మద్రాసు ఉమ్మడి రాష్ట్రంలో తొలి ఆయుర్వేద కళాశాలను స్థాపించారు. 1902లో చెన్నపురి ఆయుర్వేద ప్రచారిణి సభ ప్రారంభించారు. 1905 లో ఆయుర్వేద కళాశాల తొలి పట్ట భద్రుల బృందం బయటికి వచ్చింది. 1917లో ఆయన అఖిల భారతా యుర్వేద విద్యాపీఠానికి అధ్యక్షత వహించి దేశ వ్యాప్తంగా ఆయుర్వేద అభివృద్ధికి కృషిచేశారు. వైద్యరత్న, ఆయుర్వేద మార్తాండ భిష్మణి బిరుదు పొంది ప్రఖ్యాతిచెందారు. దేశవ్యాప్తంగా ఆయుర్వేదాన్ని ప్రచారం చేయడంలో, విస్తృతమైన వ్యాప్తికి కృషిచేయడంలోనూ ప్రశస్తిపొందారు.

# కొత్త మద్యం షాపుల లైసెన్స్ కై దరఖాస్తుల ఆహ్వానం





**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్ 09(సూర్యరేఖ)** గోల్కొండ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 2025-27 సంవత్సరానికి గాను మద్యం షాపుల నిర్వహణకు లైసెన్స్ పొందడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గోల్కొండ ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ సి.హెచ్.శ్రావణి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా గోల్కొండ ప్రొహిబిషన్,ఎక్సైజ్ శాఖ ఎస్.హెచ్.ఓ సి.హెచ్. శ్రావణి మాట్లాడుతూ...గోల్కొండ ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 2025-27 సంవత్సరానికి గాను రిటైల్ మద్యం షాపుల నిర్వహణకు 2025 డిసెంబర్ ఒకటో తేదీ నుంచి 2027 నవంబర్ 30వ తేదీ వరకు కొత్త లైసెన్సులను పొందడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.ఆసక్తి కలవారు 21 సంవత్సరాల కంటే ఎక్కువ వయసు కలిగిన వారు ఎవరైనా మూడు లక్షల రూపాయలు (నాన్ రిఫండబుల్) చెల్లించి ఈ నెల18వ తారీకు వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.షాపు కేటాయింపు పొందిన వారికి లైసెన్సు రెండేళ్ల పాటు చెల్లుబాటు అవుతుందన్నారు.హైదరాబాద్ జిల్లాకు సంబంధించిన మద్యం దుకాణాల దరఖాస్తులు నాంపల్లిలోని అబ్కారీ భవన్ లో ఐదవ అంతస్తులో స్వీకరించడం జరుగుతుందనీ ఆమె తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై చర్చ.



**నారాయణపేట,అక్టోబర్09(సూర్యరేఖ)**జెడ్పిటిసి ,ఎంపిటిసి సాధారణ ఎన్నికల పరిశీలకులు పి.కాత్యాయని దేవి గురువారం నారాయణపేట జిల్లాకు విచ్చేసిన సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ ఛాంబర్ లో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై చర్చించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిబంధన ఉల్లంఘించిన కేసులో నిర్దోషులకు అభినందనలు



**నారాయణపేట,అక్టోబర్09(సూర్యరేఖ)** 2019 కొడంగల్ అసెంబ్లీ ఎన్నికల్లో నాగురావు నామాజి,15 మందిపై ఎన్నికల నిబంధన ఉల్లంఘించిన కేసులో నిర్దోషులుగా కొడంగల్ కోర్టు తీర్పు వెల్లడించింది.ఈ సందర్భంగా తీర్పును స్వాగతించిన న్యాయవాదులు పూనమచంద్ లాహోటి,బస్వరాజు,మదన్ జమల్కారి మురళీ మోహన్ నామాజి,రవినాయక్ పాల్గొని అభినందనలు తెలుపడం జరిగింది.

## తప్పుడు సమాచారం ఇస్తే చర్యలు తప్పవు..

**ఎస్ఐ రాజేష్**




**నిజాంపేట,అక్టోబర్09(సూర్యరేఖ)** మండల పరిధిలోని నగరంకు చెందిన బద్దు అనే వ్యక్తి తన పాస్ పోర్ట్ విషయంలో ప్రభుత్వ కార్యాలయాలలో తప్పుడు సమాచారం ఇచ్చినందున అట్టి విషయంలో విచారణ అనంతరం బద్దుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేష్ పేర్కొన్నారు.ఎవరైనా ప్రభుత్వ సంస్థలకు తప్పుడు సమాచారం ఇస్తే అట్టి వారిపై క్రిమినల్ కేసులు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

## బెల్లంపల్లిలో కీ"శే" కారుకూరి శ్రీనాథ్ మహర్షి జయంతి సందర్భంగా సాయి భోజన్







**అన్నదానం కార్యక్రమం నిర్వహణ**


**బెల్లంపల్లి,అక్టోబర్ 09(సూర్యరేఖ)** బెల్లంపల్లి వాస్తవ్యులు కీ"శే" కారుకూరి శ్రీనాథ్ మహర్షి జయంతి సందర్భంగా,వారి కుటుంబ సభ్యులు అందించిన ఆర్థిక సహకారంతో గురువారం సనాతన ధర్మ బాయిజమ్మ సాయి భక్తి ప్రచార ధార్మిక సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయి భోజన్ అన్నదానం నిర్వహించారు.పట్టణంలోని పలు చోట్ల యాచకులు, మానసిక వికలాంగులు వృద్ధులు,అనాథలు, రోగులు,పేదవారికి భోజనం పంచారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ కాంపల్లి శంకర్-రాజేశ్వరి,ట్రస్ట్ మేనేజర్ బొద్దున సతీష్,సభ్యులు సేవకులు పాల్గొన్నారు.

## నేడు ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా




**ఉప్పల్,అక్టోబర్ 09 (సూర్యరేఖ)** ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారీ ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. విజయకుమార్ తెలియజేశారు.నిర్మాన్ సంస్థ ఆధ్వర్యంలో దాదాపుగా 15 నుంచి 20 కంపెనీలు కళాశాలలో జాబ్ మేళాను నిర్వహిస్తాయని ఉప్పల్, మల్కాజ్గిరి జిల్లాలో నివసిస్తున్న ఇతర ప్రాంతంలో ఉన్న నిరుద్యోగులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని ప్రిన్సిపాల్ తెలియజేశారు. కళాశాలలో కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ తిరుపతయ్య మాట్లాడుతూ...జాబ్ మేళా ఈ నెల 10 అక్టోబర్ 2025,10 గంటలకు ప్రారంభమవుతుందని,ఇంటర్,డిగ్రీ చదివిన విద్యార్థిని విద్యార్థులు తప్పకుండా హాజరై ఉద్యోగం పొందాలని ఈ జాబ్ మేళాకు 18 వేల నుంచి 35 వేల వరకు నెల జీతంగా కంపెనీలు ప్రకటించాయని తెలియజేశారు.సాఫ్ట్వేర్ కంపెనీలతోపాటు బ్యాంకింగ్ మరియు ఎడ్యుకేర్ సంబంధించిన కంపెనీలు వస్తున్నందున ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, ప్రైవేట్ కళాశాల విద్యార్థులు ఉద్యోగం కోసం ఎదురుచూసే ఆశావహులు నేడు 10 గంటలకు జరిగే జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగాలు పొందాలని తెలియజేశారు. ఏమైనా సందేహాలు ఉంటే కళాశాల ప్లేస్మెంట్ కన్వీనర్ డాక్టర్ తిరుపతయ్య 905982 3318ను సంప్రదించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్స్ రవి ప్రసాద్ డాక్టర్ సత్యనారాయణ డాక్టర్ రాజశ్రీ,డాక్టర్ విశ్వనాథ్ కుమార్ గీత డాక్టర్ శ్రీనివాస్ రావు,డాక్టర్ డాక్టర్ సాగర్ పాల్గొన్నారు.

## నాగార్జునసాగర్ సందర్శించిన ప్రముఖ దర్శకుడు త్రినాథ్ రావు నక్కిన



**ఉప్పల్,అక్టోబర్ 09(సూర్యరేఖ)** స్నేహితులతో కలిసి నాగార్జునసాగర్ ను ప్రముఖ చలనచిత్ర దర్శకుడు త్రినాథ్ రావు నక్కిన,మిత్రులు రామంతాపూర్ యూత్ కాంగ్రెస్ నాయకుడు గడ్డం రవి,రచయిత విక్రాంత్ శ్రీనివాస్, రియల్టర్ రాజేష్ లతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగార్జునసాగర్ గేట్లు ఎత్తిన అద్భుతదృశ్యాలను వీక్షించి తమకు ఆనందం కలిగిందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాతి ఆనకట్టలలో ఒకటైన నాగార్జున సాగర్ గేట్లు ఎత్తడం ఒక విస్మయం కలిగించే సంఘటన అని పేర్కొన్నారు. అయితే సందర్శకులు జాగ్రత్తలు పాటించాలని ప్రముఖ చలనచిత్ర దర్శకుడు సూచిస్తున్నారు.

## బీఆర్ఎస్ నాయకులు అరెస్ట్..




**బెల్లంపల్లి,అక్టోబర్ 09 (సూర్యరేఖ)**ఆర్టీసీ టికెట్ ధరల పెంపును నిరసిస్తూ హైదరాబాద్‌లోని బస్సు భవన్ ముందుడికి బయలుదేరుతున్న బెల్లంపల్లి బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు ముందుగానే అరెస్ట్ చేసి,ఒక టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు.కాంగ్రెస్ ప్రభుత్వం భరించలేని అరాచకాలు చేస్తోందని పట్టణ యువత ఆవేదన వ్యక్తం చేసింది.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ బీఆర్ఎస్ పార్టీ యువ అధ్యక్షుడు అరుణ్ కుమార్,33వ వార్డు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మడి కృష్ణంరాజు,నాయకులు గోపి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.ఉచిత బస్సు పేరుతో మహిళల కుటుంబాల నుండి కాంగ్రెస్ డబ్బులు దోచుకుంటోందని ఆగ్రహంగా వ్యక్తపరిచారు.

## సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం..



**నిజాంపేట,అక్టోబర్09(సూర్యరేఖ)** మండల కేంద్రంతో పాటు కల్వకుంట రజాక్ పల్లి గ్రామాలలో గురువారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వారి ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రభుత్వం ఏర్పాటు చేసినటువంటి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ప్రభుత్వం ఎ-గ్రేడ్ రకానికి క్వింటాల్ కి రూ.2389, సాధారణ రకానికి రూ.2369 చెల్లిస్తుందని రైతులకు తెలిపారు.రైతులు దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు.ఈ కార్యక్రమంలో ఏఈఓలు మౌనిక,రమ్య,సీఈఓలు గోపాల్ రెడ్డి,శోభరాణి,రైతులు బాబు కుమార్ పర్శరాములు,తదితరులు పాల్గొన్నారు.

## 1962 మొబైల్ అంబు లెన్స్ సిబ్బందికి జీతాల కోసం ఎదురు చూపులు..

**సంచార పశువాహనాల ద్వార సేవలు అందిస్తున్న 1962 సిబ్బందికి జీతాలు రాక ఇక్కట్లు..**




**నారాయణపేట,అక్టోబర్09(సూర్యరేఖ)** ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1962 వాహనాలు14 అందుబాటులో ఉన్నాయి.ఇవి మూగజీవులకు ఎటువంటి ఆపద వచ్చిన 1962 నెంబర్కుకాల్ చేసిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని అక్కడ ప్రథమ చికిత్సఅందించి అవసరమైనటువంటి మందులను అందించి మూగ జీవుల పాలిట ఆపద్బాంధవులుగా ఆదుకుంటున్నారు.ఇందులో పని చేసే సిబ్బందికి గత మూడు నెలలుగా జీతాలు రాక కుటుంబ పోషణ భారమై పిల్లల చదువులకు ఫీజులు చెల్లించలేక ఆర్థికంగా అప్పులలో కూరు కొని పోయి ఉన్నారు.వచ్చే అరకొర జీతాలతో సిబ్బంది అష్ట కష్టాలు పడుతుంటే సమయానికి జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి 1962 సిబ్బందికి 3 నెలల జీతాలను విడుదల చేయాలని సిబ్బంది వేడుకుంటున్నారు. అంబులెన్స్ లో డాక్టర్,పార వేట్ కెప్టెన్ హెల్పర్ నలుగురు సిబ్బంది పనిచేస్తున్నారు.ప్రతి నెల క్రమం తప్పకుండా జీతాలు వస్తే ఇబ్బందులు పడకుండా బాధ్యతగా ఉద్యోగం చేసుకోవడానికి అవకాశం ఉంటుందని సిబ్బంది పేర్కొంటున్నారు.ప్రతి నెలా సిబ్బందికి జీతాలకు ఇదేవిధంగా ఇబ్బందులకు గురైతే అవసరమైతే మెరుపు సమ్మెకు దిగుతామని సిబ్బంది తెలియజేశారు.తమ పరిస్థితిని అర్థంచేసుకొని సరైనసమయంలో ప్రభుత్వం నుంచి జీతాలుఇవ్వాలని సిబ్బంది ప్రభుత్వాన్ని వేడుకుం టున్నారు.

# రైతుల ధాన్యం ఎండబెట్టేందుకు స్థలం

**కేటాయించాలంటూ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన..**
**రాయలాపూర్ గ్రామ రైతుల వినతి పత్రం సమర్పణ..**



**రామాయంపేట,అక్టోబర్ 09(సూర్యరేఖ)** రామాయంపేట మండలంలోని రాయలాపూర్ గ్రామ రైతులు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్దకు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ సమస్యలను వెల్లడించారు.ధాన్యం కొనుగోలు సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో రైతులు తాము కోత కోసిన వడ్లను ఎండబెట్టేందుకు సరైన స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతి సీజన్‌లో రాయలాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి,రామాయంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా ధాన్యం సేకరణ జరుగుతుందని రైతులు తెలిపారు. అయితే,ప్రస్తుతం ఉన్న సంఘ స్థలం చాలక రోడ్డుపై, పొలాల్లో ధాన్యం ఆరబెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.రోడ్డుపై ధాన్యం పోస్తే రవాణాకు ఆటంకం కలుగుతోందని,పోలీసు అధికారులు కూడా అడ్డుకుంటున్నారని రైతులు వివరించారు.ఈ నేపథ్యంలో రాయలాపూర్ గ్రామంలోని ఎల్లమ్మ గుడి, హనుమాన్ గుడి ముందు ఉన్న సర్వే నెం.881లోని ప్రభుత్వ భూమిలో కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని తహసీల్దార్ రజనీకుమారిని కోరుతూ వినతి పత్రం సమర్పించారు.రోడ్డుపై వడ్లు ఆరబెట్టడం వాహనదారులకు ఇబ్బందికరమని,ప్రమాదం కూడా ఉందని రైతులు పేర్కొన్నారు.కనుక ప్రభుత్వమే తక్షణం ప్రత్యామ్నాయ స్థలం కేటాయించి తమ సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ వినతి పత్రం సమర్పణ కార్యక్రమంలో సుమారు 100 మంది రైతులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ,జెడ్పీటీసీ ఎన్నికల ఏర్పాట్లు పరిశీలించిన ఐఏఎస్ అధికారి వాసం వెంకటేశ్వర్ రెడ్డి





**నామినేషన్ కేంద్రాల్లో సౌకర్యాలను పరిశీలన**
**అధికారులకు సూచనలు..**



**రామాయంపేట,అక్టోబర్ 09(సూర్యరేఖ)** ఎంపీటీసీ,జెడ్పీటీసీ సాధారణ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించేందుకు మెదక్ జిల్లాకు వచ్చిన సాధారణ పరిశీలకుడు,ఐఏఎస్ అధికారి వాసం వెంకటేశ్వర్ రెడ్డి గురువారం రామాయంపేట మండల పరిషత్ కార్యాలయాలను సందర్శించారు.ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రాల్లో జరుగుతున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఆయన సమీక్షించారు.ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు సాఫీగా సాగేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు.హెల్ప్ డెస్కులు రిటర్నింగ్ అధికారి చాంబర్, నామినేషన్ల స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన టేబుళ్లు, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన వంటి ఏర్పాట్లను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సమర్థవంతంగా సాగాలని పరిశీలకుడు వాసం వెంకటేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాదిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే రోహిత్ రావు..



**నిజాంపేట,అక్టోబర్09(సూర్యరేఖ)** మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్,తండ్రి బాలరాజు గౌడ్,కు బ్రెయిన్ స్ట్రోక్ రాగా గురువారం వెంకటేష్ కుటుంబ సభ్యులను మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, పరామర్శించారు.అలాగే మాజీ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నసీరుద్దీన్ తండ్రి షాపుద్దీన్,ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం తాజా మాజీ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు అమరసేనారెడ్డి,కి ఆరోగ్య రీత్యా ఆపరేషన్ కావడంతో వారిని వారి కుటుంబ పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు.ప్రతి ఒక్క కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు కొమ్మట బాబు,రమేష్ రెడ్డి,మాజీ సర్పంచ్ ఆకుల బాలయ్య, శ్రీనివాస్ నాయక్ రవినాయక్, బన్నీ,రమేష్,గరుగుల శ్రీనివాస్ రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

## బలహీన మైన జీవోతో బీసీలను మరోసారి మోసం చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం

జీవన్ సింగ్.



**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్09(సూర్యరేఖ)** రేవంత్ రెడ్డివి ఉత్తమాటలే అని,బీసీలపై కాంగ్రెస్ కు ఉన్న చిత్తశుద్ధి ఏమిటన్నది ప్రజలకు తెలిసిపోయిందని బీఆర్ఎస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గం ఇంచార్జ్ ఠాకూర్ జీవన్ సింగ్ పేర్కొన్నారు.ఈ సందర్బంగా వారి నివాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఠాకూర్ జీవన్ సింగ్ మాట్లాడుతూ. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అని బుకాయించి కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరుతో కేంద్ర నాయకులను రాష్ట్రానికి రప్పించి దొంగహామీలు ఇచ్చిందెవరని ప్రశ్నించారు. అసెంబ్లీ తీర్మానమని బీసీ బిల్లు అని ఒకసారి ఆర్డినెన్స్ అని మరోసారి ఇలా చివరగా బీసీలను నమ్మించడానికి ఢిల్లీలో ధర్నా పేరిట మరో డ్రామాకు కాంగ్రెస్ తెరలేపిందని ఆగ్రహం వ్యక్తంచేశారు.తీరా బీసీ రిజర్వేషన్ అమలు కేంద్రం, ప్రధాని పైకి తోసి రేవంత్రెడ్డి చేతులెత్తేశాడని ఎద్దేవా చేసాడు.బీసీలను మభ్యపెట్టడానికే కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ఢిల్లీలో ధర్నకు కూతవేటు దూరంలో ఉన్న రాహుల్ గాంధీ ప్రియాంకగాంధీ సోనియాగాంధీ మల్లిఖార్జున ఖర్గే ఎందుకు రాలేదని ప్రశ్నించారు.రేవంత్ రెడ్డి చేతగాని తనం బయటపడే సరికి బీఆర్ఎస్ వాళు ధర్నాకు రాలేదని తలాతోక లేని విమర్శలు పార్టీపై చేస్తున్నాడని విమర్శించారు. రాహుల్ గాంధీని ప్రధాని చేసి బీసీ రిజర్వేషన్లు సాధిస్తాం అంటున్న రేవంత్ రెడ్డి అప్పటి వరకు స్థానిక సంస్థల ఎన్నికలను ఆపుతావా అని జీవన్ సింగ్ ప్రశ్నించారు.రాహుల్ గాంధీ ప్రధాని అయ్యేది ఎప్పుడు.! బీసీ డిక్లరేషన్ అమలు అయ్యేది ఎప్పుడని ప్రశ్నించారు.బీసీ డిక్లరేషన్ లు బీసీలను మభ్యపెట్టడానికే తెచ్చారన్నది ప్రజలకు అర్థమైందని ప్రస్తుతం దీనిని కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించిందని విమర్శించారు.రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బీసీలకు చేస్తున్న మోసాన్ని గ్రహించి,రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రేవంత్ రెడ్డికి తగిన గుణపాఠం చెప్పాలని బీసీలను కోరారు.రేవంత్ రెడ్డి ప్రజలకిచ్చిన హామీలు అమలుచేయకుండా పాలనను గాలికొదిలేసి గాలిమాటలతో పబ్బం గడుపుతున్నాడని మండిపడ్డారు.ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గాలిమాటలు మాని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేసే పనిలో ఉండాలని జీవంసింగ్ సూచించారు.

## హైకోర్టులో స్టే స్థానిక ఎన్నికలకు బ్రేక్..



**నిజాంపేట,అక్టోబర్09(సూర్యరేఖ)** స్థానిక జడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో నిజాంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ల పర్వం కొనసాగుతున్న నేపథ్యంలో హైకోర్టు స్టే విధించడంతో ఎలక్షన్ అధికారులు ముందస్తు చర్యగా ఫ్లెక్సీలను తొలగించారు.హైకోర్టు మరో నాలుగు వారాలు గడువు ఇవ్వడంతో పోటీలో ఉన్న అభ్యర్థులు నిరాశకు గురయ్యారు.ఇప్పట్లో ఎలక్షన్లు జరగవని కావాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఎలక్షన్ల పేరిట ప్రజలను మభ్యపెడుతుందని ఆరోపించారు. ఎలక్షన్ జరుగుతాయని నేపథ్యంలో అభ్యర్థులు ఉదయం నుండి నామినేషన్ దాఖలు వేద్దామని హడావిడి చేసిన సమయానికి హైకోర్టు స్టే విధించడం కొందరు నిరాశకు గురైన మరి కొందరు మరో నెల రోజులు సమయం కేటాయించడం ప్రచారానికి మరింత సులువుగా ఉంటుందని గ్రామాలలో ఆశావాహులు చర్చించుకుంటున్నారు.

## వ్యవసాయ పంట పొలంలోపనులు చేస్తుండగా, పిడుగు పాటుకు మృతి చెందిన మహిళ..


**మృత దేహాన్ని పరిశీలించిన ఎమ్మె ల్యే పర్ణికారెడ్డి**
**కన్నీటి పర్యంతంన మృతురాలు కుటుంబ సభ్యులు..**



**నారాయణపేట,అక్టోబర్09(సూర్యరేఖ)** నారాయణపేట పట్టణ పరిధిలో వ్యవసాయ పనులు చేస్తుండగా సాయంత్రం పిడు గుపాటుకు గురై మృతి చెందిన పద్మ (35)ఈ విషయం తెలిసిన ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి బాధితురాలు కుటుంబ స భ్యులను ఓదార్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...మృతురాలి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే వెంట పట్టణ అధ్యక్షులు ఎండి సలీం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గందే.చంద్రకాంత్,మనోహర్ గౌడ్ మల్లేష్ కోట్ల మధుసూదన్ రెడ్డి వెంకుగౌడ్ మారుతీ రాజీరెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఆదర్శ ప్రాయమైన బోధనలతో శాంతిని నెలకొల్పిన గొప్ప వ్యక్తి గాంధీ..

**పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ**





**మంచిర్యాల,అక్టోబర్09 (సూర్యరేఖ)**అహింస శాంతి కరుణ దయ ద్వారా శాంతిని సాధించాలని విశ్వసించి తన రచనల ద్వారా శాంతిని సాధించవచ్చని బోధించి భారత స్వాతంత్ర ఉద్యమానికి నాయకత్వం వహించి ప్రపంచానికి మార్గాన్ని చూపిన గొప్ప వ్యక్తి మహాత్మాగాంధీ అని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాల్లో పాల్గొనేందుకు అమెరికా పర్యటనకు వెళ్లిన పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీ కృష్ణ దేశభక్తి, గౌరవభావాలతో గురువారం న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయం వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ వంశీ కృష్ణ మాట్లాడుతూ...భారతదేశ ప్రతినిధిగా ఐక్యరాజ్యసమితిలో పాల్గొనడం గర్వకారణమని, దేశం కోసం పని చేసే దిశగా తాను కట్టుబడి ఉన్నానని వంశీ తెలిపారు.ఈ కార్యక్రమంలో భారతీయ ప్రతినిధులు ప్రవాస భారతీయులు పాల్గొన్నారు.

సూర్య
శుక్రవారం 10 అక్టోబర్ 2025

## విద్యుత్ సరఫరాలో అంతరాయం..



**చేగుంట,అక్టోబర్09,(సూర్యరేఖ)** చేగుంట మండలంలోని132/33 సబ్ స్టేషన్ లో మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ సంపత్ కుమార్ తెలిపారు.శుక్రవారం ఉదయం 10గంటల నుండి చేగుంట మండలంలో ఆర్ఎస్ జి, పైయినీర్,చంద్రంచల్,చేగుంట మండల కేంద్రంలోని చేగుంట బోనాల అనంత సాగర్ 33 కెవి లైన్లు అదేవిధంగా చేగుంట అనంతసాగర్,కర్నాల్ పల్లి,చందాయ్ పేట,గొల్లపల్లి,కసాన్ పల్లి సబ్ స్టేషన్, పరిధిలోని వీళ్ళజ్, ఇండస్ట్రియల్,అగ్రికల్చర్ ఫీడర్లకు ఉదయం 10 గంటల నుండి మ:4:00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.దీనికి గాను చేగుంట పట్టణ,మండల ప్రజలు సహకరించలని ఏఈ సంపత్ కుమార్ తెలిపారు.

## పంచాయతీ సెక్రటరీ వల్ల ఆత్మహత్య చేసుకున్న కుటుంబాన్ని ఆదుకోండి..

**రాష్ట్ర మాల,మహానాడు సభ్యులు కొండి స్వామి**



**చేగుంట,అక్టోబర్09(సూర్యరేఖ)** పంచాయతీ సెక్రెటరీ వల్ల ఆత్మహత్య చేసుకున్న కొండి లక్ష్మి,తనకు న్యాయం చేయాలని కోరుతూ, లక్ష్మి భర్త అంజయ్య చేగుంట తాహసిల్దార్ కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...చేగుంట మండలం,పొలంపల్లి గ్రామం లోని ఉన్న ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 97లో గల భూమి సర్వే చేసి తనకు ఒక ఎక్రా భూమి ఇచ్చి పట్టా పాస్ బుక్ త్వరగా ఇవ్వాలని చేగుంట తాహసిల్దార్ కి వినతి పత్రం అందచేసారు.తాహసిల్దార్ మాట్లాడుతూ... ఇట్టి విషయంపై అధికారులకు తెలియ చేసి,వారి అదేశాల మేరకు త్వరలోనే బాధిత కుటుంబానికి న్యాయం జరిగేటట్లు చూస్తా అని అన్నారు.ఈ కార్యక్రమంలో మాల,మానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండి స్వామి,దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వెకిలి చేష్టలు చేస్తున్న ఏడుగురు ఆకతాయిలను పట్టుకున్న షిటీమ్..

**షిటీమ్ డెకాయ్ ఆపరేషన్**

**మంచిర్యాల,అక్టోబర్ 09(సూర్యరేఖ)** విద్యార్థినుల పట్ల వెకిలి చేష్టలు చేస్తున్న ఏడుగురు ఆకతాయిలను మంచిర్యాల జిల్లా షిటీమ్ పట్టుకున్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ లోని మంచిర్యాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రైవేట్ బాలికల వసతి గృహాల వద్ద వెకిలి చేష్టలు చేస్తున్న ఏడుగురు ఆకతాయిలను మంచిర్యాల షిటీమ్ సిబ్బంది డెకాయ్ ఆపరేషన్ నిర్వహించి గురువారం రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని కౌన్సెలింగ్ నిర్వహించి హెచ్చరించడం జరిగిందని మంచిర్యాల షిటీమ్ ఎస్సై ఉషారాణి తెలిపారు. ఎవరైనా విద్యార్థినులను ఆకతాయిలు వేధింపులకు గురైనట్లయితే వెంటనే డయల్ 100,రామగుండం షీటీం నెంబర్ 6303923700,కాల్ చేయాలని,లేని పక్షంలో వాట్సప్ ద్వారా సమాచారం ఇవ్వాలని సూచించారు.

## దాతల సహకారంతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు..



**వలిగొండ,అక్టోబర్ 09 (సూర్యరేఖ)** దాతల సహకారంతో విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మామిడి సత్తిరెడ్డి అన్నారు.గురువారం మండల పరిధిలోని మొగిలిపాక గ్రామంలో గల మండల ప్రజా పరిషత్ పాఠశాలలో దాత ముద్దసాని నరోత్తమ రెడ్డి సహకారంతో 40 వేల విలువగల పెయింటింగును వేశారు.ఈ సందర్భంగా ఆయన పనులను పరిశీలించి మాట్లాడుతూ... విద్యార్థులు ఉన్నతంగా ఎదగడానికి దాతలు ముందుకు రావడం హర్షించదగిన విషయమని ఆయన అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని దాతలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణమయ్య, ఉపాధ్యాయులు,విద్యార్థులు,తదితరులు ఉన్నారు.

# స్థానిక ఎన్నికలకు జిల్లా యంత్రాగం సిద్ధం

**జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ సిక్తాపట్నాయక్**
**నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను సందర్శించిన**
**జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ సిక్తాపట్నాయక్**





**నారాయణపేట,అక్టోబర్09 (సూర్యరేఖ)** స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ ను అనుసరిస్తూ నారాయణపేట జిల్లాలో తొలి విడత ఎం.పీ.టీ.సీ, జెడ్.పీ.టీ.సీ స్థానా లకు రిటర్నింగ్ అధికారులు గురు వారం నోటిఫికేషన్ లు జారీ చేసి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.నారాయణపేట జిల్లా పరిధిలోని 8 మండలాలు దామరగిద్ద, నారాయణపేట ధన్వాడ మరికల్ కోస్గి కొత్తపల్లి గుండుమల్ మద్దూరు జెడ్పీటీసీ స్థానాలతో పాటు,పై మండలాల పరిధిలోని 82 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు.ఈ నేపథ్యంలో నారాయణపేట ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన జెడ్పీటీసీ నారాయణపేట క్లస్టర్ పరిధిలోని పేరపళ్ళ సింగారం,బైరం కొండ ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను,అలాగే నారాయణపేట మండలం జాజాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పా టు చేసిన జాజాపూర్-1,జాజాపూర్ -2,శేర్నపల్లి ఎంపీటీసీ నామి నేషన్ కేంద్రాలు,అలాగే దామరగిద్ద మండల కేంద్రంలోని జెడ్పీటీసీ,క్లస్టర్ పరిధిలోని ఎంపీటీసీ స్థానాల నామినేషన్ కేంద్రాలను ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తాపట్నాయక్ గురు వారం ఆకస్మికంగా సందర్శించి అందుబాటులో ఉన్న సదుపాయాలు, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారా అని పరిశీలించారు. హెల్ప్ డెస్క్,వీడియోగ్రఫీ,పోలీస్ బందోబస్తు తదితర అంశాలను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ సపోర్టింగ్ స్టాఫ్ సరిపడా ఉన్నారా అని ఆరా తీశారు. నోటీసు బోర్డులపై నోటిఫికేషన్ పత్రాలను ప్రదర్శించారా? లేదా అని తనిఖీ చేశారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్ల ప్రక్రియను నిర్వహించాలని,నామి నేషన్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న వారి వివరాలను రిజిస్టర్ లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు.దాఖలైన నామినేషన్లకు సంబంధించిన అఫిడవిట్ లను ఏ రోజుకు ఆ రోజు నోటీసు బోర్డులపై ప్రదర్శిస్తూ జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలని ఆర్. ఓలను ఆదేశించారు.ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని నామినేషన్ పత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని తెలిపారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలన్నారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా,పై అధికారులను సంప్రదించాలని సూచించారు.

**స్థానిక సంస్థల ఎన్నికలకు జిల్లా యంత్రాంగం సిద్ధం..**

రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ మాట్లాడారు.రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ సెప్టెంబర్ 29వ తేదీన షెడ్యూల్ విడుదల చేసిందని వెల్లడించారు. అందులో భాగంగా జిల్లాలో మొదటి విడతలో 8 జడ్పీటీసీలు స్థానాలు,82 ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణకు చేసిన హెల్ప్ డెస్క్ లు,ఇతర ఏర్పాట్లను పరిశీలించామని వివరించారు.ఇప్పటికే ఎన్నికల నేపథ్యంలో ఆర్ఓ,ఏఆర్ఓలకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని జోనల్,మండల ఆఫీసర్లు,ఎంసీసీ నోడల్ ఆఫీసర్లు,ఎఫ్ఎస్ టీ,ఎస్ఎస్ టీటీంలను నియమించి శిక్షణ పూర్తి చేశామని పేర్కొన్నారు. ఎఫ్ఎస్ టీ, ఎస్ఎస్ టీటీంలను విధులు నిర్వర్తిస్తున్నాయని తెలిపారు.అన్ని ఆర్ఓ కార్యాలయాల్లో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల సహాయార్థం హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయాలని ఎన్నికకు సంబంధించిన పూర్తి సమాచారం అందుబాటులో పెట్టాలని నామినేషన్ల స్వీకరణ ఇతర వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

# ఆర్టీసీ బస్సులో బస్ భవన్ కు వెళ్లిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్,అక్టోబర్ 09(సూర్యరేఖ)** ఆర్టీసీ బస్సు చార్జీలను పెంపు నిరసిస్తూ కేటీఆర్, పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఉప్పల్ నుండి ఆర్టీసీ బస్సులో నాయకులు,కార్యకర్తలు కార్పొరేటర్లు మాజీ కార్పొరేటర్,తో కలిసి బస్సుభవన్ కు బయలుదేరి వెళ్లారు.ఈ సందర్భంగా ఆయన బస్సు టికెట్ రేట్ల పెంపుపై ప్రయాణికులతో మాట్లాడారు.కేసీఆర్ ఆర్టీసీని లాభాల బాట పట్టించాలని,ఆర్టీసీలో కార్గోను ప్రారంభించారని గుర్తు చేశారు. దానివల్ల ప్రభుత్వానికి సంవత్సరానికి 100 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు.కానీ ఆ కార్గో మీద కూడా రేవంత్ రెడ్డి కన్ను పడ్డదని,అడ్డికి పావుసేరుకు ఆ కార్గోను కూడా అమ్మడానికి చూస్తున్నాడని ఆరోపించారు.కమిషన్లు దంచుడు కాదు,పేదల కోసం పని చెయ్యి రేవంత్ రెడ్డి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అడ్డగోలుగా పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. బస్సు భవన్ చేరుకున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పెంచిన ఆర్టీసీ బస్ చార్జీలను వెంటనే తగ్గించాలని పేద మధ్య తరగతి ప్రజల పక్షాన బస్ భవన్ లో టీజీఎస్ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు,మాజీ కార్పొరేటర్లు, నాయకులు,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఎంపీటీసీ జెడ్పీటిసిల నామినేషన్ ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల పరిశీలనాధికారి

**ఆసం వెంకటేశ్వర్ రెడ్డి**

**నిజాంపేట,అక్టోబర్09(సూర్యరేఖ)** మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ జెడ్పిటిసిల ఎన్నికల సంబంధించి నామినేషన్ ఏర్పాట్లను రాష్ట్ర ఎన్నికల పరిశీలన అధికారి ఆసం వెంకటేశ్వర్ రెడ్డి,అడిషనల్ కలెక్టర్ నగేష్,లు నామినేషన్ల స్వీకరణ సెంటర్ ఎన్నికల పోలింగ్ బూత్,లను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్థానిక ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరగాలని,ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతిరోజు స్వీకరించిన పత్రాలను భద్రపరిచి సంబంధిత రిజిస్టర్ నమోదు చేయాలని తెలిపారు. పోలింగ్ బూతులను సందర్శించి ఎన్నికలవేళ ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజిరెడ్డి,ఏపీవో శ్రీనివాస్ ఇన్చార్జ్ ఎంపీవో వెంకట నరసింహారెడ్డి రామాయంపేట సిఐ వెంకట్ రాజా గౌడ్,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అన్నపూర్ణకాలనీ డ్రైనేజీ లైన్ కు నిధులు మంజూరు





**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం.. మల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర సాయికిరణ్ గౌడ్**

**ఉప్పల్,అక్టోబర్ 09 (సూర్యరేఖ)** ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో మల్లాపూర్ డివిజన్ లోని అన్నపూర్ణకాలనీ రోడ్డు నెంబర్- 7కు నూతన డ్రైనేజ్ లైన్ కు సుమారు రూ.82 లక్షల నిధులు మంజూరైన సందర్భంగా గురువారం మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కప్పర సాయికిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కప్పర సాయికిరణ్ గౌడ్ మాట్లాడుతూ...మల్లాపూర్ డివిజన్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చాక రెండు సంవత్సరాలు వ్యవధిలో కోట్లాది రూపాయలు అభివృద్ధి పనుల కోసం వచ్చాయని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గం ఇన్చార్జి పరమేశ్వర్ రెడ్డి సహకారంతో మల్లాపూర్ డివిజన్ కు పెద్ద ఎత్తున నిధులు మంజూరు అవుతున్నాయని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దంతురి రాజుగౌడ్ మెరుపుల బాలరాజ్ పర్వతాలు ముజీబ్ జానీభాయ్ సురేష్, శ్రీనివాస్ శ్రీనివాస్ రెడ్డి జోష్ ఫసీదుదెన్ మనోహర్ ఉపేందర్ రెడ్డి కయీమ్ శైలజ సోనీ ఇంతయాజ్ లావణ్య సునీత జయంతి సమీర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

# పెంచిన బస్సు చార్జీలు ఉపసంహరించుకోవాలి








**హరీష్ రావు..**

**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్ 09(సూర్యరేఖ)** కాంగ్రెస్ ప్రభుత్వం విచక్షణా రహితంగా బస్సు చార్జీలను పెంచడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ తరపున చలో బస్ భవన్ పిలుపు కార్యక్రమానికి కార్వాన్,నాంపల్లి నియోజకవర్గంల బీఆర్ఎస్ పార్టీ నాయకులూ మెహిదీపట్నం బస్సు స్టాప్ భారీగా చేరుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి హరీష్ రావు పాల్గొనగా కార్వాన్ నియోజకవర్గం ఇంచార్జ్ జీవన్ సింగ్,నాంపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ ఆనంద్ కుమార్ గౌడ్, మెహిదీపట్నం డివిజన్ అధ్యక్షులు మెట్టు నటరాజ్ కుమార్ పార్టీ నేతలతో ఘన స్వగతం పలికారు. చలో బస్ భవన్ కార్యక్రమంలో భాగంగా మెహిదీపట్నం నుండి బస్స్ భావనకు బస్స్ లో బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మహిళలకు ఫ్రీ అని చెప్పి మగవారికి చార్జీలు డబుల్ చేసి,పిల్లలకు బస్ పాసుల ఫీజు ధరను పెంచితే వారి కుటుంబం మీద భారం పడుతుంది కదా అని అన్నారు. మహిళలకు ఫ్రీ బస్సు అని అంటున్నారు మహిళలకు కూడా బస్సుల్లో సీట్లు దొరకని పరిస్థితి ఏర్పడిందని పరిస్థితులకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలన్నారు. కేసీఆర్ మొదలు పెట్టిన ఆర్టీసీ కార్గో సేవలు సంవత్సరానికి రూ.100 కోట్ల ఆదాయం తెస్తే,దాన్ని రూ.36 కోట్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేట్ పరం చేసారని ఆగ్రహం వ్యక్తం చేసారు. మా హయాంలో ఆర్టీసీకి సంవత్సరానికి రూ.1500 కోట్లు గ్రాంట్స్ ఇచ్చేవాళ్ళం మని ఇప్పుడు ఆర్టీసీని ప్రైవేట్ పరం చెయ్యాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం చూస్తుందని అన్నారు. పెంచిన చార్జీలను తగ్గించి,ఆర్టీసీ ఉద్యోగులకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్నిఈ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని బీఆర్ఎస్ తరపున డిమాండ్ చేస్తున్నామని హరీష్ రావు అన్నారు.

## ఆచరణ సాధ్యంకానీ హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

**గున్నాల రంగారెడ్డి**



**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్09(సూర్యరేఖ)** గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలను ఇచ్చి అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ కార్వాన్ నియోజకవర్గం సీనియర్ నాయకులు గున్నాల రంగారెడ్డి ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా వారి నివాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గున్నాల రంగారెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 2 ఏళ్లు కావస్తూన్న ఇచ్చిన ఏ ఒక్క హామిని పక్కాగా అమలు చేయలేదని ఆచరణ సాధ్యం కానీ హామీలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పిస్తామని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు పెద్ద సంఖ్యలో గెలవడం ఖాయమని జోస్యం చెప్పారు.

## రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్యానికి ప్రత్యేక దృష్టి

**జీహెచ్ఎంసీ శానిటేషన్ సూపర్వైజర్ శేఖర్**




**రాజేంద్రనగర్,అక్టోబర్09(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్యానికి ప్రత్యేకంగా దృష్టి సారించడం జరుగుతుందని జీహెచ్ఎంసీ శానిటేషన్ సూపర్వైజర్ శేఖర్ వివరించారు. మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో గురువారం జీవీపీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ శానిటేషన్ సూపర్వైజర్ శేఖర్,సంగీత,సిఓ విజయేందర్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది సమన్వయంతో ప్రాంతంలో చెత్త,చెదారం తొలగింపు పనులు చేపట్టారు. మైలార్ దేవ్ పల్లి ప్రధాన వీధులు,కాలనీలలో చెత్త పేరుకుపోకుండా శుభ్రత చర్యలు చేపట్టారు. ప్రజలు నిర్దేశిత స్వచ్ఛ ఆటోల్లోనే చెత్త వేయాలని అధికారులు సూచించారు. అదే విధంగా తడి-పొడి చెత్తను విడిగా వేరు చేయాలని అవగాహన కల్పించారు. చెత్త వేయొద్దని సూచిస్తూ ప్రదేశంలో ముగ్గుతో హెచ్చరికలు వేశారు. పరిశుభ్రమైన పరిసరాలు సమాజ ఆరోగ్యానికి బాటలు వేస్తాయని అధికారులు తెలిపారు. “పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత అని అభివర్ణించారు. ప్రతి ఒక్కరూ శుభ్రతపై శ్రద్ధ చూపాలని సూపర్వైజర్ శేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు మణెమ్మ జయంతి నిర్మల అమీనాబీ ప్రమీల హేమలత తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కాన్సీరాం వర్ధంతి వేడుకలు..




**వలిగొండ,అక్టోబర్09(సూర్యరేఖ)** బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యశ్రీ కాన్సీరాం 19 వర్ధంతి వేడుకలు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ లకు రాజ్యాంగ హక్కుల సాధన కోసం ఆయన నిరంతరం కృషి చేశారని,ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీలు అభివృద్ధి చెందాలంటే రాజకీయ ప్రాధాన్యం కావాలని ఆయన చివరి శ్వాస వరకు ఆదిశగా పోరాటం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ మండల అధ్యక్షులు సుక్క శ్రీకాంత్, బీసీ సంఘం మండలాధ్యక్షులు సాయిని యాదగిరి, గుండు కృష్ణ,సంగిశెట్టి క్రిస్టఫర్,మస్కు నరసింహ, చేగూరి అజయ్,ఎడవల్లి చందు,విజయ్,రాజు,కృష్ణ, స్వామి,వెంకటేశం కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

## లంగర్ హౌస్ తపోవనం పార్క్ లో ఈ నెల 27,28 తేదీలలో ఛట్ పూజా..




**నాంపల్లి,హైద్రాబాద్,అక్టోబర్ 9(సూర్యరేఖ)** హైదరాబాద్ లోని లంగర్ హౌస్ ప్రాంతంలో గల తపోవనంపార్క్ లో ఛట్ పూజ కార్యక్రమం ఛట్ పూజా సమితి ఆధ్వర్యంలో 27 అక్టోబర్,సోమవారం సాయంత్రం 4 నుండి 7 గంటల వరకు మరుసటి రోజు 28 అక్టోబర్ మంగళవారం ఉదయం 4 నుండి ఉదయం 7 వరకు రెండు రోజుల పటు ఛట్ పూజ మహోత్సవాలు ఘనంగా నిర్వహించడం జరుగుతోందని ఛత్ పూజా సమితి అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ ఓ ప్రకటనలు తెలిపారు. ఈ ఛట్ పూజ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే జనాబ్ కౌసర్ మొహియుద్దీన్ ఆహ్వానితుడు హాజరు అవుతారని,ప్రత్యేకంగా కలసి శాలువాతో సత్కారించి ఆహ్వాన పత్రిక అందజేయడం జరిగిందని తెలిపారు. ఛట్ పూజ సమితి అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ... కార్యక్రమం సమితి ఉపాధ్యక్షుడు అశోక్ సింగ్,ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్ అగర్వాల్,జాయింట్ సెక్రటరీ పంచమ ప్రజాపతి,కోశాధికారి సురేష్,కార్యనిర్వాహక సభ్యులు సహాయ సహకారాలతో ఛట్ పూజ ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంతో పాటు వివిధ రాష్ట్రాల నుండి భక్తులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి కార్యనిర్వాహక సభ్యులు సునీల్ సింగ్,రాహుల్ సోని,సురేష్ ప్రసాద్,రాజేందర్ సింగ్,రాజీవ్ రాజన్,కుమార్ శుక్లా,అదితి కుమారి దీపక్ విశ్వకర్మ,శైలేష్ కుమార్,గోవింద్ ఠాకూర్,ఇంద్రజీత్ ప్రజాపతి సురేష్ కుమార్,రాజ్ కుమార్,దీపక్ కుమార్,మనీష్ కుమార్ శర్మ,ఆనంద్ సింగ్,రాజేష్ శని,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహిస్తాం..

**శంషాబాద్ ఎంపీడీఓ మున్ని**




**శంషాబాద్,అక్టోబర్ 09 (సూర్యరేఖ)** ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించిన చర్యలు తీసుకుంటున్నట్లు శంషాబాద్ ఎంపీడీఓ మున్ని స్పష్టం చేశారు. ఎంపీటీసీ,జెడ్పీటీసీ ఎన్నికలకు పట్టిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. మండల పరిషత్ నామినేషన్ కార్యాలయాన్ని శంషాబాద్ డిసిపి రాజేష్ సందర్శించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధికారి మున్ని మీడియాతో మాట్లాడుతూ శంషాబాద్ మండలంలో తొమ్మిది ఎంపీటీసీ స్థానాలతోపాటు జడ్పిటి స్థానానికి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. 15వ తేదీన అభ్యర్థుల ప్రకటన ఉంటుందని తెలిపారు. 23వ తేదీన పోలింగ్ ఉంటుందని ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఉంటుందని తెలిపారు. శంషాబాద్ సంబంధించిన జెడ్పీటీసీ,ఎంపీటీసీ సంబంధించిన స్ట్రాంగ్ రూమ్ శంషాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. 11వ తేదీన కౌంటింగ్ ఉంటుందని వెల్లడించారు. ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఈ ఎన్నికలను విజయవంతం చేస్తామన్నారు.

# అక్రమ అరెస్టులతో అడ్డుకోలేవు

**ఇలాంటి ఎన్నో ఒడిదుడుకులను తట్టుకున్న పార్టీ బీఆర్ఎస్..**

**ఆర్టీసీ చార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే దాకా పోరాటం..**

**మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ కురుమ**





**రాజేంద్రనగర్,అక్టోబర్09(సూర్యరేఖ)** అక్రమ అరెస్టులతో ప్రభుత్వాన్ని రేవంత్ రెడ్డి కొనసాగించలేవని మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ కురుమ అన్నారు.ఇందిరమ్మ పాలన అంటే ఇదేనా అని ఆయన ప్రశ్నించారు.కాంగ్రెస్ సర్కార్ పెంచిన ఆర్టీసీ బస్సు ఛార్జీలకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుతో రాజేంద్ర నగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆదేశాలతో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన "చలో బస్ భవన్" కార్యక్రమానికి వెళ్లనివ్వకుండా పోలీసులు మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ తో సహా డివిజన్ ముఖ్య నాయకులందరినీ ఉదయం 5 గంటలకు ఇంటికి వచ్చి దౌర్జన్యంగా అరెస్టు చేసి పోలీసుస్టేషన్ తీసుకెళ్లారు.అక్కడ ఫ్యాన్లు సరిగా లేక దోమలతో అనేక అవస్థలు పడినట్లు తెలిపారు.ఈ అక్రమ అరెస్టును ఖండిస్తూ ఎస్.వెంకటేష్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నిర్బంధ పాలన కొనసాగిస్తున్నాడని ప్రభుత్వంలో ప్రజాస్వామ్యానికి విలువ లేకుండా పోయిందని,ఏ చిన్న కార్యక్రమం అయినా అరెస్టులతో ఆగమాగం అవుతుందని,అక్రమ అరెస్టులతో ప్రశ్నించే వారి గొంతు నొక్కుతున్న అసమర్థత,దద్దమ్మ ప్రభుత్వ మని మండిపడ్డారు. రాష్ట్రంలో పాలన చేతకాక, ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వమని దుయ్యబట్టారు.ప్రశ్నించే గొంతుకలను నొక్కాలని ఈ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు.ప్రజల సమస్యలపై పోరాడితే అసహనంతో కాంగ్రెస్ పార్టీ అక్రమంగా అరెస్టులు చేస్తూ బీఆర్ఎస్ గొంతు నొక్కాలన్ని ప్రయత్నిస్తోందని అన్నారు.జంట నగరాల్లో ఆర్టీసీ చార్జీలను ఒకే సారి రూ.10 పెంచి పేద, మధ్యతరగతి ప్రజల జేబులు గుల్ల చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అసమర్ధ పాలనలో నష్టాల్లో ఉన్న ఆర్టీసీని గట్టెక్కించకుండా ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ దగుల్బాజీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని,ఈ కాంగ్రెస్ పార్టీకి ప్రజాక్షేత్రంలో ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. ఆర్టీసీ చార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే దాకా బీఆర్ఎస్ పోరాటం అగదని తెలిపారు. దుర్మార్గమైన పాలనను ఎండగడుతూనే ఉంటామని ప్రభుత్వాన్ని ఎక్కడికి అక్కడ ప్రజాక్షేత్రంలో నిలదీస్తూనే ఉంటామని,ప్రశ్నిస్తూనే ఉంటామని అక్రమాలను దుర్మార్గాలను ఎండగడుతూనే ఉంటామని ఆగ్రహం వ్యక్తం చేశారు.అరెస్టు అయిన వారిలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గుమ్మడి కుమార్ ఎడ్లకాడి సూర్యం,గోల్కొండ లేవిరాజ్ నాని చంద్రశేఖర్, గౌతమ్ శేఖర్ నరేష్ శ్రీకాంత్ ఈశ్వర్,హౌస్ అరెస్ట్ అయిన వారిలో రఘు యాదవ్ జగన్ ముదిరాజ్ మహేష్ తదితరులు ఉన్నారు.

# కోలిండియాలో సింగరేణి క్రీడాకారులు పతాకాలు సాధించాలి





**ఏఐటియుసి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు భీమనాథుని సుదర్శన్**

**మందమర్రి,అక్టోబర్09(సూర్యరేఖ)** త్వరలో జరగనున్న కోలిండియా స్థాయి క్రీడ పోటీల్లో సింగరేణి క్రీడాకారులు పతకాలు సాధించాలని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు భీమనాథుని సుదర్శన్,క్రీడల గౌరవ కార్యదర్శి, సీనియర్ పిఓఎం కార్తీక్,లు అన్నారు. ఏరియా వర్క్స్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్(డబ్ల్యూపిఎస్ అండ్ జిఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 21వార్షిక క్రీడల్లో భాగంగా పట్టణంలోని స్థానిక సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం నిర్వహించిన డిపార్ట్మెంటల్ వాలీబాల్ పోటీలకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై క్రీడ పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...సింగరేణి సి ఎండి ఎన్.బలరాం ఆదేశాల మేరకు సింగరేణి ఉద్యోగులకు ప్రతి ఏటా క్రీడా పోటీలను నిర్వహించడం జరుగుతుందని క్రీడలు అందరిలో మానసిక ఉల్లాసం సానుకూలతను నింపుతాయని మంచి ఆరోగ్యం క్రమశిక్షణ టీంవర్క్ ను వికసింపజేస్తాయని అన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు కళాకారులు కోలిండియా స్థాయిలో ప్రతి సంవత్సరం ఎన్నో బహుమతులు సాధించి, సింగరేణికి పేరు ప్రఖ్యాతలు తీసుకు వస్తున్నారని అన్నారు. సీనియర్ క్రీడాకారులు సంస్థలో పని చేస్తున్న యువ ఉద్యోగులను క్రీడలకు ప్రోత్సహించాలని కోరుతూ క్రీడల్లో రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఉద్యోగి ఆరోగ్యంగా ఉన్నప్పుడే సంస్థ అభివృద్ధికి దోహదం చేసిన వారవుతారన్నారు. క్రీడల్లో రాణించి కోల్ ఇండియాలో పతకాలు సాధించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివకృష్ణ,జనరల్ కెప్టెన్ శాఖ శ్రీనివాస్,క్రీడాకారులు మైదానం ఇన్చార్జి నస్పురి తిరుపతి,తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో విచ్చలవిడిగా కొనసాగుతున్న రేషన్ అక్రమ దందా.!

**సంబంధిత మరికల్ మండల డిటికి సమాచారం అందించిన,అందుబాటులో లేనని సమాధానం..**

**ప్రతినెల రేషన్ బియ్యం ఏ గ్రామాలకు పంపిణీ సంగతి ముందుగానే పసిగట్టేస్తున్న అక్రమ రేషన్ దారులు..**

**అక్రమ రేషన్ బియ్యానికి పాల్పడిన,అధికారులు పట్టించుకోవడం లేదు..**





**నారాయణపేట,అక్టోబర్09(సూర్యరేఖ)** నారాయణపేట జిల్లా,మరికల్ మండల కేంద్రంలో గురువారం పట్టపగలు 11గంటల ప్రాంతాన గ్రామంలో వీధి వీధి తిరుగుతూ ప్రజల ఇండ్లలో అక్రమంగా రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్న సంగతి,సంబంధిత మరికల్ మండల డిటికి సమాచారం అందించిన ఫలితం శూన్యం.. మరికల్ మండల డిటి ఫోన్ ద్వార మాట్లాడుతూ ప్రస్తుతం నేను అందుబాటులో లేనని తెలిపారు. అక్రమ రేషన్ బియ్యానికి పాల్పడుతున్న వారు ద్విచక్ర వాహనాలపై తూనికల కాంట,సంచుల్లో మూసుకొని ఇల్లు ఇల్లు తిరుగుతూ...20 రూపాయలకు కిలో చొప్పున రేషన్ బియ్యం లబ్ధిదారుల నుండి కొంటున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు లబ్ధిదారులకు ప్రతి నెల ఉచిత పంపిణీ చేస్తున్న బియ్యం,అక్రమ దారులు లూటీ చేస్తూ,కాలం చెల్లించుకుంటున్నారు. అధికారుల కను సైగల్లో అక్రమ రేషన్ బియ్యం దందా కొనసాగుతుందని, గ్రామస్తుల నుండి సమాచారం.అందుకోసమే పట్టపగలు గ్రామాల్లో వీధుల్లో తిరుగుతూ అక్రమంగా రేషన్ బియ్యానికి పాల్పడుతున్నారు.

## అక్రమ నిర్మాణాలు జోరు అటువైపు చూడని మున్సిపల్ అధికారులు

**కామారెడ్డి,అక్టోబర్09(సూర్య రేఖ)** కామారెడ్డి జిల్లా జిల్లా కేంద్రం ఏర్పడినప్పటి నుంచి దినదినంగా అభివృద్ధి చెందుతుంది.దీనిని ఆసరాగా తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా కొందరు బిల్డర్లు ఇష్టానుసారంగా భవన నిర్మాణాలు చేపడుతున్నారు.బిల్డింగ్లకు జి ప్లస్ టు పర్మిషన్ మాత్రమే ఉండగా అంతకు విరుద్ధంగా నిర్మిస్తున్నారు.అంతేకాకుండా కమర్షియల్ సెంటర్లు నిర్మించాల్సి ఉంటే దానికి ప్రత్యేకమైన పర్మిషన్ తీసుకోవాల్సిన అవసరం ఉన్నప్పటికీ గృహ నిర్మాణాల పేరిట అనుమతి తీసుకొని భవనాలు నిర్మిస్తున్నారు.కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి మజీద్ దగ్గర ఒక వ్యక్తి భవన నిర్మాణానికి సెట్ బ్యాక్ లేకుండా రోడ్డును ఆక్రమించి భవన నిర్మాణాలు చేపడుతున్నారు.భవన నిర్మాణానికి సెట్ బ్యాక్ క్రింద రెండు మీటర్ల మేర స్థలాన్ని విడిచి నిర్మించాలని నిబంధన ఉన్నప్పటికీ వాటిని ఉల్లంఘించి నిర్మిస్తున్న అధికారులు మాత్రం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గాయత్రి నగర్ శివాలయం నిర్మిస్తున్నారు.మందిరం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ఏర్పాటు చేశారు.కొందరు రోడ్డుకు ముందు జరుగుతున్నారని చెప్పి మున్సిపల్ అధికారులతో కట్టిన కాంపౌండ్ వాల్ ను కూల్చివేయించారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకొని ప్రజలకు న్యాయం చేయాలని కామారెడ్డి ప్రజలు కోరుతున్నారు.

## హైకోర్టు కీలక తీర్పు బీసీల హక్కులపై కాంగ్రెస్ మోసం.!

**రామాయంపేటలో రాగి రాములు మండిపాటు..**



**రామాయంపేట,అక్టోబర్09(సూర్యరేఖ)** రాష్ట్ర రాజకీయ వర్గాల్లో కలకలం రేపిన హైకోర్టు తీర్పు నేపథ్యంగా,బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ మోసం చేసిందని భారతీయ జనతా పార్టీ తీవ్రస్థాయిలో మండిపడింది.మెదక్ జిల్లా రామాయంపేటలో మీడియా సమావేశం నిర్వహించిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు మాట్లాడుతూ... "హైకోర్టు జీవో నంబర్ 9ను కొట్టివేయడం బీసీల హక్కులపై తీవ్ర దెబ్బ"అని పేర్కొన్నారు.కాంగ్రెస్ అంటే మోసం అనే నానుడి మళ్లీ నిజమైంది.బీసీలను నమ్మబలికి హక్కులు ఇవ్వకుండా పదే పదే మోసం చేస్తూ వస్తోంది. గతంలో ఇచ్చిన హామీలన్నీ గాలిలో కలిసిపోయాయి. ఇప్పుడు మళ్లీ అదే నాటకం పునరావృతమవుతోంది"అని ఆగ్రహం వ్యక్తం చేశారు.కామారెడ్డిలో ఘనంగా విడుదల చేసిన బీసీ డిక్లరేషన్ ఒక్క పేజీ కూడా అమలు కాలేదని ఆయన విమర్శించారు."బీసీలకు రావాల్సిన రిజర్వేషన్, న్యాయం హైకోర్టు గదుల్లోనే తాకట్టు పెట్టేశారు.ఇది బీసీల ఆత్మగౌరవానికి గాయమే" అన్నారు.రాగి రాములు కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని వ్యాఖ్యానిస్తూ,"బీసీలకు నిజమైన రక్షణ కల్పించగల ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ మాత్రమే.బీసీల హక్కుల కోసం మా పోరాటం నిరంతరం కొనసాగుతుంది"అని స్పష్టం చేశారు.

## మీ(ఈ)సేవ కేంద్రం సిబ్బందిపై చర్యలు చేపట్టాలి..

**తహశీల్దార్ కు వినతి పత్రం సమర్పించిన పట్టణ అఖిల పక్ష పార్టీ నాయకులు**



**మందమర్రి,అక్టోబర్ 09(సూర్యరేఖ)** మందమర్రి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గల మీ (ఈ) సేవ కేంద్రం సిబ్బంది మీ సేవలో దరఖాస్తు చేసుకుందుకు వచ్చే ప్రజలను అగౌరవపరుస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారిపై తక్షణమే చర్యలు చేపట్టాలని పట్టణ అఖిల పక్ష పార్టీ నాయకులు,యువనాయకులు,సోషల్ మీడియా వారియర్స్ ఆధ్వర్యంలో మండల తహసిల్దార్ సతీష్ కుమార్ శర్మకు గురువారం వినతి పత్రాన్ని సమర్పించారు.పట్టణ ప్రాంత ప్రజలకు పౌర సౌకర్యాల సేవల నిమిత్తం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీ సేవ కేంద్రానికి వస్తున్న విద్యార్థులను,యువకులను,వృద్ధులను, అవహేళన చేస్తూ,ప్రజలతో దురుసుగా ప్రవర్తిస్తూ, ప్రజలకు తెలియని విషయాలు సలహా సూచనలు ఇవ్వకపోక వారినీ బెదిరిస్తూ,సమయపాలన పాటించకుండా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న మీ సేవ మేనేజర్ ఉపేందర్,ఇంచార్జి జనార్ధన్ లపై తక్షణమే చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. వెంటనే స్పందించిన మండల తహశీల్దార్ సతీష్ కుమార్ శర్మ మీ సేవా కేంద్రాన్ని సందర్శించి ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేసి,తగు విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అఖిల పక్ష పార్టీ నాయకులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణ అఖిల పక్ష పార్టీ నాయకులు,యువ నాయకులు,ఆకారం రమేష్,బండి శంకర్,దినేష్, శేఖర్,బండారి రాజేశం,కత్తి రమేష్,మాయ రమేష్, సిపెల్లి సాగర్ రాయబారపు కిరణ్ చిప్పకుర్తి శశిధర్, ఎండి.జవీద్ ఖాన్,క్రాంతి రాజు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగిస్తున్న కాంగ్రెస్





**ప్రజలు అన్ని గమనిస్తున్నారు..**
**మూల్యం చెల్లించుకోకతప్పదు..**
**మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సీతారాం దూళిపాల**

**మణికొండ,అక్టోబర్09(సూర్యరేఖ)** కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో నిరంకుశ పాలనను సాగిస్తూ 6 గ్యారంటీలను పక్కన పెట్టిందని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సీతారాం దూళిపాల అన్నారు.భారత రాష్ట్ర సమితి రాష్ట్ర పార్టీ ఇచ్చిన ఛలో బస్ భవన్ పిలుపుమేరకు మణికొండ మునిసిపాలిటీ నుండి బయలు దేరి పుప్పాలగూడలో మాజీ మంత్రి హరీష్ రావును కలిసి మెహదీపట్నం వద్ద బస్సు టిక్కెట్లు తీసుకుని మరీ బస్ భవన్ కు తరలి వెళ్లారు.ఈ సందర్భంగా సీతారాం ధూళిపాళ మాట్లాడుతూ...ప్రస్తుత తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందన్నారు.ఆరు గ్యారంటీలు ఆరబెట్టి, 420 హామీలు తుంగలో త్రొక్కి ఇంట్లోని ఆడవారికేమో అందలమెక్కించి ఫ్రీ బస్ అని మగవాళ్ళకు డబుల్ ఛార్జీలను ముక్కు పిండి వసూలు చేయడం బాధకరమన్నారు.కాగా బస్సు ఛార్జీలను రౌండ్ ఫిగర్ పేరిట ఒకసారి,టోల్ గేట్ గురించి ఒకసారి,విద్యార్థుల బస్సు పాసుల రెట్లు పెంచి పండుగల సందర్భంగా రెట్టింపు చేస్తూ ఎలెక్ట్రిక్ బస్సుల పేరిట మరో మారు ఛార్జీలను పెంచుతూ ప్రజాస్వామ్య వ్యవస్తకే గొడ్డలి పెట్టుగా వ్యవహరిస్తున్నారు.అందుకు సంబంధించిన విషయమై సంబంధిత అధికారులను కలసి వినతి పత్రం ఇవ్వడానికి పార్టీ రాష్ట శాసన సభ్యులు శాసన మండలి సభ్యులు,కార్పొరేటర్లు,సీనియర్ నాయకులు బయలు దెరకుండా హౌస్ అరెస్ట్ ల పేరిట ఇంటి నుంచి బయటకు రాకుండా అడ్డుకోవడం పోలీసు యంత్రాంగం చేసిన ప్రయత్నమని మండిపడ్డారు.కాగా ప్రజాస్వామ్యం మొత్తంగా కాగడా పెట్టి వెతికినా కానరాని పరిస్థితిలో కొంతమందినీ పోలీసుస్టేషన్ లలో నిర్బంధించి కొంతమందినీ వెళ్ళడానికి అనుమతించకపోవడం ఏంటని ప్రశ్నించారు. అయినా పార్టీ నాయకులు బస్ భవన్‌కు తరలివెళ్లి మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డిని కలవడం జరిగిందన్నారు.అనంతరం పార్టీ నాయకులు కార్యకర్తలను పోలీసులు దౌర్జన్యంగా అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గుట్టమీది నరేందర్,అందే లక్ష్మణ్ రావు,సంగం శ్రీకాంత్ శ్రీశైలం,భాను చందర్ సుమనళిని మహేందర్ సింగదాసరి శ్రీబాబు రాజేంద్రప్రసాద్ విజయలక్ష్మి బాబురావు యాలాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కలిసికట్టుగా కేటీఆర్, హరీష్




**హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫి కేషన్ జారీచేసిన నేపథ్యంలో హైదరాబాద్‌లో రాజకీయం వేడిక్కింది. జూబ్లీ హిల్స్ నియోజక వర్గానికి ఉప ఎన్నికలో సిట్టింగ్ సీటును గెలుపొందడం బీఆర్ఎస్ పార్టీకి కీలకంగా మార డంతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు రంగంలోకి దిగారు. గతంలో ఉప ఎన్నికలు, జీహెచ్ఎంసీ వంటి ఎన్నికల్లో ఎవరికి వారుగా బాధ్యత నిర్వర్తించిన కేటీఆర్, హరీశ్‌రావు ప్రస్తుతం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కలిసి కట్టుగా వ్యూహరచన చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ తిరిగి పుంజుకోవడంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపు కీలకంగా మారనుంద ని భావిస్తున్న నేపథ్యంలో కేటీఆర్, హరీశ్‌రావు ఈ ఎన్నికపై ప్రత్యేకంగా దృష్టి సారించారుఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ సమన్వయంతో ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పార్టీ వ్యవహారాలను చక్కబెడుతూ, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తు న్నారు. సిట్టింగ్ స్థానాన్ని ఎలాగైనా చేజిక్కించుకు నేందుకు వ్యూహాలకు పదును పెడుతున్నారు. జూబ్లీహిల్స్‌లో మళ్లీ గులాబీ జెండాను ఎగురవేసేందుకు పకడ్బందీగా ప్లాన్ చేస్తున్నారు.అయితే అధికారం కోల్పోయాక పార్టీలో చోటు చేసుకున్న పరిణామాలు, క్యాడర్‌లో నెలకొన్న నైరాశ్యాన్ని పటా పంచలు చేసేందుకు వారు కలిసి ముందడుగు వేస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక బాధ్యతను సమష్టిగా పంచుకోవడం ద్వారా అటు కార్యకర్తలకు, ఇటు ప్రజలకు స్పష్టమైన సంకేతాలిచ్చేలా కేటీఆర్, హరీశ్‌రావు ప్లాన్ చేస్తున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయా క బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పెద్దగా ప్రజాక్షేత్రంలోకి రాలేదు. అయినప్పటికీ ఒకవైపు కేటీఆర్, మరోవైపు హరీష్‌రావు పార్టీ వ్యవహారాలను, క్యాడర్‌ను సమన్వయం చేస్తూ ముందుకు సాగుతు న్నారు. అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో మరోసారి బీఆర్ఎస్ బలాన్ని చూపించాల్సిన నేపథ్యంలో కేటీఆర్, హరీష్‌రావు కలిసి కట్టుగా వ్యూహ రచన చేస్తున్నారు.ఈ ఎన్నికల్లో స్పష్టమైన విజయం సాధించడంపై దృష్టి సారించారు. ఇప్పటివరకు వేర్వేరుగా పలు ఉప ఎన్నికలను నిర్వహించిన అనుభవం కేటీఆర్, హరీష్‌రావులకు ఉంది. ప్రస్తుతం జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఎంతో ప్రతిష్టాత్మకం కావడంతో బీఆర్ఎస్‌ను గెలిపించే బాధ్యతను ఇరువురు భుజాలకెత్తుకున్నారు. బీఆర్ఎస్‌లో ట్రబుల్ షూటర్‌గా పేరున్న హరీష్‌రావు గతంలో ఇంచార్జీగా ఉండి ముందుకు నడిపించిన హుజురాబాద్, దుబ్బాక వంటి ఉప ఎన్నికల్లో పరాజయం పాలైనప్పటికీ, నారాయణఖేడ్, పాలేరు ఉప ఎన్నికల్లో ఘన విజయం సాధించేలా చేశారు.అర్బన్ ఓటర్లను అత్యంత ప్రభావితం చేసిన కేటీఆర్, గతంలో జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించేందుకు కృషి చేశారు. దీంతోపాటు నాగార్జునసాగర్ ఉప ఎన్నికల్లోనూ కేటీఆరే బాధ్యత వహించి, అక్కడ పార్టీ గెలవడంలో కీలక పాత్ర పోషించారు. గతంలో ఉప ఎన్నికలు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సమర్థవంతంగా విజయ తీరాలకు చేర్చిన అనుభవం ఉన్న కేటీఆర్, హరీష్‌రావు మొదటిసారి ఒక ఉప ఎన్నికలకు కలిసి బాధ్యత వహిస్తున్నారు.

రాష్ట్రంలో ప్రభుత్వం మారిన కొద్దీ కాలానికే కంటోన్మెంట్‌లో ఉప ఎన్నిక రావడంతో అక్కడ అధికార కాంగ్రెస్ పార్టీకి కలిసి వచ్చింది. అక్కడ కాంగ్రెస్ గెలవడానికి అన్ని విధాలా అనుకూలించింది. కానీ ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావొస్తుంది. రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ ప్రచారం చేస్తున్నది. ఈ రెండేళ్లు కాంగ్రెస్ పాలనకు రెఫరెండంగా చూపించడం ద్వారా ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను గెలవడంపై బీఆర్ఎస్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. వాస్తవానికి 2014లో టీడీపీ నుంచి గెలుపొందిన మాగంటి గోపీనాథ్ ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచారు. అయితే ఇప్పటికే రెండుసార్లు జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని కైవసం చేసుకున్న బీఆర్ఎస్ ఈ ఉప ఎన్నికల్లో కూడా గెలిచి హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసుకోవాలని యోచిస్తుంది. దీంతోపాటు ఉప ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఎదుర్కోవడంతోపాటు బీఆర్ఎస్ తిరిగి పుంజుకున్నదని రాష్ట్రవ్యాప్తంగా గట్టి సంకేతాలు పంపాలని చూస్తుందిజూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపొందడాన్ని కేవలం ఒక నియోజకవర్గానికి మాత్రమే పరిమితం చేయకూడదని బీఆర్ఎస్ భావిస్తోంది. అధికార కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను బహిర్గతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా ఇక్కడ గెలిచేందుకు ఇప్పటికే క్షేత్రస్థాయిలో పట్టు బిగించడానికి, బూత్ నుండి డివిజన్ స్థాయి వరకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కీలక నాయకులను ఇన్‌చార్జ్‌లుగా నియమించిందిఈ విజయంతో క్యాడర్‌లో మనోధైర్యం నింపడంతోపాటు ప్రజల్లో విశ్వాసం కల్పించాలని యోచిస్తున్నది. తద్వారా త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికలు, భవిష్యత్‌లో జరిగే అన్ని ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ గెలుపొందడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నది. అయితే అధికారం కోల్పోగానే బీఆర్ఎస్ నుంచి గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి ఫిరాయించారు. ఈ నేపథ్యంలో ఉప ఎన్నికల్లో గెలుపొందడం బీఆర్ఎస్‌కు ఎంతో అనివార్యంగా మారింది.జూబ్లీహిల్స్ చేజారిపోతే అంతర్గతంగా చీలికలు రావడంతోపాటు మరి కొందరు ఎమ్మెల్యేలు ఫిరాయించేందుకు ఆస్కారం ఉంటుందని భావిస్తున్నారు. దీంతోపాటు ఇటీవలి కాలంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రి హరీష్‌రావు, మాజీ ఎంపీ సంతోష్‌రావులపై తీవ్రంగా ఆరోపణలు చేసి పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారు. ఈ పరిణామంతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో కొంత గందరగోళం నెలకొన్నది.పార్టీపై క్యాడర్‌లో ఉన్న విశ్వాసం సన్నగిల్లేందుకు అవకాశం కల్పించినట్టు అయింది. అయినప్పటికీ పార్టీ అధిష్ఠానం మాజీ మంత్రి హరీష్‌రావు పక్షానే నిలబడింది. పార్టీ కంటే ఎవరూ ముఖ్యం కాదనే సంకేతం ఇచ్చేందుకు కేసీఆర్ కూతురును సైతం పార్టీ నుంచి బహిష్కరించారు. దీంతో బీఆర్ఎస్ క్యాడర్‌కు స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేశారు. ఇలాంటి పరిణామాల మధ్య ప్రస్తుత జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక గెలవాల్సిన అనివార్యత బీఆర్ఎస్ పార్టీకి ఏర్పడింది.

# వ్యూహాత్మకంగా మజ్లీస్ పార్టీ

**హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికలకు సమాయత్తమవుతున్నాయి. అయితే హైదరాబాద్ లో పట్టున్న ఎంఐఎం పార్టీ మాత్రం ఇంత వరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అసలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎంఐఎం పోటీ చేస్తుందా? లేదా? అన్నది కూడా అనుమానంగానే ఉంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎంఐఎం కీలక భూమిక పోషించనుంది. నియోజకవర్గంలో ముస్లిం ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. గతంలోనూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పోటీ చేసింది. మిగిలిన పార్టీల కంటే అత్యధిక ఓట్లను ఎంఐఎం అభ్యర్థి సాధించింది. గతంలోనూ ఎంఐఎం తరుపున నవీన్ యాదవ్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి అత్యధిక ఓట్లను సాధించారు. గెలవకపోయినా అత్యధిక ఓట్లను సాధించారు. గత ఎన్నికల్లో జూబ్లీ హిల్స్ నియోజకవర్గం నుంచి మాజీ క్రికెటర్ అజారుద్దీన్ కాంగ్రెస్ నుంచి పోటీ చేశారు. ఆయన మాగంటి గోపీనాథ్ చేతిలో ఓటమి పాలయ్యారు. అయితే ఈసారి మాత్రం అజారుద్దీన్ పేరు కాంగ్రెస్ పార్టీలో వినిపించడం లేదు. కేవలం మూడు పేర్లను మాత్రమే అధినాయకత్వానికి పంపింది. అందులో నవీన్ యాదవ్ పేరు మొదట ఉంది. గతంలో నవీన్ యాదవ్ ఎంఐఎం పార్టీలో ఉన్నారు. శ్రీశైలం యాదవ్ కుమారుడైన నవీన్ యాదవ్ కు జూబ్లీహిల్స్ బస్తీలో మంచి పట్టు ఉండటం కూడా కలసి వస్తుందని భావిస్తుంది. అయితే ముస్లిం ఓటర్లు ఎక్కువగా ఉండటంతో ఎంఐఎం తన పార్టీ అభ్యర్థిని నిలబెడుతుందా? లేక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతు పలుకుతుందా? అన్నది మాత్రం తెలియాల్సి ఉంది.. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీతో ఎంఐఎం మిత్రుడిగా వ్యవహరిస్తుంది. గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చినప్పటి నాటి నుంచి ఎంఐఎం వైఖరి మారింది. అప్పటి వరకూ అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కు మద్దతుగా ఉన్న ఎంఐఎం తర్వాత కాంగ్రెస్ కు అనధికార మిత్రపక్షంగా తయారైంది.

## దాదాపుగా దీపక్ రెడ్డి పేరు ఖరారు ?

**హైదరాబాద్ :** తెలంగాణలో జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై అన్ని పార్టీలు గట్టిగా ఫోకస్ పెట్టాయి. అందుకు తగ్గట్టుగానే పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. ముందే అభ్యర్థిని ప్రకటించిన బీఆర్ఎస్ ప్రచారంలో దూసుకెళ్తోంది. ఈ ఎన్నికల వ్యూహం కోసం ప్రత్యేకంగా వార్ రూంఏర్పాటు చేసింది. దీని కేంద్రంగానే ప్రచారాన్ని మరింత పరుగులు పెట్టించనున్నారు.కాంగ్రెస్ కూడా బుధవారం రాత్రి తన అభ్యర్థిని ఫైనల్ చేసింది. గతంలో పోటీ చేసి ఓడిపోయిన నవీన్ యాదవ్‌ను బరిలోకి దింపుతున్నట్టు వెల్లడించింది. లోకల్‌గా పట్టున్న ఆయనైతే సీటు గెలవడం సులభం అవుతుందని ఎంత మంది పోటీలో ఉన్నా నవీన్ యాదవ్‌వైపు ముఖ్యమంత్రి, మిగతా పార్టీ నాయకులు నిలబడ్డారు. బీసీ నినాదంతో వెళ్తున్న కాంగ్రెస్ దీన్ని అస్త్రంగా మలుచుకోనుంది. ఇప్పుడు బీజేపీలో అభ్యర్థి ఎవరనే ఆసక్తి నెలకొంది. రేపటికల్లా అభ్యర్థిని ఫైనల్ చేయనున్నట్టు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. బీజేపీ తెలంగాణ పార్టీ పగ్గాలు అందుకున్న రాంచంద్రర్‌రావు ఎదుర్కొంటున్న తొలి ఎన్నిక ఇదే కావడంతో, ఆయన వ్యూహాలు ఎలా ఉంటాయి, అభ్యర్థి ఎంపికలో ఏం చేస్తారనే చర్చ జోరుగా సాగుతోంది. ఇప్పటికే జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థి ఎంపికకు ప్రత్యేక కమిటీ వేశారు. ధర్మారావు, పోతుగంటి రాములు, అంజనేయులు చాలా మంది పేర్లు పరిశీలించారు. వీళ్లు వివిధ మార్గాల్లో పార్టీ వర్గాలతో మాట్లాడారు. పార్టీ శ్రేణుల అభిప్రాయాలు తెలుసుకున్నారు.దీనిపై సమగ్ర నివేదిక రాష్ట్ర అధ్యక్షుడికి ఇచ్చారు. వీరు పంపించిన పేర్లను పరిశీలించిన తర్వాత వారిలో షార్ట్ లిస్ట్ చేసి ముగ్గురు పేర్లను అధిష్ఠానానికి పంపిస్తారు. దీన్ని ఇవాళ రాష్ట్ర బీజేపీ కీలక నేతలు పరిశీలించి ఈ లిస్ట్‌ను ఢిల్లీ పంపిస్తారు. శుక్రవారం వాటిని పరిశీలించనున్న అధిష్ఠానం ఒకరి పేరును ఫైనల్ చేస్తుంది. కమిటీ పేర్కొన్న లిస్టులో చాలా పేర్లు ఉన్నప్పటికీ టాప్‌లో మాత్రం లంకల దీపక్ రెడ్డి, వీరపనేని పద్మ, కీర్తిరెడ్డి ఉన్నారని పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. వీరిలో దీపక్ రెడ్డి గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. అందుకే ఆయనకే ఈసారి కూడా మరో ఛాన్స్ ఇస్తారని ఆయన వర్గం గట్టిగానే ప్రచారం చేస్తోంది. రాష్ట్ర, ఢిల్లీ స్థాయిలో కూడా కీలక నేతలతో ఉన్న సంబంధాలు ఆయనకు అక్కరకు వస్తాయని అంటున్నారు. మహిళకు ఇవ్వాలనుకుంటే మాత్రం కీర్తిరెడ్డికి లక్కీ ఛాన్స్ ఉంటుందని చెబుతున్నారు

## పకడ్బందీగా స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల స్వీకరణ

**స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ ప్రక్రియను పరిశీలించిన జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్**



**జగిత్యాల :** స్థానిక సంస్థల ఎన్నికలకు గురువారం నుండి జగిత్యాల జిల్లాలో నామినేషన్ జిల్లా ప్రక్రియ ప్రారంభం కాగా మొదటి విడతగా 10 జెడ్పిటిసి, 108 ఎంపీటీసీ స్థానాలకు ఎలక్షన్లు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని 10 జడ్పిటిసి స్థానాలకు, 108 ఎంపిటిసి స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ గురువారం కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ నామినేషన్ల ప్రక్రియ జరుగుతున్న తీరును కోరుట్ల, మెట్పల్లి,ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా నామినేషన్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్య ప్రసాద్ తో మాట్లాడుతూ జిల్లాలో 10 జడ్పిటిసి, 108 ఎంపీటీసీ స్థానాలకు మొదటి విడత ఎన్నికలు నిర్వహించేందుకు గురువారం నుండి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. మూడు రోజులపాటు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. చివరి రోజు ఎక్కువ మంది అభ్యర్థులు నామినేషన్లు వేసే అవకాశం ఉన్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. చివరి వరకు వేచి చూడకుండా ముందుగానే నామినేషన్లు వేసుకోవాలని అభ్యర్థులను కోరారు.చివరి సమయంలో ఏదైనా పొరపాటు జరిగితే నామినేషన్ తిరస్కరణకు గురవుతుందని అందుకని అభ్యర్థులు ముందుగా జాగ్రత్త వహించాలన్నారు.ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని అభ్యర్థులకు ఏమైనా సలహాలు, సందేహాలు ఉంటే అక్కడ సంప్రదించాలని సూచించారు. అక్టోబర్ 9వ తేదీ నుండి 11వ తేది వరకు ఉదయం 10:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, మొదటి విడత ఎన్నికలు అక్టోబర్ 23వ తేది న పోలింగ్, నవంబర్ 11 న కౌంటింగ్ ఉంటుందని తెలిపారు.ఈ పరిశీలనలో కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజా గౌడ్, కోరుట్ల, మెట్పల్లి ఆర్డీవో లు జీవాకర్ రెడ్డి,శ్రీనివాస్, ఎంపీడీఓ లు ఎమ్మార్వో లు సంబంధిత అధికారులు ఉన్నారు..

## వృద్ధుల సంక్షేమ కమిషన్ ఏర్పాటు చేయాలి

**సీనియర్ సిటిజెన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్**



**జగిత్యాల :** వృద్ధుల సంరక్షణ, సంక్షేమము, హక్కుల పరిరక్షణ కోసం వృద్ధుల సంక్షేమ కమిషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ అల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. గురువారం జిల్లా కేంద్రం లోని సీనియర్ సిటిజెన్స్ కార్యాలయంలో విలేఖరు లతో ఆయన మాట్లాడారు. నిరా ధరణ కు గురవుతున్న వృద్ధుల హక్కుల పరిరక్షణ, పునరావసం, భద్రతకు, సమాజ హితానికి వారి నైపుణ్యాల ను ఉపయోగించుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వృద్ధుల కమిషన్ ఏర్పాటు చేస్తేనే వృద్ధులకు న్యాయం జరుగుతుందన్నారు. కేరళ రాష్టం లో అక్కడి ముఖ్యమంత్రి పినరయి విజయన్ వృద్ధుల కమిషన్ ఏర్పాటు కు నిర్ణయం తీసుకోవడం పట్ల తమ అసోసియేషన్ తరపున హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశం లో సీనియర్ సిటిజెన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరీశెట్టి విశ్వనాతం, కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు,ఉపాధ్యక్షులు పి. హన్మంత్ రెడ్డి, మానాల కిషన్, దిండిగాల విఠల్, కే. గంగాధర్, దుబ్బేశం, చంద్రమౌళి,కరుణ పాల్గొన్నారు.


# బిజినెస్

## ఈ ఏడాది కొత్తగా 500 సర్వీస్ వర్క్‌షాప్‌ల ఏర్పాటు




దేశీయ అతిపెద్ద ప్యాసింజర్ వాహనాల తయారీ సంస్థ మారుతీ సుజుకి భారీగా సర్వీస్ వర్క్‌షాప్‌లను విస్తరించాలని నిర్ణయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 500 సర్వీస్ వర్క్‌షాప్‌లను ప్రారంభిస్తామని తెలిపింది. మారుతీ సుజుకి తన 5,000వ అరీనా సర్వీస్ టచ్‌పాయింట్‌ను ఏర్పాటు చేసిన సందర్భంగా ఈ ప్రకటన చేసింది. భవిష్యత్తులో కూడా మా నెట్‌వర్క్‌ను నిరంతరం విస్తరించాలనే ప్రణాళిక ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో అరీనా, నెక్సా ఛానెళ్ల క్రింద 460 సర్వీస్ టచ్‌పాయింట్‌లను ప్రారంభించాము. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మా నెట్‌వర్క్‌కు మొత్తం 500 సర్వీస్ వర్క్‌షాప్‌లను యాడ్ చేయాలని భావిస్తున్నామని మారుతీ సుజుకి ఎండీ, సీఈఓ హిసాషి టకేయుచి వెల్లడించారు. కొత్త టచ్‌పాయింట్‌లు అందుబాటులోకి రావడం ద్వారా కంపెనీ సర్వీస్ నెట్‌వర్క్ ఇప్పుడు 5,640కు పెరుగుతాయి. ఇవి దేశవ్యాప్తంగా 2,818 నగరాలను కవర్ చేస్తాయని కంపెనీ పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మొత్తం 2.7 కోట్లకు పైగా వాహనాలకు సర్వీస్ అందించిందని, ఒక ఆర్థిక సంవత్సరాంలో ఇప్పటివరకు ఇదే అత్యధికమని మారుతీ సుజుకి వెల్లడించింది.

## ఏఐ ద్వారా స్కామ్‌లకు అడ్డుకట్ట



దేశీయ ప్రైవేట్ రంగ టెలికాం కంపెనీ వొడాఫోన్ ఐడియా స్పామ్, స్కామ్ కాల్స్, మోసపూరిత మేసేజ్‌లకు అడ్డుకట్ట వేసేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. వినియోగదారులను స్కామ్‌ల నుంచి రక్షించేందుకు 'వీఐ ప్రొటెక్ట్' పేరుతో సరికొత్త ఏఐ-ఆధారిత సొల్యూషన్‌ను ప్రారంభించింది. ఇందులో ఏఐ ఆధారిత వాయిస్ స్పామ్ డిటెక్షన్ సిస్టమ్, సైబర్ డిఫెన్స్ అండ్ ఇన్సిడెంట్ రెస్పాన్స్ సిస్టమ్ అనే రెండు కీలకమైన పరిష్కారాలు ఉన్నాయి. ఇవి వినియోగదారులకు రియల్-టైమ్‌లో రక్షణ అందిస్తాయి. అంతేకాకుండా వీఐ నెట్‌వర్క్, వ్యాపార కార్యకలాపాలను సైబర్ దాడుల నుంచి రక్షిస్తుంది.వీఐ వాయిస్ స్పామ్ డిటెక్షన్ వ్యవస్థ కస్టమర్ల ఫీడ్‌బ్యాక్, వెబ్ క్రాలర్, ఏఐ మోడళ్లను ఉపయోగించి స్కామ్, స్పామ్ కాల్స్‌ను గుర్తిస్తుంది. ఏవైనా అనుమానాస్పద నంబర్ నుంచి కాల్ వచ్చిన సమయంలో స్క్రీన్‌పై సస్పెక్టెడ్ స్పామ్ వార్నింగ్ కనిపిస్తుంది. ఈ ఫీచర్ పూర్తిగా వీఐ నెట్‌వర్క్ పరిధిలో ఉంటుంది. ఇది మోసపూరిత మెసేజ్‌లను కూడా గుర్తిస్తుంది. అంతర్జాతీయ కాల్స్ కోసం ఇంటర్నేషనల్ కాలింగ్ అని డిస్‌ప్లే చూపిస్తుంది. దీనివల్ల అంతర్జాతీయ నంబర్ల నుంచి జరిగే మోసాలను గుర్తించవచ్చు. ఇక, సైబర్ డిఫెన్స్ అండ్ ఇన్సిడెంట్ రెస్పాన్స్ సిస్టమ్ ద్వారా ఏజెంటిక్, జనరేటివ్ ఏఐ మోడల్స్‌ను ఉపయోగించి సైబర్ మోసాలు, బెదిరింపులను గుర్తించి, నిలువరిస్తుంది.

# వారికి నిమిషాల్లోనే రూ.5 కోట్ల వరకు లోన్




భారత్‌లోని డిజిటలీకరణ అనేది ఆర్థిక రంగం రూపు రేఖలను మార్చేసిందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి అన్నారు. దీంతో చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కొన్ని నిమిషాల వ్యవధిలోనే లోన్స్ అందుతున్నాయని గుర్తు చేశారు. డిజిటల్ వ్యవస్థలు అందుబాటులోకి వచ్చిన క్రమంలో 25 నిమిషాల్లోనే ఎస్‌ఎంఈలకు రూ.5 కోట్ల వరకు రుణాల జారీకి ఆమోదం లభిస్తోందని తెలిపారు. ఇది గర్వించదగిన విషయమని పేర్కొన్నారు. ఈ మేరకు ముంబైలో జరుగుతోన్న గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025లో కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఎస్‌బీఐ తీసుకుంటున్న నిర్ణయాలను వెల్లడించారు. డిజిటలీకరణ కారణంగా ఇన్సూరెన్స్ వంటి ఫైనాన్షియల్ ఉత్పత్తుల వినియగోం భారీగా పెరిగిందన్నారు ఎస్‌బీఐ ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి . అలాగే యూపీఐ ద్వారా అందించే రుణాల విషయంలో బ్యాంకులు తమ కలెక్షన్ సామర్థ్యాలను పెంచుకోవాల్సి ఉందన్నారు. ఒక్క స్టేట్ బ్యాంక్ ద్వారానే 15 కోట్ల జన్‌ధన్ జీరో బ్యాలెన్స్ అకౌంట్లు తెరిచినట్లు చెప్పారు. అందులో 99.5 శాతం అకౌంట్లలో నగదు నిల్వలు ఉన్నట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం సగటున రూ.4 వేల చొప్పున ఒక్క జన్‌ధన్ ఖాతాలో బ్యాలెన్స్ ఉందన్నారు. ఈ అకౌంట్ల ద్వారా రోజుకు 35 లక్షలకు పైగా ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే ఈ అకౌంట్లలో 56 శాతం మహిళలవే ఉన్నట్లు పేర్కొన్నారు. చాలా మంది జీరో బ్యాలెన్స్ అకౌంట్లతో మొదలై ఇప్పుడు కరెంట్ ఖాతాలు తెరిచే స్థాయికి చేరుకున్నట్లు శ్రీనివాసులు శెట్టి పేర్కొన్నారు. అంతగా బ్యాంకింగ్ వ్యవస్థలు ప్రజల నిత్య జీవితాల్లో భాగమైపోయాయన్నారు. త్వరలోనే తమ ఎస్‌బీఐ యోనో యాప్‌ను అప్‌గ్రేడ్ చేస్తామని వివరించారు. ఇందు కోసం 12 ఫిన్‌టెక్ కంపెనీలతో కలిసి పని చేస్తున్నామని గుర్తు చేశారు. మొబైల్ బ్యాంకింగ్ మాత్రమే కాకుండా మరిన్ని సేవలను అతి త్వరాలోనే అందుబాటులోకి తీసుకొస్తున్నామని ఈ సందర్భంగా వెల్లడించారు. యోనో యాప్ ద్వారా కొత్త కస్టమర్లను చేర్చుకోవడం ఒకప్పుడు గంటకు పైగా సమయం పట్టేదని కానీ, ఇప్పుడు 15 నిమిషాల్లోనే పూర్తవుతున్నట్లు తెలిపారు. కేవైసీ రూల్స్ మరింత సులభతరం చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా అభిప్రాయం వెల్లడించారు. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వంతో పాటుగా ఆర్‌బీఐ వంటి నియంత్రణ సంస్థలను స్టేట్ బ్యాంక్ సంప్రదిస్తున్నట్లు వెల్లడించారు.

# టాటా గ్రూప్‌లో కొలిక్కి వచ్చిన కీలక వివాదం




ప్రముఖ పారిశ్రామిక దిగ్గజం టాటా గ్రూప్‌లో గత కొంతకాలంగా నెలకొన్న అంతర్గత విభేదాలు, షాపూర్జీ పల్లోంజీ గ్రూప్‌తో ఉన్న వాటా వివాదం త్వరలోనే ఓ కొలిక్కి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి.గ్రూప్‌లో ప్రధాన వాటాదారు అయిన టాటా సన్స్‌లో పాలనాపరమైన అంశాలు, బోర్డు నియామకాల విషయంలో ట్రస్టీల మధ్య తీవ్ర విభేదాలు తలెత్తడంతో, కేంద్ర ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించేందుకు జోక్యం చేసుకుంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ సమక్షంలో జరిగిన కీలక సమావేశంలో ఈ వివాదాలపై చర్చలు జరిగాయి.ఈ సంక్లిష్ట సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వ పెద్దలు నేరుగా రంగంలోకి దిగడం టాటా గ్రూప్ ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. టాటా సన్స్‌లో కీలక వాటా (సుమారు 18.37%) కలిగిన షాపూర్జీ పల్లోంజీ గ్రూప్, లిక్విడిటీని అన్‌లాక్ చేసుకోవడం కోసం కంపెనీని పబ్లిక్‌గా లిస్టింగ్ చేయాలని చాలా కాలంగా డిమాండ్ చేస్తోంది. అయితే, టాటా ట్రస్ట్‌లు (66% వాటా) దీనిని వ్యతిరేకిస్తున్నా యి. ఈ ఆర్థిక, వ్యూహాత్మక వివాదంతో పాటు, దివంగత రతన్ టాటా మరణం తర్వాత టాటా ట్రస్ట్‌లు మరియు టాటా సన్స్‌లో డైరెక్టర్ల నియామకం, పాలనపై ట్రస్టీల మధ్య ఏర్పడిన రెండు వర్గాల అంతర్గత పోరు సంక్షోభాన్ని మరింత పెంచింది. ఈ నేపథ్యంలోనే, దేశ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకమైన టాటా గ్రూప్‌లో స్థిరత్వం దెబ్బతినకుండా ఉండేందుకు అమిత్ షా, నిర్మల సీతారామన్ చొరవ తీసుకున్నారు. ఇటీవల జరిగిన ఈ ఉన్నత స్థాయి సమావేశంలో, రెండు వర్గాలు తమ విభేదాలను పక్కన పెట్టి, 'టాటా విధానం' (సంప్రదాయ సహకార నిర్ణయం)లో సామరస్యంగా పరిష్కరించుకోవాలని కేంద్ర మంత్రులు స్పష్టమైన సందేశం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ సమస్యల వలన కంపెనీ కార్యకలాపాలు దెబ్బతినకుండా చూసుకోవాలని వారు ఉద్ఘాటించారు. కేంద్రం జోక్యం మరియు రాబోయే ముఖ్యమైన ట్రస్ట్‌ల బోర్డు సమావేశాల కారణంగా, టాటా-ఎస్‌పి వాటా సమస్యకు త్వరలో రాజీ కుదిరే అవకాశం ఉంది. ఎస్పీ గ్రూప్‌కు లిక్విడిటీని అందించడానికి టాటా గ్రూప్ లేదా టాటా ట్రస్ట్‌లు ఎస్పీ వాటాలో కొంత భాగాన్ని కొనుగోలు చేసే సెటిల్‌మెంట్ దిశగా అడుగులు పడే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. దశాబ్దాల తరబడి ఉన్న కార్పొరేట్ వివాదానికి తెరపడటమే కాకుండా, గ్రూప్ భవిష్యత్తు పాలనా ప్రమాణాలకు నూతన మార్గాన్ని కూడా నిర్దేశిస్తుంది.

# స్పోర్ట్స్

# ఆసియా క్రికెట్ చరిత్రలోనే తొలి బౌలర్‌గా రషీద్ ఖాన్ రికార్డు




భారత క్రికెట్ అభిమానులకూ సుపరిచితుడు రషీద్ ఖాన్ అద్భుతమైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. అఫ్గానిస్థాన్‌కు చెందిన ఈ బౌలర్ ఆసియా క్రికెట్ చరిత్రలో సూపర్ రికార్డు సాధించాడు. ఇప్పటివరకు ఏ బౌలర్‌కు సాధ్యం కాని ఘనత అది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో తొలి ఆసియా బౌలర్‌గా నిలిచాడు. ఇంతకీ అదేంటంటే? తాజాగా బంగ్లాదేశ్‌తో అఫ్గానిస్థాన్ వన్డే సిరీస్ ఆడుతోంది. తొలి వన్డేలో అఫ్గాన్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో రషీద్ ఖాన్ మూడు వికెట్లు తీశాడు. దీంతో వన్డే ఫార్మాట్‌లో 200ం వికెట్లు తీసిన తొలి అఫ్గాన్ బౌలర్‌గా నిలిచాడు. కేవలం 115 మ్యాచుల్లోనే ఈ ఘనత సాధించాడు. అతడి తర్వాత మహ్మద్ నబీ (174 మ్యాచుల్లో 176 వికెట్లు) ఉన్నాడు. ఆసియా క్రికెట్ చరిత్రలో ఇప్పటివరకూ ఎవరూ నమోదుచేయని ఓ ఘనతను రషీద్ సాధించాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో అంటే వన్డేలు, టీ20లు. ఈ ఫార్మాట్లలో 200ం వికెట్లు, 150ం వికెట్లు తీసిన ఏకైక బౌలర్ రషీద్ ఖాన్. ఇటు ఐపీఎల్‌లోనూ 150ం వికెట్లు పడగొట్టడం గమనార్హం. అంతర్జాతీయ టీ20ల్లో 179 వికెట్లు, ఐపీఎల్‌లో 158 వికెట్లు తీశాడు.

**బంగ్లాపై అద్భుత విజయం..**

అబుదాబీ వేదికగా అఫ్గానిస్థాన్ - బంగ్లాదేశ్ జట్ల మధ్య తొలి వన్డే జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లా 48.5 ఓవర్లలో 221 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ మెహిదీ హసన్ మిరాజ్ (60), తౌహిద్ హృదోయ్ (56) హాఫ్ సెంచరీలు చేశారు. రషీద్ 3, అజ్మతుల్లా 3, ఘజన్‌ఫర్ 2, ఖరోటె 1 వికెట్ తీశారు. అనంతరం లక్ష్య ఛేదనలో ఓపెనర్ రహ్మతుల్లా గుర్బాజ్ (50), రహ్మత్ షా (50) అర్ధశతకాలతోపాటు అజ్మతుల్లా ఒమర్జాయ్ (40), హష్మతుల్లా షాహిది (33లి) రాణించారు. దీంతో 47.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయిన అఫ్గాన్ 226 పరుగులు చేసి విజయం సాధించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో అఫ్గాన్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

## అభిషేక్ గొప్ప ప్లేయరేమి కాదు..
## 3 బంతుల్లో ఔట్ చేస్తా! పాక్ బౌలర్ ఓవరాక్షన్

అంతర్జాతీయ టీ20ల్లో టీమిండియా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ వరల్డ్ నంబర్ 1 బ్యాటర్‌గా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. అభిషేక్ ఇటీవలే ముగిసిన ఆసియాకప్‌లో దుమ్మురేపాడు. ఈ మెగా టోర్నీలో 7 మ్యాచ్‌లు ఆడిన అభిషేక్ 200 స్ట్రైక్ రేట్‌తో 314 పరుగులు చేశాడు. ప్లేయర్ ఆఫ్‌ది టోర్నీగా నిలిచిన అభిషేక్ ఇన్నింగ్స్‌లలో మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ముఖ్యంగా ఈ ఖండాంతర టోర్నీలో దాయాది పాకిస్తాన్‌కు అభిషేక్ చుక్కలు చూపించాడు. ఒక ఫైనల్లో తప్ప మిగితా లీగ్, సూపర్-8లలో పాక్ బౌలర్లను శర్మ ఉతికారేశాడు. సూపర్-4 మ్యాచ్‌లో అయితే అభిషేక్ బ్యాటింగ్ జోరుకు పాక్ స్పీడ్‌స్టార్ హ్యారిస్ రౌఫ్ తన సహనాన్ని కోల్పోయాడు. అభిషేక్‌తో వాగ్వాదానికి దిగాడు. రౌఫ్‌కు అభిషేక్ బ్యాట్‌తోనే సమాధానం చెప్పాడు. ఈ పంజాబ్ క్రికెటర్ పాక్‌పై మూడు మ్యాచ్‌లు ఆడి 110 పరుగులు చేశాడు. ఇక



ఇది ఇలా ఉండగా.. తాజాగా అభిషేక్ శర్మపై పాకిస్తాన్ పేసర్ ఇహ్సానుల్లా ఓ ఛాలెంజ్ విసిరాడు. అభిషేక్ తన బౌలింగ్‌ను ఎదుర్కొలేడని.. కేవలం మూడు బంతుల్లో ఔట్ చేయగలని అతడు చెప్పుకొచ్చాడు. ఇహ్సానుల్లా పాక్ తరపున కేవలం 4 టీ20ల్లో మాత్రమే ఆడాడు. అభిషేక్‌తో కలిసి అతడు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. "నేను భారత్‌తో ఆడితే అభిషేక్ నా బౌలింగ్‌ను ఎదుర్కోలేడు. అతడిని ఔట్ చేయడానికి నాకు కేవలం మూడు బంతులు చాలు అని ఓ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇహ్సానుల్లా పేర్కొన్నాడు. ఈ పాక్ ఆటగాడికి ఇండియన్ ఫ్యాన్స్ కౌంటరిస్తున్నారు. ఆసియాకప్ మ్యాచ్‌లు చూడలేదా? అయితే మీ బౌలర్లను అభిషేక్ గురించి అడుగు అని పోస్ట్‌లు పెడుతున్నారు. అభిషేక్ తిరిగి భారత జట్టు తరపున ఈ నెలలో ఆస్ట్రేలియాతో జరగనున్న టీ20 సిరీస్‌లో ఆడనున్నాడు.

## అతడిని ఎందుకు సెలక్ట్ చేస్తున్నారో అర్థం కాదు



ఆస్ట్రేలియా సిరీస్ నేపథ్యంలో టీమిండియా సెలక్టర్ల తీరుపై భారత దిగ్గజ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. రెండేళ్ల క్రితం అద్భుతమైన డెలివరీ సంధించాడని.. అదే ప్రాతిపదికగా ఇప్పటికీ ఓ ఆటగాడికి జట్టులో స్థానం కల్పిస్తున్నారంటూ 'యువ పేసర్'ను టార్గెట్ చేశాడు.

**గిల్ సారథ్యంలో ..** వెస్టిండీస్ స్వదేశంలో టెస్టు సిరీస్ ముగిసిన తర్వాత టీమిండియా ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. ఆతిథ్య జట్టుతో అక్టోబరు 19- నవంబరు 8 వరకు మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌లు ఆడనుంది. ఇందుకు సంబంధించి భారత క్రికెట్ నియంత్రణ మండలి ఇప్పటికే జట్టును ప్రకటించింది. వన్డే కెప్టెన్‌గా రోహిత్ శర్మపై వేటు వేసిన బీసీసీఐ.. అతడి స్థానంలో శుబ్‌మన్ గిల్‌కు పగ్గాలు అప్పగించింది. ఇక ఆసీస్‌తో ఆడే వన్డే, టీ20 జట్లలో యువ పేసర్ హర్షిత్ రాణాకు చోటు దక్కడం గమనార్హం. ఈ నేపథ్యంలో అశ్విన్ ఘాటుగా స్పందించాడు.

**అతడిని ఎందుకు సెలక్ట్ చేస్తున్నారో అర్థం కాదు**

"అసలు అతడిని ఎందుకు సెలక్ట్ చేస్తున్నారో అర్థం కావడం లేదు. నాకైతే ఈ విషయం అంతుపట్టడం లేదు. రాణాను జట్టులో చేర్చడానికి గల కారణమేమిటో తెలుసుకునేందుకైనా సెలక్షన్ కమిటీ సమావేశంలో భాగమైతే బాగుండు అనిపిస్తోంది. ఆస్ట్రేలియాలో బ్యాట్‌తోనూ రాణించగల ఫాస్ట్‌బౌలర్ టీమిండియాకు అవసరం. ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్ చేయగలిగే బౌలర్‌ను వాళ్లు ఎంపిక చేయాలి. నాకైతే అతడి బ్యాటింగ్‌పై ఎలాంటి నమ్మకమూ లేదు. రెండేళ్ల క్రితం ఐపీఎల్ మ్యాచ్‌లో నితీశ్ కుమార్ రెడ్డిని అద్భుతమైన పేస్ డెలివరీతో అవుట్ చేసినందుకు.. నేటికీ ఆ ఒక్క కారణంతోనే వరుస అవకాశాలు ఇస్తున్నారు" అని అశ్విన్ వ్యంగ్యాస్త్రాలు సంధించాడు.

**గంభీర్‌కే చురకలు**

కాగా ఢిల్లీకి చెందిన హర్షిత్ రాణా ఐపీఎల్-2024లో కోల్‌కతా నైట్ రైడర్స్ టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఆ సమయంలో కేకేఆర్ మెంటార్‌గా ఉన్న గౌతం గంభీర్.. తర్వాత టీమిండియా హెడ్‌కోచ్ అయ్యాడు. ఈ క్రమంలో గంభీర్ ప్రియ శిష్యుడైన హర్షిత్ ఇప్పటికే మూడు ఫార్మాట్లలోనూ అరంగేట్రం చేయడమే కాదు.. వైఫల్యాలు ఎదురైనా జట్టులో వరుస అవకాశాలు దక్కించుకోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో అశూ పరోక్షంగా గంభీర్‌కు ఈ విధంగా చురకలు అంటించినట్లు తెలుస్తోంది.

# ఇండస్ట్రీకి వచ్చాక ప్రతీది నన్ను మార్చేసింది..

## 22 ఏళ్ల కెరీర్‌పై నయనతార నోట్



తన నటనతో లేడీ సూపర్‌స్టార్ అనే పేరును సొంతం చేసుకున్నారు నటి నయనతార భాషతో సంబంధం లేకుండా అగ్ర కథానాయకుల సినిమాల్లో నటిస్తూ అలరిస్తున్నారు. ఆమె ఇండస్ట్రీకి వచ్చి నేటికి 22 ఏళ్లు పూర్తైంది. ఈసందర్భంగా అభిమానులకు ధన్యవాదాలు తెలుపుతూ ఓ ఎమోషనల్ నోట్‌ను పంచుకున్నారు. "మొదటిసారి కెమెరా ముందు నిల్చొని నేటికి 22 ఏళ్లు అయింది. సినిమాలే నా ప్రపంచంగా మారతాయని అప్పుడు తెలియదు. అది తెలియకుండానే సినీ రంగ ప్రవేశం చేశాను. పరిశ్రమకు వచ్చిన తర్వాత ప్రతి షాట్, ప్రతి ఫ్రేమ్, ప్రతి నిశ్శబ్దం నన్ను మార్చేశాయి. నాకు ధైర్యాన్నిచ్చాయి. నన్ను నన్నుగా మలిచాయి. ఈ ప్రయాణంలో నాకు తోడుగా నిలిచిన ప్రతిఒక్కరికి ఎప్పటికీ రుణపడి ఉంటాను" అని నయనతార తన నోట్‌లో రాసుకొచ్చారు. 2003లో మలయాళ చిత్రం 'మనస్సినక్కరే' అనే చిత్రంతో నయనతార ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చారు. 'చంద్రముఖి'తో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ఆ తర్వాత తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో వరుస అవకాశాలతో మెప్పిస్తున్నారు. 'జవాన్'తో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. ప్రస్తుతం నయనతార చేతిలో 8 ప్రాజెక్ట్‌లు ఉన్నాయి. వాటిలో చిరంజీవి- అనిల్ రావిపూడి కాంబోలో రానున్న 'మన శంకరవరప్రసాద్ గారు' కూడా ఒకటి. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ సినిమా విడుదల కానుంది.

# నిహారిక అదిరిపోయే స్కెచ్...




మెగా డాటర్ నిహారిక కొణిదెల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మెగా కుటుంబం నుంచి వచ్చి, ఇండస్ట్రీలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారు నిహారిక.హీరోయిన్ గా ఒకప్పుడు రాణించిన ఈ బ్యూటీ, ఆ తర్వాత జడ్జిగా, ఇప్పుడు నిర్మాతగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలోనే గత సంవత్సరం కమిటీ కుర్రాళ్ళు అనే సినిమాతో మంచి సక్సెస్ అందుకున్నారు నిహారిక కొణిదెల. ఈ సినిమాకు యదు వంశీ దర్శకత్వం వహించారు. సందీప్ సరోజ్, యశ్వంత్, ఈశ్వర్ తదితరులు ఈ సినిమాలో ప్రత్యేక పాత్రలో మెరిశారు. కోనసీమలోని ఓ గ్రామంలో యువకుల చుట్టూ తిరిగే కథాంశాన్ని చాలా గ్రాండ్ గా వంశీ తెరకెక్కించారు. 2024 ఆగస్టు 9న రిలీజ్ అయిన ఈ సినిమా మంచి సక్సెస్ అందుకుంది. దాదాపు 9 కోట్లతో ఈ సినిమా తీస్తే, 25 కోట్ల వరకు కలెక్షన్స్ వచ్చాయి. అయితే యదు వంశీ, నిహారిక కొణిదెల కాంబినేషన్ లో మరో సినిమా సెట్స్ పైకి వెళ్లనున్నట్లు సమాచారం అందుతుంది. ఈ మేరకు కథ కూడా నిహారికకు చెప్పారట. 2026 సమయానికి ఈ సినిమా సెట్స్ పైకి వెళ్లే ఛాన్స్ ఉందట. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ పై సినిమా రానుంది. త్వరలోనే ఈ సినిమా పూర్తి వివరాలు బయటకు రానున్నాయని సమాచారం.

# పూజా రెమ్యూనరేషన్ తెలిస్తే బిత్తరపోవాల్సిందే?




టాలీవుడ్ ఇండస్ట్రీలో పూజా హెగ్డేకు ఉన్న క్రేజ్ అంతా కాదు. అప్పట్లో ఈ పొడుగు కాళ్ళ సుందరి స్టార్ హీరోలందరి సరసన సినిమాలు చేసింది. కానీ ఇప్పుడు ఆమెకు పెద్దగా అవకాశాలు రావడం లేదు. ఆచార్య సినిమా తర్వాత పూజా హెగ్డేకు ఛాన్సులు రాలేదు. గుంటూరు కారం సినిమాలో అవకాశం వచ్చినా మధ్యలో తీసేశారని ప్రచారం ఇప్పటికీ జరుగుతోంది. దీంతో అప్పటినుంచి తెలుగులో ఒక్క సినిమా అవకాశం దక్కించుకోలేదు పూజా హెగ్డే. ఇలాంటి నేపథ్యంలో ఇటీవల రజనీకాంత్ నటించిన కూలీ సినిమాలో ఐటమ్ సాంగ్ చేసింది ఈ బ్యూటీ.ఇక ఇప్పుడు దుల్కర్ సల్మాన్ సినిమాలో బంపర్ ఆఫర్ కొట్టేసింది పూజా హెగ్డే. వరుస హిట్లతో దూసుకు వెళ్తున్న దుల్కర్ సల్మాన్ సినిమాలో అవకాశం దక్కడమే గమనార్హం. అలాంటిది వరుస ఫెయిల్యూర్స్ ఎదుర్కొంటున్న పూజా హెగ్డే ఇందులో సెలెక్ట్ కావడం వింతే అని అంటున్నారు విశ్లేషకులు. ఈ మూవీ ఎస్ ఎల్వీ సినిమాస్ పతాకంపైన సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ మూవీకి రవి నేలకుడిటి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ లో శరా వేగంగా కొనసాగుతోంది. అయితే తాజాగా ఈ సినిమా నుంచి క్రేజీ అప్డేట్ బయటకు వచ్చింది. రాక రాక అవకాశం వచ్చిన ఈ సినిమాలో పూజా హెగ్డే భారీగా రెమ్యూనరేషన్ డిమాండ్ చేసిందట. ఏకంగా ఈ సినిమా కోసం మూడు కోట్ల రెమ్యూనరేషన్ తీసుకుంటుందట. అంతకుముందు మూడు కోట్ల కంటే తక్కువగానే తీసుకున్న పూజా, ఇప్పుడు 3 కోట్లు వసూలు చేయడంపై రకరకాల కామెంట్స్ వినిపిస్తున్నాయి. అయితే కూలీ సినిమాలో ఐటెం సాంగ్ దెబ్బకు ఆమె బ్రాండ్ పెరిగిందని కొంతమంది అంటున్నారు.

# వ్యక్తిగత జీవితంలోకి కెమెరా రాకూడదు



సెలబ్రిటీల వృత్తిపరమైన విషయాల కంటే వ్యక్తిగత విషయాలపైనే చాలా మందికి ఆసక్తి ఉంటుంది. అలాంటిది సినీ హీరోయిన్ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. వాళ్లు ఏం చేసినా వార్తే అవుతోంది. వారి వ్యక్తిగత జీవితాల గురించి రకరకాల వార్తలు వెలువడుతుంటాయి. ఇదే మంచిది కాదంటున్నారు నటి రష్మికా మందన్నా. ఈ భామ క్రేజ్ ఇప్పుడు మామూలుగా లేదు. నేషనల్ క్రష్‌గా వెలుగొందుతున్న రష్మికా మందన్నా ప్రస్తుతం బాలీవుడ్‌ను దున్నేస్తున్నారనే చెప్పాలి.ఇక తెలుగు,తమిళం భాషల్లోనూ నటిస్తూ పాన్ ఇండియా కథానాయకిగా రాణిస్తున్న ఈ బ్యూటీ టాలీవుడ్ నటుడు విజయ్ దేవరకొండతో ప్రేమలో ఉన్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఆయన్ని పెళ్లి చేసుకోనున్నట్లు ఆ మధ్య చెప్పకనే చెప్పారు. కాగా ఇటీవల విజయ్‌దేవరకొండ, ర?ష్మిక మందన్నాల వివాహ నిశ్చితార్థం చాలా నిడారంబరంగా జరిగినట్లు వార్తలు బలంగానే వెలువడ్డాయి. అయితే ఈ విషయాన్ని ఈ ఇద్దరిలో ఎవరూ బహిరంగంగా వెల్లడించలేదు. ఇలాంటి సరిస్థితుల్లో నటి రష్మిక మందన్నా ఇటవల ఒక భేటీలో పేర్కొంటూ లోపల ఏం జరుగుతోందన్నది ప్రపంచానికి తెలియదన్నారు. అదేవిధంగా మన వ్యక్తిగత జీవితాల్లోకి కెమెరా రాకూడదని అన్నారు.తాము వ్యక్తిగత విషయాలను ఆన్‌లైన్ వంటి సామాజిక మాధ్యమాల్లో వెల్లడించే వాళ్లం కాదన్నారు. అదే విధంగా ప్రజలు తమ వ్యక్తిగత జీవితాల గురించి ఏం అనుకుంటున్నారు అన్నది ముఖ్యం కాదనీ, తమ వృత్తిపరమైన జీవితాల గురించే ముఖ్యం అని పేర్కొన్నారు. రష్మిక మందన్నాకు వివాదాలు కొత్తేమీ కాదు. ఈమెను కన్నడ చిత్ర పరిశ్రమ బ్యాన్ చేసిందనే ప్రచారం వాడివేడిగా సాగింది. అయితే ఇప్పటి వరకూ తాను బ్యాన్ చేయబడలేదని రష్మిక మందన్నా స్పష్టం చేశారు. అదే విధంగా ఇంతకు ముందే కన్నడ నటుడు రక్షిత్ శెట్టితో నటి రష్మిక మందన్నా ప్రేమ వివాహ నిశ్చితార్థం వరకూ వెళ్లి ఆ తరువాత విడిపోయారు. ఆపై రష్మిక మందన్నా కన్నడ చిత్రాల్లో నటించలేదు. కాంతార చిత్రం విడుదలయిన సమయంలోనూ రష్మిక మందన్నా వివాదాలకు గురయ్యారు. ఆ చిత్రాన్ని తాను ఇంకా చూడలేదని పేర్కొనడంతో పెద్ద రచ్చే జరిగింది. అలాంటిది ఇటీవల కాంతారకు ప్రీక్వెల్‌గా రూపొందిన కాంతార ఛాప్టర్ 1 చిత్రాన్ని చూసిన తరువాత ఆ చిత్ర బృందానికి మెసేజ్ పెట్టినట్లు, వాళ్లు అందుకు థ్యాంక్స్ చెప్పినట్లు నటి రష్మికా మందన్నా పేర్కొన్నారు. మొత్తం మీద ఈ అమ్మడు ఏదో ఒక విషయంతో నిత్యం వార్తల్లో ఉంటున్నారు.



# పూణేలో 'పెద్ది' సాంగ్ చిత్రీకరణ

రామ్ చరణ్ నటిస్తున్న యాక్షన్ డ్రామా 'పెద్ది'. ఈ సినిమా చిత్రీకరణ శర వేగంగా జరుగుతోంది. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నారు. నేటి(గురువారం) నుంచి పూణేలో ప్రారంభమయ్యే నెక్స్ట్ షెడ్యూల్ కోసం టీం సిద్ధమవుతోంది. ఈ షెడ్యూల్‌లో రామ్ చరణ్, హీరోయిన్ జాన్వీ కపూర్ పై అద్భుతమైన పాటను చిత్రీకరించనున్నారు. దీని కోసం ఏఆర్ రెహమాన్ అదిరిపోయే సాంగ్‌ని కంపోజ్ చేశారు. ఈ సాంగ్‌కి జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఈ పాట విజువల్ ట్రీట్‌గా ఉండనుంది అని చిత్ర యూనిట్ తెలిపింది. చిత్రీకరణతోపాటు పోస్ట్-ప్రొడక్షన్ పనులు కూడా ఏకకాలంలో కొనసాగుతున్నాయి. షెడ్యూల్ ప్రకారం సినిమా పూర్తయ్యేలా టీమ్ ప్యాషన్‌తో పని చేస్తోంది. రామ్ చరణ్ తన పాత్ర కోసం కంప్లీట్‌గా మేకోవర్ అయ్యారు. కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు, జగపతిబాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా వచ్చే ఏడాది మార్చి 27న ఈ సినిమా పాన్-ఇండియా థియేట్రికల్ విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: బుచ్చిబాబు సాన, సమర్పణ: మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, నిర్మాత: వెంకట సతీష్ కిలారు, సంగీతం: ఏఆర్ రెహమాన్, డీవోపీ: ఆర్ రత్నవేలు, ప్రొడక్షన్ డిజైన్: అవినాష్ కొల్లా, ఎడిటర్: నవీన్ నూలి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వి.వై.ప్రవీణ్ కుమార్.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,